తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.TELTEL / 2013 /50370

గురువారం 19.06.2025 | సంపుటి :11 సంచిక : 331 | పేజీలు :12 వెల : రూ. 4/-

ప్రకటనల కోసం సంప్రదించండి

98483 28698






## నా సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ ఇవ్వను

- ఇది వ్యక్తిగత గోప్యతకు భంగం
- ఇప్పటికే సుప్రీం చెప్పింది: కేటీఆర్
- ఏసీబీకి భారాస నేత స్పష్టీకరణ



హైదరాబాద్(జనంసాక్షి): సెల్‌ఫోన్ అప్పగించాలన్న అంశంపై ఏసీబీ నోటీసుకు భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ లేఖ ద్వారా సమాధానం పంపారు. తన వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించే ఈ చర్యను అంగీకరించేది లేదని తెలిపినట్లు సమాచారం. ఫార్ములా–ఈ కార్ రేసు కేసులో కేటీఆర్ విచారణ ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయన సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ ఇవ్వాలని ఏసీబీ అధికారులు ఆదేశించారు. సెల్‌ఫోన్ స్వాధీనం ప్రాథమిక హక్కులకు, వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగిస్తుందని, ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు కూడా చెప్పిందని కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు. ఏసీబీ అధికారుల ఆదేశాలపై కేటీఆర్ తన న్యాయవాదులతో చర్చించారు. అనిశా అధికారులు ఆదేశించినట్లుగా మొబైల్ ఫోన్‌ను, ల్యాప్‌టాప్‌ను వారికి ఇవ్వాల్సిన అవసరం లేదని న్యాయవాదులు కేటీఆర్‌కు చెప్పినట్లు సమాచారం.

## శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్ర మళ్లీ వాయిదా



న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్ర మరోసారి వాయిదా పడింది. జూన్ 19న రోదసి యాత్ర

మిగతా 9లో..

## మేం బనకచర్లకు ఒప్పుకోవాలంటే..

### కృష్ణాలో 500.. గోదావరిలో 1000 టీఎంసీలకు

# ఎన్‌వోసీ ఇవ్వండి



### ప్రాజెక్టుకు అంకురార్పణ చేసింది కేసీఆర్, జగన్‌లే

- రాయలసీమకు గోదావరి జలాల తరలింపు ఆనాడే చర్చించుకున్నారు
- ఈ విషయమై కేసీఆర్ ఆనాడే ఒప్పుకొని సంతకం చేశారు
- ప్రభుత్వంపై బురద చల్లేందుకు బీఆర్ఎస్ రాజకీయాలు చేస్తోంది
- సచివాలయంలో మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి
- పలు సందర్భాల్లో కేసీఆర్ చేసిన వ్యాఖ్యల వీడియోలు ప్రదర్శించిన ముఖ్యమంత్రి

హైదరాబాద్(జనంసాక్షి): 2019 అక్టోబరులో కేసీఆర్, జగన్ కలిసి గోదావరి జలాలను రాయలసీమకు తరలించటంపై చర్చించుకున్నారు.. గోదావరి– బనకచర్ల ప్రాజెక్టుకు ఆనాడే అంకురార్పణ జరిగిందని సీఎం రేవంత రెడ్డి అన్నారు. రాజకీయాలు ఎలా ఉన్నా రైతుల విషయంలో రాజీ పడేది లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు విషయంపై అఖిలపక్ష ఎంపీలతో సమావేశం అనంతరం సీఎం మీడియాతో మాట్లాడారు. బనకచర్ల వ్యవహారంపై ఏ విధంగా ముందుకెళ్లాలనే అంశంపై మిగతా 2లో..

### నేడు ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి?

2లో

### హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ సెంటర్

- జీఎస్ఈసీ కేంద్రాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్
- డిజిటల్ భద్రతే దీని ప్రధాన లక్ష్యం
- తెలంగాణ రైజింగ్‌లో సంస్థ తోడ్పాటు అవసరమని వెల్లడి

2లో

## కలిసికట్టుగా ముందుకెళ్దాం

### బనకచర్లపై సచివాలయంలో అఖిలపక్ష ఎంపీలతో భేటీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



- రైతుల ప్రయోజనాలకు ప్రభుత్వం కట్టుబడి ఉంది
- బనకచర్లపై కేంద్రానికి ఫిర్యాదు చేస్తాం
- పోలవరం-బనకచర్లతో తెలంగాణకు అన్యాయం
- ఎంపీలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన ఉత్తమ్

హైదరాబాద్(జనంసాక్షి): మా ప్రభుత్వానికి తెలంగాణ రైతాంగ ప్రయోజనాలే ముఖ్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బనకచర్లపై సచివాలయంలో అఖిలపక్ష ఎంపీలతో భేటీ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ" రాజకీయాలకు అతీతంగా రైతుల ప్రయోజనాలు ఎజెండాగా మనం ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా మనందరం కలిసి పనిచేయాలి. రాజకీయ లబ్ది కోసం ఈ సమావేశం ఏర్పాటు చేయలేదు రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఈ సమావేశం ఏర్పాటు చేశాం.తెలంగాణ ఏర్పడిన తరువాత కేంద్రం

మిగతా 2లో..




## 9 రోజుల్లో 9 వేల కోట్లు..

### రైతు భరోసా నిధులు జమ చేస్తాం : డిప్యూటీ సీఎం భట్టి

### 3 రోజుల్లో రూ. 5,215 కోట్లు ఖాతాల్లో వేశామని వెల్లడి


మధిర(జనంసాక్షి): 9 రోజుల్లో 9,000 కోట్ల రైతు భరోసా నిధులు అన్నదాతల ఖాతాలో జమ చేసి తీరుతామని డిప్యూటీ సీఎం, ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం ఆయన మధిర నియోజకవర్గం బోనకల్ మండలం జానకిపురంలో ఏర్పాటుచేసిన సభలో ప్రసంగించారు. ఈనెల 16న ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రైతు సోదరులకు పెట్టుబడి సహాయంగా రైతు భరోసా నిధులను జమ చేస్తూ వస్తున్నామని డిప్యూటీ సీఎం వివరించారు.రాష్ట్రంలో సాగు యోగ్యమైన 1,49,39,11 కోట్ల ఎకరాలకు తొమ్మిది వేల కోట్లు జమ చేయనున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. రైతుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అన్నదాతల సంక్షేమం కోసం ఉచిత విద్యుత్తు, రైతు భరోసా, రైతు బీమా వంటి కార్యక్రమాలతో ప్రతి సంవత్సరం రైతుల కోసం 70 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం, ఐదు సంవత్సరాల కాలంలో రైతుల కోసం మూడున్నర లక్షల కోట్లు ఖర్చు చేయనున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. పదేళ్లు పరిపాలించిన వారు వరి వేస్తే ఉరే అన్నారు, మేము వ్యవసాయాన్ని పండుగల మారుస్తున్నాం, సరిగ్గా వానాకాలం సీజన్ ప్రారంభానికి ముందే రైతులకు పెట్టుబడి సాయంగా రైతు భరోసా నిధులను జమ చేస్తున్నామని తెలిపారు. వ్యవసాయాన్ని పండుగలా మార్చి వరి ఉత్పత్తి పెంచి రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టాం అన్నారు. వరితోపాటు ఇతర పంటల ఉత్పత్తి రాష్ట్రంలో గణనీయంగా పెంచేందుకు అవసరమైన అన్ని చర్యలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు.

### తూర్పు కనుమల్లో

## అస్తమించిన రవి

- అల్లూరి జిల్లాలో ఎన్‌కౌంటర్‌లో గాజర్ల రవి మృతి
- ఆయనతో పాటు మరో ఇద్దరు కీలకనేతలు కూడా..
- మృతుల్లో అరుణ,అంజు ఉన్నట్లు గుర్తింపు
- రవి మృతితో సొంతూరు వెలిశాలలో విషాదం
- రవిపై రూ.25 లక్ష రివార్డు ప్రకటించిన ప్రభుత్వం





రంపచోడవరం(జనంసాక్షి):మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. మరో అగ్రనేత హతమ య్యాడు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎదురుకా ల్పులు జరిగాయి. దేవీపట్నం మండలం కొండమొ దలు అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు, మావో యిస్టుల మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టు కీలక నేతలు మృతిచెందారు. వీరిలో ఇటీవల మృతిచెందిన మావోయిస్టు అగ్రనేత చలపతి రావు భార్య, స్పెషల్ జోన్ కమిటీ సభ్యురాలు అరుణ తో పాటు కేంద్ర కమిటీ సభ్యుడుయ గాజర్ల రవి అలి యాస్ ఉదయ్, ఏవోబీ స్పెషల్ జోన్ కమిటీ ఏసీఎం అంజు ఉన్నట్లు గుర్తించారు. ఘటనాస్థలంలో మూ డు ఏకే 47 రైఫిల్స్‌ను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. 2018లో మిగతా 2,3లో..

## కొలిమంటుకున్న పశ్చిమాసియా

### తీవ్రరూపం దాల్చిన ఇరాన్-ఇజ్రాయెల్ ఘర్షణలు • టెహ్రాన్‌పై విరుచుకుపడిన టెల్‌అవీవ్

- వైమానిక దాడుల్లో 585 మంది మృతి
- ఇరాన్ అనుమూలాలపై ఇజ్రాయెల్ దాడులు
- సెంట్రిఫ్యూజ్‌ల తయారీ కేంద్రంపై బాంబుల వర్షం
- 1100 లక్ష్యాలను ధ్వంసం చేశామన్న నెతన్యాహు
- నతాంజ్ అణుకేంద్రం కూడా ధ్వంసం..
- ఇరాన్‌కూడా ఇజ్రాయెల్‌పై ఎడాపెడా దాడులు



టెల్‌అవీవ్,టెహ్రాన్(జనంసాక్షి):ఇరాన్ సైనిక స్థావరాలు, చమురు క్షేత్రాలు, అణుశుద్ధి కేంద్రాలను లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయెల్ భీకర దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ దాడులతో టెహ్రాన్‌లోని పలు కీలక ప్రాంతాలు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. తాజాగా ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో ఇరాన్‌లో 585 మంది మృతి చెందినట్లు మానవ హక్కుల సంఘాలు తెలిపాయి. దాదాపు 1326 మంది గాయపడినట్లు పేర్కొన్నారు. మృతుల్లో 239 మంది టెహ్రాన్ పౌరులు, 126 మంది భద్రతా సిబ్బంది ఉన్నట్లు సమాచారం. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. మిగతా 2లో..


### యుద్ధం మొదలైంది



- లొంగిపోయే ప్రసక్తే లేదు
- ట్రంప్ హెచ్చరికపై ధీటుగా స్పందించిన ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ
- ట్రంప్ మితిమీరితే ఆయనకూ ఇదే గతిపడుతుంది
- తమపై దాడి చేసి ఇజ్రాయెల్ భారీ తప్పిదం చేసింది.. మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరిక

2లో

### ఇరాన్ హద్దులుదాటింది



- దీనిపై స్పందించడం ఇప్పటికే చాలా ఆలస్యమైంది
- నేనేం చేస్తానో ఎవరికీ తెలియదు
- ఖమేనీ హెచ్చరికలపై ట్రంప్ స్పందన

2లో

### పెండింగ్ ప్రాజెక్టులపై

## భారాస పోరుబాట

- ఈ విషయంలో ప్రభుత్వానిది ఉద్దేశ్యపూర్వక నిర్లక్ష్యం
- కేసీఆర్ అధ్యక్షతన త్వరలో బీఆర్ఎస్ నేతల భేటీ
- తెలంగాణ రైతాంగం పక్షాన పోరాటానికి పార్టీ సిద్ధం

హైదరాబాద్(జనంసాక్షి):బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. త్వరలో పార్టీ ముఖ్య నేతలతో కేసీఆర్ సమావేశం కానున్నారు. ఇక రైతుల పక్షాన మరో పోరాటానికి సిద్ధమవుతున్నారు. తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టులపై కాంగ్రెస్ వైఖరికి వ్యతిరేకంగా సమావేశం ఏర్పాటు చేయనున్నారు. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులపై కాంగ్రెస్ చూపిస్తున్న ఉద్దేశపూర్వక నిర్లక్ష్యంపై తెలంగాణ రైతాంగం తరపున పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ రెడీ అయింది.

మిగతా 2లో..

## విచారణ జరిగే కొద్దీ వెలుగులోకి అక్రమాలు

- ఫోన్ ట్యాపింగ్‌లో కొత్త విషయాలు
- 4200 మందికి పైగా వ్యక్తుల ఫోన్లు ట్యాప్
- సిట్ కార్యాలయానికి ట్యాపింగ్ బాధితులు
- ఫిర్యాదులు చేస్తున్న పలువురు వ్యక్తులు
- సిట్ విచారణకు హాజరైన ప్రణీత్‌రావు



హైదరాబాద్(జనంసాక్షి):ఫోన్ ట్యాపింగ్ కేసు తెలంగాణ రాష్ట్రంలో తీవ్ర రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందే కొన్ని పార్టీలు లేదా వ్యక్తులు ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేస్తున్నారన్న నెపంతో, పలువురు కీలక రాజకీయ నాయకుల ఫోన్‌లు ట్యాప్ చేసినట్లు వెల్లడవుతోంది. తాజాగా ఈ కేసులో 4200 మందికి పైగా వ్యక్తుల ఫోన్లు ట్యాప్ చేసినట్లు ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావుపై ఆరోపణలు వచ్చాయి. 2023 నవంబర్ 15 నుండి 30వ తేదీ మధ్యలోనే కనీసం 618 మంది నేతల ఫోన్లను ట్యాప్ చేశారట. ఇందులో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వైసీపీ నాయకులు కూడా ఉన్నారు. గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేశ్ రెడ్డి, కోటింరెడ్డి వినయ్ కుమార్ రెడ్డి వంటి నాయకుల ఫోన్లను కూడా ప్రభాకర్ రావు నేతృత్వంలోని బృందం ట్యాప్ చేసినట్లు సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్‌తో పాటు కాంగ్రెస్, బీజేపీ సహా అనేక పార్టీల కీలక నేతలు, అనుచరుల ఫోన్లు కూడా ట్యాపింగ్ లక్ష్యంగా మారాయి. ఈ వ్యవహారంపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) వేగంగా దర్యాప్తు కొనసాగిస్తోంది. నిన్న ఒక్కరోజే తొమ్మిది మంది సాక్షుల స్టేట్‌మెంట్‌లు రికార్డు చేశారు. అందులో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, గద్వాల మాజీ జడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఆమె భర్త మిగతా 2లో..

### రైతుభరోసాపై మాట్లాడే

## అర్హత లేదు

బిఆర్ఎస్ నాయకులకు మంత్రి తుమ్మల కౌంటర్

వరుసగా నాలుగోరోజు రైతు ఖాతాల్లో నగదు జమ



హైదరాబాద్(జనంసాక్షి): రైతుభరోసా విషయంలో భారాస నాయకులకు తమ ప్రభుత్వాన్ని ప్రశ్నించే నైతిక హక్కు లేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గతంలో భారాస ప్రభుత్వం ఒక సందర్భంలో మినహా వానాకాలం రైతుబంధు సహాయం ఎప్పుడూ సాగు కాలానికి ముందుగా ఇవ్వలేకపోయింది. ప్రతిసారి ఆలస్యంగా రైతు బంధు నిధులు రైతుల ఖాతాల్లోకి జమ చేసింది. కానీ తాము ప్రకటించిన మేరకు నిధులు విడుదల చేస్తున్నామని అన్నారు. రైతుభరోసా పథకం కింద ఎకరాకు రూ.5 వేల నుంచి రూ.6 వేలకు పెట్టుబడి సహాయం పెంచి రైతులకు

మిగతా 2లో..

### ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా మానవాళికి

# పెనుముప్పే



- దానికి మద్దతిస్తే మూల్యం చెల్లించుకోక తప్పదు
- జి7 సదస్సులో ప్రధాని మోడీ స్పష్టీకరణ

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఉగ్రవాదం ఎక్కడున్నా, ఏ రూపంలో ఉన్నా అది మానవాళికి ప్రధాన శత్రువని భారత ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. కెనడాలో జరిగిన జీ7 సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఉగ్రవాదాన్ని బహిరంగంగా సమర్థించే దేశాలు తగిన మూల్యం చెల్లించుకుంటాయని హెచ్చరించారు. ఏప్రిల్‌లో జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి మానవత్వంపై జరిగిన దాడగా మోదీ అభివర్ణించారు. ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలకు చోటు ఉండకూడదన్నా రు. ఉగ్రవాదం మానవాళికి శత్రువు. ప్రజా స్వామ్య విలువలను నిలబెట్టే అన్ని దేశాలు దీన్ని వ్యతిరేకించాలి. ప్రపంచ శాంతి, శ్రేయస్సు కోసం మన ఆలోచనలు, విధానాలు స్పష్టంగా ఉండాలి. ఏదైనా దేశం ఉగ్రవాదానికి మద్దతిస్తే అందుకు ఆ దేశం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని మోదీ పేర్కొన్నారు. గ్లోబల్ సౌత్ దేశాలు అనిశ్చితి, సంఘర్షణలతో

మిగతా 2లో..

### భారత్-పాక్ ఒప్పందంలో మీ ప్రమేయం లేదు

ట్రంప్‌కు స్పష్టం చేసిన మోదీ

వార్త 2లో

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
19.06.2025

# బ్రహ్మోస్ ఏరోస్పేస్ విస్తరణ హైదరాబాద్ అనుకూలాలలం

– సిఎం రేవంత్



హైదరాబాద్(జనంసాక్షి): హైదరాబాద్ లో బ్రహ్మోస్ ఏరోస్పేస్ సంస్థను విస్తరించాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. హైదరాబాద్, బెంగుళూరు డిఫెన్స్ కారిడార్ ఏర్పాటు చేసేందుకు అనుకూలమైనవని రేవంత్ వివరించారు. ఇప్పటికే హైదరాబాద్ లో డిఫెన్స్ కు సంబంధించి వివిధ సంస్థలు ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బ్రహ్మోస్ ఏరోస్పేస్ ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. బ్రహ్మోస్ ఏరోస్పేస్ ఎండీ / సీఈవో డా, జైతీర్థ్ ఆర్. జోషి, బ్రహ్మోస్ హైదరాబాద్ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ సూరంపూడి సాంబశివ ప్రసాద్, డీఆర్‌డీఎల్ డైరెక్టర్ జీ.ఏ. శ్రీనివాస మూర్తి, తదితరులు సీఎంతో భేటీ అయ్యారు. దేశంలో పెట్టుబడులకు తెలంగాణ అనుకూల ప్రదేశమని చెప్పారు.బ్రహ్మోస్ ఏరోస్పేస్ విస్తరణకు తెలంగాణ, హైదరాబాద్‌ను ఎంచుకోవాలని, ప్రభుత్వం వైపు నుంచి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు. సీఎం వాదనలపై బ్రహ్మోస్ ఏరోస్పేస్ బృందం సానుకూలంగా స్పందించింది. ఈ భేటీలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు.

## తూర్పు కనుమల్లో అస్తమించిన రవి

డుంబ్రిగుడ సమీపంలో జరిగిన ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సివేరి సోమ హత్య కేసులో అరుణ నిందితు రాలిగా ఉన్నారు. ఆమె స్వస్థలం విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం కరకవానిపాలెం. ఉదయ్‌పై రూ.25లక్షలు, అరుణపై రూ.20లక్షల రివార్డు ఉంది. మావోయిస్టుల మృతదేహాలను రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తీసుకురానున్నారు. కాల్పులు జరిగిన ప్రాంతానికి మారేడుమిల్లి సీఐ, దేవీపట్నం ఎస్సై, పోలీసు సిబ్బంది బయల్దేరారు.

రవి మృతితో సొంతూరు వెలిశాలలో విషాదం

ఉత్తరాంధ్రలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా వెలిశాలకు చెందిన గాజర్ల రవి మృతి చెందాడు. ఈ ఘటనతో జయశంకర్ భూపాల పల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని వెలిశాల ఉలిక్కిపడింది. నాడు విప్లవ ఉద్యమానికి ఊతమిచ్చిన వెలిశాల.. నేడు శోకసంద్రంలో మునిగింది. ఇదే గ్రామానికి చెందిన మావోయిస్ట్ పార్టీ అగ్రనేత గాజర్ల రవి అలియాస్ ఉదయ్, మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్ లో మృతిచెందారు. గాజర్ల రవి మృతి చెందడంతో కుటుంబసభ్యులు, బంధు మిత్రులు శోకసంద్రంలో మునిగారు. నాలుగు దశాబ్దాల క్రితం పీపుల్స్ వార్ ఉద్యమంలోకి వెళ్లిన గాజర్ల రవి అంచెలంచెలుగా ఎదిగారు. దళ సభ్యుడి స్థాయి నుంచి కేంద్ర కమిటీ స్థాయికి ఎదిగారు.

## రైతుభరోసాపై మాట్లాడే అర్హత లేదు

అందజేస్తున్నాం. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఇవ్వాల్సిన యాసంగి సీజన్ సంబంధించిన రైతుబంధు నిధులు ఇవ్వకుండా గత ప్రభుత్వం వదిలేస్తే.. మేం అధికారంలోకి రాగానే ఆ నిధులు కూడా చెల్లించాం. రైతుల సంక్షేమం కోసం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే దాదాపు రూ.77,000 కోట్లు రైతు సంక్షేమం కోసం ఖర్చు పెట్టిన ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని తుమ్మల అన్నారు. రాష్ట్రంలో రైతుభరోసా పథకం కింద రైతుల బ్యాంకు ఖాతాల్లోకి పెట్టుబడి సాయం జమ కొనసాగుతోంది. మూడో రోజు బుధవారం 4 ఎకరాల విస్తీర్ణం వరకు రైతుభరోసా నిధులు జమ కోసం ప్రభుత్వం మరో రూ.1,313.53 కోట్లు విడుదల చేసింది. మరో 21.89 లక్షల ఎకరాలకు సంబంధించి 6.33 లక్షల మంది రైతులు లబ్దిపొందుతున్నారు. ఇప్పటి వరకు మొత్తం రూ.5215.26 కోట్లు రైతుభరోసా కోసం విడుదల చేసి 58.04 లక్షల మంది రైతులకు సాయం అందించినట్లైంది. 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వరుసగా మూడో రోజు రైతుభరోసా నిధులు విడుదల చేసినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఎకరాలతో సంబంధం లేకుండా సాగు యోగ్యమైన అన్ని భూములకు ఈ సహాయం అందిస్తామని స్పష్టం చేశారు. సీఎం ఇచ్చిన హామీ మేరకు వానాకాలం రైతుభరోసా నిధులు జమ చేస్తున్నాం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా 9 రోజుల్లో రైతుభరోసా సహాయం పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇప్పటికైనా భారాస నాయకులు ఆత్మ విమర్శ చేసుకుని ప్రభుత్వంపై విమర్శలు మానుకోవాలి. లేదంటే రైతాంగం ఎప్పటికీ క్షమించదు‘అని మంత్రి తుమ్మల అన్నారు.

## విచారణ జరిగే కొద్దీ వెలుగులోకి అక్రమాలు

తిరుపతయ్య, గాంధీ భవన్‌కు చెందిన నలుగురు ఉద్యోగులు ఉన్నారు. ఇవన్నీ మొబైల్ సర్వీస్ ప్రొవైడర్లు ఇచ్చిన ఆధారాలతో వెలుగులోకి వచ్చాయి. ఈ రోజు పీసీసీ అధికార ప్రతినిధి జయపాల్ రెడ్డి సిట్ ముందు హాజరై స్టేట్‌మెంట్ ఇచ్చారు. అదే విధంగా ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్ రావును కూడా విచారించారు.

**సిట్ విచారణకు హాజరైన ప్రణీత్‌రావు**

హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణ కొనసాగుతోంది. ఈ విచారణకు నిందితుడు ప్రణీత్‌రావు బుధవారం హాజరయ్యారు. ఎన్నికల ముందు ఎస్ఐబీలో స్పెషల్ ఆపరేషన్ టార్గెట్‌ను ఆయన లీడ్ చేశాడు. రాజకీయ నేతలు, ప్రముఖుల ఫోన్లను ట్యాపింగ్ చేశాడు. ఎస్ఐబీ మాజీ ఓఎస్డీ ప్రభాకరరావు ఆదేశాలతో ప్రణీత్‌రావు హార్డ్ డిస్కులను ధ్వంసం చేశాడు. నాగోల్ వద్ద మూసీ నదిలో వాటిని పడేశాడు.ఫోన్ ట్యాపింగ్ కేసులో సాక్షుల వాంగ్మూలాలను సిట్ రికార్డు చేస్తోంది. సాక్షిగా వాంగ్మూలం ఇచ్చేందుకు సిట్ ఎదుట టీపీసీసీ అధికార ప్రతినిధి జైపాల్‌రెడ్డి హాజరయ్యారు.

**సిట్ కార్యాలయానికి ట్యాపింగ్ బాధితులు**

తెలంగాణలో సంచలనం సృష్టిస్తోన్న ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులు దూకుడు పెంచారు. ఈ కేసులో దర్యాప్తును సిట్ వేగవంతం చేసింది. ఫోన్ ట్యాపింగ్‌కు గురైన బాధితులకు సిట్ అధికారులు సమాచారం ఇచ్చారు. దీంతో వాంగ్మూలం ఇచ్చేందుకు జూబ్లీహిల్స్ సిట్ కార్యాలయానికి ఫోన్ ట్యాపింగ్ బాధితులు క్యూ కడుతున్నారు. బాధితుల నుంచి వాంగ్మూలాన్ని సేకరిస్తోంది సిట్. బుధవారం టీపీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్ రెడ్డి వాంగ్మూలం ఇచ్చేందుకు సిట్ కార్యాలయానికి వచ్చారు. సిట్ అధికారుల నుంచి తన ఫోన్ ట్యాప్ అయినట్టు సమాచారం వచ్చిందని జైపాల్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. .

## పెండింగ్ ప్రాజెక్టులపై భారాస పోరుబాట

సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యంపై చర్చించేందుకు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సారథ్యంలో త్వరలోనే కీలక సమావేశాన్ని ఏర్పాటు చేయబోతున్నది. బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు హాజరయ్యే ఈ ఉన్నతస్థాయి సమావేశంలో సాగునీటి ప్రాజెక్టుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అలసత్వం, రైతు వ్యతిరేక వైఖరిపై ప్రధానంగా చర్చిస్తారు. కృష్ణ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం పైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మౌనం వహించడంపైన చర్చించనున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో 90 శాతం పూర్తి అయిన పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పక్కనబెట్టడంతో పాటు 2 పిల్లర్లు కుంగాయన్న సాకుతో మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టును ఎండబెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలను నాయకులకు కేసీఆర్ వివరిస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యంతో కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో లక్షల ఎకరాల్లో రైతులకు సాగునీరు అందకుండా పోతున్నది. రాజకీయ దురుద్దేశంతోనే అన్నదాతలపైన కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కక్ష కట్టినట్లు వ్యవహరిస్తున్న నేపథ్యంలో తదుపరి కార్యాచరణ పై చర్చించనున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కాకుండా ప్రభుత్వం చూపుతున్న అలసత్వం వలన తెలంగాణకు తీరని నష్టం కలుగుతుందని, ఈ అంశంలో ఉద్యమ కార్యాచరణకు బీఆర్‌ఎస్ ప్రణాళికలు సిద్ధం చేయనుంది.

## మేం బనకచర్లకు ఒప్పుకోవాలంటే కృష్ణాలో 500.. గోదావరిలో 1000 టీఎంసీలకు

# ఎన్వోసీ ఇవ్వండి



విపక్షాలతో చర్చించినట్లు చెప్పారు. తెలంగాణకు గోదావరి, కృష్ణా నదులే జీవనాధారమని, ఈ ప్రభుత్వానికి రైతుల ప్రయోజనాలే ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. గతంలో కేసీఆర్ చేసిన వ్యాఖ్యల వీడియోలు సీఎం రేవంత్ రెడ్డి ప్రదర్శిం చారు. గోదావరి జలాలపై 2019 అక్టోబర్‌లో కేసీఆర్, జగన్ సమావేశమయ్యారని, గోదావరి జలాలను రాయలసీమకు తరలించటంపై చర్చించుకున్నారని అన్నారు. సీమకు గోదావరి జలాల తరలింపులో సహకరిస్తానని కేసీఆర్ అన్నట్లు నమస్తే తెలంగాణలో రాశారని తెలిపారు. అపెక్స్ కౌన్సిల్ భేటీలో ఎవరు ఏం మాట్లాడారో అంతా దస్త్రాల రూపంలో ఉందని, రాయలసీమకు గోదావరి జలాల తరలింపుపై చర్చించుకున్నామని ఆనాడు తెలంగాణ, ఏపీ మంత్రులు మీడియాకు చెప్పారని గుర్తు చేశారు .కేసీఆర్– జగన్ చర్చల సారాంశాన్ని తెలంగాణ, ఏపీ మంత్రులు మీడియాకు చెప్పారని అన్నారు. అపెక్స్ కౌన్సిల్ భేటీలో పాల్గొని కేంద్రానికి కేసీఆర్, హరీశ్‌రావు ఏం చెప్పారో అందరికీ తెలియాలని, రైతుల ప్రయోజనాలను కాపాడాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. కొన్ని వాస్తవాలను కూడా ప్రజల ముందు ఉంచుతున్నామని, ఎంతో అనుభవం ఉంద న్న వారే రాష్ట్రానికి నష్టం చేశారని విమర్శిచారు. ప్రజలను బీఆర్‌ఎస్ తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక విధంగా, అధికారం పోయాక మరో విధంగా మాట్లాడుతున్నాం ని,చచ్చిపోయిన పార్టీని బతికిం చుకునేందుకు మళ్లీ ఉద్వేగాలు రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. సాగునీటి పారుదలశాఖ పదేళ్ల పాటు కేసీఆర్ కుటుం బం చేతిలోనే ఉందని, ఈ ప్రభుత్వంపై బురద చల్లేందుకు బీఆర్‌ఎస్ రాజకీయాలు చేస్తోందని, తెలంగాణకు గోదావరి, కృష్ణా నదులే జీవనాధా రమని సీఎం అన్నారు. 21–9–2016న కేంద్ర ప్రభుత్వం అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహిం చిందని, ఏటా 3వేల టీఎంసీల నీరు వృథాగా గోదావరి నీరు సముద్రంలో కలు స్తోందని అపెక్స్ కౌన్సిల్ భేటీలో కేసీఆర్ అన్నారని, 3వేల టీఎంసీలు వృథాగా పోతున్నాయని మొదట మాట్లాడింది కేసీఆ ఒనన తెలిపారు. గోదా వరి–బనకచర్లపై అవసర మైతే సుప్రీంకోర్టుకైనా వెళ్లాలని భావిస్తున్నామని, నీటి ఒప్పందాలపై నిపుణు లైన న్యాయవాదులను నియమించుకుంటామని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తామని, గోదావరి– బనకచర్లను వ్యతిరేకిస్తూ తీర్మా నం చేసి కేంద్రానికి పంపాలని నిర్ణ యించామన అన్నారు. అన్ని పార్టీలను కలుపుకొని పోరాడుతామని స్పష్టం చేశారు.కాగా మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అభ్యంతరం తెలిపారు. ఆనాడు తెలంగాణ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని కేసీఆర్ మాట్లాడారని వివరణ ఇచ్చారు. కృష్ణానదిని కలుపుతూ గోదావరి జలాలు తీసుకెళ్తే అభ్యంతరం లేదని కేసీఆర్ అన్నారని గుర్తు చేశారు.

## కలిసికట్టుగా ముందుకెళ్దాం

21–9–2016 అపెక్స్ కౌ న్సిల్ సమావేశం ఏర్పాటు చేసింది. ఆ సమావేశంలో మొట్టమొదట గోదావరిపై 3 వేల టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయని ఆనాటి సీఎం కెసీఆర్ ప్రతిపాదన ఇచ్చారు. ఆ సమావేశంలో హరీష్ రావుగారు కూడా పాల్గొన్నారు.మళ్లీ 13 ఆగస్టు 2019 లో రాయలసీమను రతనాల సీమ చేస్తామని ఆనాటి తెలంగాణ సీఎం కెసీఆర్ ప్రకటించారు.గోదావరి జలాలలను రాయలసీమకు తరలించాలని కెసిఆర్, జగన్ ప్రగతి భవన్ లో నాలుగుసార్లు సమావేశమయి నిర్ణయం తీసుకున్నారు. ఇరు రాష్ట్రాల సిఎంల భేటీ వివరాలను ఆనాటి మంత్రులు ఈటెల రాజేందర్ , బుగ్గన రాజేంద్ర ప్రసాద్ ప్రెస్ మీట్ పెట్టి వెల్లడించారు. ఈ మీటింగ్ మినిట్స్ ను రిఫరెన్స్ గా చూపి ఆంధ్రప్రదేశ్ తెలంగాణకు బనకచర్లను గుదిబండగా మార్చే ప్రయత్నం చేస్తోంది. ఇందుకు సమబంధించి అఫీషియల్ డాక్యుమెంట్స్ మీకు అందించడానికి సిద్ధంగా ఉన్నాం.బనకచర్ల అంశంపై పార్లమెంట్ సమావేశాల్లో ప్రధానితో సహా అందరి అపాయింట్మెంట్ తీసుకుని కలిసి తెలంగాణ సమస్యలను వివరిస్తాం.పొలిటికల్ ఫైట్ లో న్యాయం జరగకపోతే లీగల్ ఫైట్ చేద్దాం.ఈ విషయంలో మనందరం కలిసికట్టుగా ముందుకు వెళతాం.

**రైతుల ప్రయోజనాలకు ప్రభుత్వం కట్టుబడి ఉంది:ఉత్తమ్**

బనకచర్ల విషయంలో ఎపి దూకుడుకు కళ్లెం వేసేందుకు ప్రభుత్వం సిద్ధమయ్యింది. ఈ మేరకు గురువారం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సిఆర్ పాటిల్‌ని సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిల నేతృత్వంలోని బృందం కలవనుంది. బుధవారం సాయంత్రం గోదావరి–బనకచర్లపై ఎంపిలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సమావేశానికి సిఎం రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ ఎంపిలు, బిజెపి ఎంపిలు డికె అరుణ, రఘునందన్ రావు, బిఆర్ఎస్ ఎంపి రవిచంద్ర, ఎంఐఎం ఎంపి అసదుద్దీన్ ఓవైసీ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. పోలవరం–బనకచర్ల విషయంలో ఎపి విభజన చట్టాన్ని ఉల్లంఘిస్తోందని అన్నారు. ఎపి రిపోర్టుపై స్పందించాలని కేంద్రం తమని అడిగిందని తెలిపారు. పూర్తిస్థాయి నివేదికను కేంద్రానికి సమర్పిస్తామని ఉత్తమ్ పేర్కొన్నారు. తను, సిఎం ఢిల్లీకి వెళ్లి రాష్ట్ర అభ్యంతరాలను తెలుపుతామని స్పష్టం చేశారు. పోలవరం–బనకచర్ల లింక్ ప్రాజెక్టు తెలంగాణ నీటి హక్కులకు పెద్ద దెబ్బ అని తెలిపారు. ఈ ప్రాజెక్టును పరిశీలించడం అంటే రాష్ట్ర హక్కులను కాలరాయడమే అని అన్నారు. పోలవరం–బనకచర్ల ప్రాజెక్టును తిరస్కరించాలని కేంద్రానికి స్పష్టంగా చెప్పామని వెల్లడించారు. గోదావరి ట్రైబ్యునల్ అవార్డును బనకచర్ల ప్రాజెక్టు ఉల్లంఘిస్తుందని.. తెలంగాణకు అనుకూలమైన ఇచ్చంపల్లిని ఎపి వ్యతిరేకించిదని మండిపడ్డారు. అత్యవసరంగా పోలవరం ప్రాజెక్టు అథారిటీ సమావేశం ఏర్పాటు చేయాలని కోరామన్నారు. తెలంగాణ వాటా 968 టిఎంసిలలో కట్టుకొనే ప్రాజెక్టులను ఎపి వ్యతిరేకించిందని.. బనకచర్ల వల్ల మన వాటా జలాలకు కూడ భవిష్యత్తులో ఎదురుదెబ్బ తగులుతుందని అన్నారు. పూర్తయిన ప్రాజెక్టులకు అధిక కేటాయింపులను భవిష్యత్తులో ఎపి అడుగుతుందని పేర్కొన్నారు. దీనిపై కేంద్రానికి జనవరి 22న అభ్యంతరాలను చెప్పామన్నారు. అయితే ఎపి నుంచి డిపిఆర్ అందలేదని కేంద్రం సమాధానం ఇచ్చిందని తెలిపారు.గోదావరి–బనకచర్లపై అన్ని పార్టీలతో చర్చలు జరుపుతున్నాం. రాష్ట్ర రైతుల ప్రయోజనాలకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. గోదావరి–బనకచర్లపై ఏపీ ప్రభుత్వం కేంద్రానికి ఫీజిబులిటీ నివేదిక సమర్పించింది” అని వివరించారు.

## నేడు ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి?

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి నేడు దిల్లీ వెళ్లే అవకాశముంది. రెండు రోజుల పాటు ఆయన అక్కడ పర్యటించనున్నట్లు సమాచారం. కాంగ్రెస్ అగ్రనేతలను సీఎం కలిసే వీలుంది. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు, కార్పొరేషన్ ఛైర్మన్ల ఎంపికపై వారితో రేవంత్‌రెడ్డి చర్చించే అవకాశముంది.మరోవైపు బ్రిటన్ మాజీ ప్రధాని టోనీబ్లెయిర్, ఇతర అధికారులను సీఎం కలవనున్నట్లు సమాచారం. రాష్ట్రానికి పెట్టుబడులను ఆహ్వానించేందుకు వారితో చర్చించనున్నట్లు సమాచారం.

## హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ సెంటర్

**– జీఎస్ఈసీ కేంద్రాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్**
**– డిజిటల్ భద్రతే దీని ప్రధాన లక్ష్యం**
**– తెలంగాణ రైజింగ్‌లో సంస్థ తోడ్పాటు అవసరమని వెల్లడి**

హైదరాబాద్(జనంసాక్షి): ప్రపంచం మొత్తం డిజిటల్ యుగంగా మారుతోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. డిజిటల్ సమాచారం భద్రంగా ఉంటే ప్రజలు క్షేమంగా ఉన్నట్లే అని చెప్పారు. హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. జీఎస్ఈసీ కేంద్రాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. డిజిటల్ భద్రతే దీని ప్రధాన లక్ష్యమని చెప్పారు. ‘గూగుల్ ఇన్నోవేటివ్ కంపెనీ.. మాది ఇన్నోవేటివ్ ప్రభుత్వం. నైపుణ్యాలు పెంచేందుకు స్కిల్ వర్సిటీ ఏర్పాటు చేశాం. ఉత్తమ పెట్టుబడులకు గమ్యస్థానంగా తెలంగాణ మారుతోందని ఈ సందర్భంగా అన్నారు.. 2035 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ మారాలన్న లక్షయంతో ముందుకు వెళుతున్నామని అన్నారు. తెలంగాణ రైజింగ్‌లో భాగంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మారుస్తున్నాం అన్నారు. ఇక్కడి మహిళలు ధనిక పెట్టుబడిదారులకు పోటీదారులుగా మారుతున్నారు. ప్రభుత్వంలో నూతన ఆవిష్కరణలు, విధానాలు తీసుకొచ్చాం‘అని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో గూగుల్ మొదటి సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఇది ప్రపంచంలో ఐదవది మాత్రమే అని తెలిపారు. గూగుల్ ప్రారంభించినప్పటి నుంచి ప్రపంచం మారిపోయిందని.. నేడు మన జీవితాలు పూర్తిగా డిజిటల్‌గా మారాయన్నారు. గోప్యత, భద్రత గురించి నేడు ఆందోళన చెందుతున్నామని తెలిపారు. మన ఆర్థిక వ్యవస్థ, మన ప్రభుత్వం, మన జీవితాలు డిజిటల్‌గా మారాయి. డిజిటల్ సురక్షితంగా ఉంటే, మనం మరింత అభివృద్ధి చెందుతామని చెప్పుకొచ్చారు. అధునాతన సైబర్ సెక్యూరిటీ, భద్రతా పరిష్కారాల కోసం గూగుల్ ఈ సైబర్ సెక్యూరిటీ హబ్‌ను ఉపయోగి స్తున్నందుకు గర్విస్తున్నట్లు తెలిపారు. ఇది నైపుణ్య అభివృద్ధిపై దృష్టి పెడుతుందన్నారు. ఉపాధిని సృష్టించడంతో పాటు దేశం సైబర్ భద్రతా సామర్థ్యాన్ని పెంచుతుందన్నారు. చెడు చేయవద్దన్నది గూగుల్ సంస్థ సిద్దాంతమని.. ఈ విధానాన్ని తాను ఇష్టపడుతున్నట్లు తెలిపారు. గూగుల్‌లా, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మంచిని మాత్రమే చేస్తుందని నమ్ముతున్నానన్నారు. ఈ విధానం వల్ల ప్రయోజనాలు కొంత నెమ్మదిగా కనిపిస్తాయని.. అయితే మనం దీర్ఘకాలికంగా దృష్టిపెట్టి పనిచేయాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సంస్థలు ఉత్తమ పెట్టుబడికి అనుకూల రాష్ట్రం కోసం శోధిస్తే దానికి సమాధానం తెలంగాణ అని వస్తుందన్నారు.

## ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా మాళవాళికి పెనుముప్పే..

ఎక్కువగా బాధపడుతున్నాయని మోదీ వ్యాఖ్యా నించారు. ఆహారం, ఇంధనం, ఎరువులు, ఆర్థిక సంక్షోభాలతో ముందుగా దెబ్బతినేది వారేనన్నారు. గ్లోబల్ సౌత్‌లో నెలకొన్న ఆందోళనలు, ప్రాధాన్యతలను ప్రపంచ వేదికపై లేవనెత్తడాన్ని భారత్ తన బాధ్యతగా భావిస్తోందన్నారు. ఇక, ప్రధాని డీప్‌ఫేక్ గురించి కూడా మాట్లాడారు. ఇది చాలా ఆందోళన కలిగించే విషయమన్న మోదీ.. ఏఐ జనరేటెడ్ కంటెంట్‌పై వాటర్ మార్కింగ్ లేదా స్పష్టమైన గుర్తు ఉండాలన్నారు. ఈ శతాబ్దంలో సాంకేతికతపై పరస్పర సహకారం అవసరమన్నారు. కృత్రిమ మేధస్సు చుట్టూ ఉన్న ఆందోళనలను పరిష్కరించి, ఆవిష్కరణలు ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ పర్యటన నేపథ్యంలో మోదీ కెనడా ప్రధాని మార్క్ కార్నీ, యూకే ప్రధాని కీర్ స్టార్మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోని, జపాన్ ప్రధాని షిగెరు ఇషిబాతో సహా పలువురు ప్రపంచ నాయకులను కలిశారు. మూడు దేశాల పర్యటనలో భాగంగా ప్రధాని ఐరోపాలోని క్రొయేషియాకు వెళ్లనున్నారు. ఆ దేశంలో భారత ప్రధాని పర్యటించడం ఇదే తొలిసారి.

## భారత్–పాక్ ఒప్పందంలో మీ ప్రమేయం లేదు

– ట్రంప్‌తో మోదీ స్పష్టం

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత్–పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలను తామే ఆపామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల పదేపదే చాటుకున్న సంగతి తెలిసిందే.దీనిపై తీవ్ర చర్చే నడిచింది. ట్రంప్ ప్రకటనపై స్పష్టతనివ్వాలని అటు ప్రతిపక్షాలు కూడా డిమాండ్ చేశాయి. ఈక్రమంలోనే ప్రధానమంత్రి నరేంద్రమోదీ తొలిసారిగా దీనిపై స్పందించారు. భారత్–పాక్ మధ్య ఒప్పందం విషయంలో అమెరికా ప్రమేయం లేదని తేల్చిచెప్పారు. ఈ విషయాన్ని అగ్రరాజ్య అధ్యక్షుడికి స్పష్టంగా చెప్పినట్లు కేంద్ర విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వెల్లడించారు. “జీ7 శిఖరాగ్ర సదస్సు అనుబంధంగా ప్రధాని మోదీ–ట్రంప్ మధ్య ద్వైపాక్షిక భేటీ జరగాల్సి ఉంది. అయితే, అమెరికా అధ్యక్షుడు ముందుగానే వెళ్లిపోవడంతో వీరు సమావేశం కాలేకపోయారు. అనంతరం వీరిద్దరూ 35 నిమిషాల పాటు ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడి తర్వాత ట్రంప్.. మోదీకి ఫోన్ చేసి సంతాపం తెలియజేశారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చేసే పోరాటంలో అండగా ఉంటామన్నారు. ఆ తర్వాత నుంచి నుంచి వీరిద్దరూ మాట్లాడుకోవడం మళ్లీ ఇప్పుడే. కాబట్టి.. ‘ఆపరేషన్ సిందూర్ వివరాలను ప్రధాని మోదీ అమెరికా అధ్యక్షుడికి వివరించారు” అని మిస్రీ తెలిపారు.“పహల్గాం, ఆపరేషన్ సిందూర్ పరిణామాల సమయంలో భారత్–అమెరికా మధ్య ఏ స్థాయిలోనూ వాణిజ్య ఒప్పందం గురించి చర్చలు జరగలేదు. భారత్–పాకిస్థాన్ మధ్య అమెరికా మధ్యవర్తిత్వానికి అంశంపైనా చర్చలు కూడా జరగలేదు. కాల్పుల విరమణ ఒప్పందానికి సంబంధించి భారత్–పాక్ మధ్య మిలిటరీ స్థాయి చర్చలు జరిగాయి. పాక్ అభ్యర్థన మేరకే ‘ఆపరేషన్ సిందూర్’ను నిలిపివేశాం. ఇప్పుడు, ఎప్పుడూ.. భారత్ ఇతరుల మధ్యవర్తిత్వాన్ని అంగీకరిం చబోదనే విషయాన్ని ట్రంప్‌కు మోదీ స్పష్టంగా చెప్పారు.

# కొలిమంటుకున్న పశ్చిమాసియా



మరోవైపు, ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య పరస్పర క్షిపణి దాడులు కొనసాగుతున్నాయి. బుధవారం తెల్లవారుజామున టెహ్రాన్‌లోని పలు ప్రాంతాల్లో పేలుడు శబ్దాలు వినిపించాయి. సైరన్లు మోగాయి. అటు టెల్ అవీవ్‌లోనూ పేలుళ్లు సంభవించాయి. ఉద్రిక్తతల దృష్ట్యా జెరూసలెంలోని అమెరికా ఎంబసీని శుక్రవారం వరకు మూసివేస్తున్నట్లు సంబంధిత అధికారులు ప్రకటించారు. ఇజ్రాయెల్‌పై హైపర్ సోనిక్ క్షిపణిని ప్రయోగించినట్లు ఇరాన్ వెల్లడించింది. యుద్ధం తీవ్రమవుతుండడంతో వేల సంఖ్యలో ప్రజలు టెహ్రాన్‌ను వీడి సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్నారు. ఇరాన్– ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న యుద్ధంతో పశ్చిమాసియా కల్లోలంగా మారింది. ఇరుదేశాలు మిస్సైళ్లతో విరుచుకుపడుతున్నాయి. ఈ దాడుల నేపథ్యంలో ఇరాన్ సుప్రీంలీడర్ అయతొల్లా అలీ ఖమేనీని హతమారిస్తేనే యుద్ధం ముగుస్తుందని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు వ్యాఖ్యానించారు. అలా చేస్తే సంఘర్షణ మరింత పెరగదని, యుద్ధం ముగుస్తుందని పేర్కొన్నారు. ఈసందర్భంగా ఇరాన్ అణు లక్ష్యాలు ప్రపంచానికి ప్రమాదకరమని నెతన్యాహు అభివర్ణించారు. ఇక, ఇరాన్ దౌత్య చర్యలను ఆయన తోసిపుచ్చారు. అవి తప్పుదారి పట్టించేవన్నారు. తాజాగా ఇరాన్‌ను ట్రంప్ మరోసారి హెచ్చరించారు. ఆ దేశ సుప్రీం లీడర్ ఖమేనీ ఎక్కడ దాక్కున్నారో తమకు తెలుసునని.. కానీ ఇప్పట్లో ఆయనను చంపే ఆలోచన లేదని అన్నారు. దీంతో ఆగ్రహానికి గురైన ఖమేనీ ‘యుద్ధం మొదలైంది’ అంటూ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దీంతో పశ్చిమాసియాలో పరిస్థితులు మరింత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.ఇరాన్ నుంచి ఎన్ని ఎదురుదెబ్బలు తగిలినా.. దాని అణు కార్యక్రమాన్ని దెబ్బతీసేంతవరకు ఇజ్రాయెల్ ఆగేటట్లు లేదు. తాజాగా టెహ్రాన్ అణు కార్యక్రమానికి అత్యంత కీలక పరికరమైన సెంట్రిఫ్యూజ్‌ల తయారీకేంద్రంపై ఐడీఎఫ్ ఫైటర్ జెట్‌లు దాడి చేశాయి. ఆ దేశ రాజధాని సమీపంలోని ఈ కేంద్రంపై దాదాపు 50 యుద్ధ విమానాలు ఏకకాలంలో విరుచుకుపడ్డట్లు ఐడీఎఫ్ వెల్లడించింది. దీంతోపాటు చాలా ఆయుధ తయారీ కేంద్రాలను కూడా ధ్వంసం చేసినట్లు వెల్లడించింది. అణుబాంబుల తయారీలో సెంట్రిఫ్యూజ్‌లు కీలక పాత్ర పోషిస్తాయి. వాస్తవానికి అణుబాంబులో యురేనియం 238ను ప్రాసెస్ చేసి వెలికితీసిన యూరేనియం 235 మూలకాన్ని వినియోగిస్తారు. ఇందుకోసం సెంట్రిఫ్యూజ్ అనే పరికరాన్ని వాడతారు. యురేనియం 238 కొన్ని రసాయనిక చర్యలతో.. యురేనియం హెక్సాఫ్లోరైడ్ గ్యాస్‌గా మారుస్తారు. దీనిని సెంట్రిఫ్యూజులోకి పంపించి ప్రాసెస్ చేస్తారు. ఈ క్రమంలో అవి దాదాపు 50,000 ఆర్పీఎంకు పైబడిన వేగంతో తిరిగి భారంగా ఉండే యురేనియం 238కి దూరంగా చేరతాయి. ఇక యురేనియం 235 మూలకాలన్నీ మధ్యభాగానికి చేరతాయి. ఇలా పదేపదే చేసి అణుబాంబుకు యురేనియం సేకరిస్తారు. ఇజ్రాయెల్ దళాలు ఇప్పటికే చేసిన వైమానిక దాడుల్లో ఇరాన్‌లోని అతిపెద్ద అణుకేంద్రమైన నతాంజ్ తీవ్రంగా దెబ్బతిన్నట్లు అంతర్జాతీయ అణుశక్తి సంస్థ నిన్న రాత్రి ధ్రువీకరించింది. దీంతో ఆ సంస్థ ప్రాథమిక అంచనాలను సవరించినట్లైంది. గతంలో ఈ సంస్థ అధిపతి గ్రోసి స్పందిస్తూ.. ఈ కేంద్రం అండర్‌గ్రౌండ్ నిర్మాణాలకు పెద్దగా నష్టం లేదని పేర్కొన్నారు. కానీ, ఆ తర్వాత అంచనాలను మార్చుకోవాల్సి వచ్చింది. ఉపగ్రహాల నుంచి సేకరించిన హైరిజల్యూషన్ చిత్రాలను విశ్లేషించిన తర్వాత ఈ నిర్ణయానికి వచ్చారు. న్యూక్లియర్ థ్రెట్ ఇనీషియేటివ్ కథనం ప్రకారం ఈ కేంద్రంలో సుమారు 50,000కు పైగా సెంట్రి ఫ్యూజ్‌లను అమర్చే అవకాశం ఉంది. ప్రస్తుతం దీనిలో 14,000కు పైగా అమర్చారు. వాటిల్లో చాలావరకు ఈ దాడిలో దెబ్బతిని ఉండొచ్చని అంచనా.

ఇరాన్‌లో 1,100 లక్ష్యాలను ధ్వంసం చేశాం: ఇజ్రాయెల్

ఇరాన్ అణు ముప్పును తాము ఓ వ్యూహం ప్రకారం అణచివేస్తున్నామని ఇజ్రాయెల్ సాయుధ దళాలు తెలిపాయి. ఇప్పటికే తమ వాయుసేన ఆ దేశంలోని 1,100 లక్ష్యాలను ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ ఎఫీ డెఫ్రిన్ పేర్కొన్నారు.“మేము ఓ పద్ధతి ప్రకారం ఇరాన్‌లోని అణు ముప్పును నాశనం చేస్తున్నాం. మేము చేసే దాడులు వారి నష్టాన్ని గణనీయంగా పెంచుతున్నాయి. ఫలితంగా వారి బాలిస్టిక్ క్షిపణులు, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు దెబ్బతింటున్నాయి” అని పేర్కొన్నారు. దాడులకు సంబంధించిన వీడియోలను కూడా ఇజ్రాయెల్ దళాలు షేర్ చేశాయి.ఇజ్రాయెల్ వాయుసేన విమానాలు గత శుక్రవారం నుంచి ఇరాన్‌పై దాడులు నిర్వహిస్తున్నాయి. పశ్చిమ ఇరాన్, టెహ్రాన్ గగనతలంపై తాము పూర్తిగా పట్టు సాధించినట్లు చెబుతున్నాయి. ఇప్పటి వరకు 70 ఇరాన్ ఎయిర్ డిఫెన్స్ బ్యాటరీలను ధ్వంసం చేసినట్లు చెబుతోంది.మరోవైపు ఐడీఎఫ్‌కు చెందిన ఓ భారీ డ్రోన్‌ను కూల్చేసినట్లు ఇరాన్ ప్రకటించింది. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ కూడా ధ్రువీకరించింది. తమ మానవ రహిత విమానాన్ని ఇరాన్ ఉపరితలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే క్షిపణిని వాడి ధ్వంసం చేసింది” అని పేర్కొంది. కాకపోతే దాని నుంచి సమాచారం లీకవుతుందన్న ఆందోళన తమకు లేదని పేర్కొంది. మరో వైపు ఇరాన్ నిన్న రాత్రి 30 బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది.

## ఇరాన్ హద్దులుదాటింది

### నేనేం చేస్తానో ఎవరికీ తెలియదు
### ఖమేనీ హెచ్చరికలపై ట్రంప్ స్పందన

ఇరాన్ హద్దులు దాటిందని, దీనిపై స్పందించడం ఇప్పటికే చాలా ఆలస్యమైందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు.ఇజ్రాయెల్‌తో కొనసాగుతున్న ఘర్షణల్లో అమెరికా జోక్యం చేసుకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతొల్లా అలీ ఖమేనీ హెచ్చరించిన సంగతి తెలిసిందే. తాజా పరిణామాలపై ట్రంప్ మరోసారి స్పందించారు. ఇరాన్ లేదా దాని అణుకేంద్రాలే లక్ష్యంగా దాడులు చేసే యోచనలో అమెరికా ఉందా? అని విలేకరులు అడిగిన ప్రశ్నకు స్పష్టతనిచ్చేందుకు ట్రంప్ నిరాకరించారు. అయితే, టెహ్రాన్ హద్దులు దాటిందని, దీనిపై స్పందించడం ఇప్పటికే చాలా ఆలస్యమైందన్నారు. వచ్చేవారం చాలా కీలక పరిణామం చోటుచేసుకోవచ్చని, అంతలోపే జరిగే అవకాశం కూడా ఉందని చెప్పారు. “వారం క్రితం.. ఇప్పటి పరిస్థితులకు చాలా తేడా ఉంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడుల్లో జోక్యం చేసుకుంటానో లేదో తెలియదు. నేనేం చేయనున్నానో ఎవరికీ తెలియదు” అని డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. వైట్‌హౌస్‌లో చర్చలు జరిపేందుకు ఇరాన్ ప్రతిపాదన చేసిందని చెప్పిన ఆయన.. ఎప్పుడు, ఏవిధంగా అనే విషయాలను వెల్లడించలేదు. అయితే, టెహ్రాన్ ప్రస్తుతం తననుతాను రక్షించుకోలేని పరిస్థితిలో ఉందని, గగనతల రక్షణ వ్యవస్థలు కూడా లేవన్నారు.

## యుద్ధం మొదలైంది

తమపై దాడి చేసి ఇజ్రాయెల్ భారీ తప్పిదం చేసిందని, అందుకు శిక్ష తప్పదని ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ పేర్కొన్నారు. ఇజ్రాయెల్ దాడుల వేళ వీడియో సందేశం విడుదల చేసిన ఆయన.. ఇరాన్ లొంగిపోదనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు. ట్రంప్ హెచ్చరికలను ఉద్దేశిస్తూ.. అటువంటి బెదిరింపులకు భయపడమనే విషయం ఇరాన్ చరిత్ర తెలిసిన వారికి అర్థమవుతుందన్నారు. అంతేకాదు అమెరికా సైన్యం జోక్యం చేసుకుంటే కోలుకోలేని నష్టం ఉంటుందన్న విషయం అమెరికన్లు తెలుసుకోవాలన్నారు.ఇజ్రాయెల్‌తో కొనసాగుతున్న పోరులో అమెరికా జోక్యం చేసుకుంటే అది పశ్చిమాసియాలో విస్తృత యుద్ధానికి దారితీస్తుందని ఇరాన్ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి కూడా హెచ్చరించారు. ఘర్షణల నేపథ్యంలో తొలిసారి స్పందించిన ఆయన.. తమపై దాడులకు దీటుగా స్పందిస్తామన్నారు.ఇరాన్ సుప్రీం లీడర్‌ను ఉద్దేశిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఖమేనీ ఎక్కడ దాక్కున్నారో తమకు తెలుసని.. ఆయన సురక్షితంగా ఉన్నారని చెప్పారు. అయితే, ప్రస్తుతానికి ఆయన్ను చంపాలనుకోవడం లేదన్నారు. ఇరాన్ బేషరతుగా లొంగిపోవాలని, లేదంటే పరిస్థితులు తీవ్రంగా మారుతాయని ట్రంప్ హెచ్చరించిన నేపథ్యంలో ఖమేనీ ఈ విధంగా స్పందించారు. కాగా ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య యుద్ధంతో పశ్చిమాసియా రగులుతోంది. అగ్రరాజ్యం అమెరికా నేరుగా రణరంగంలోకి దిగనుందనే వార్తలు ఉద్రిక్తతలను మరింత పెంచేలా కన్పిస్తున్నాయి. ఈ పరిణామాల వేళ ఇరాన్ సుప్రీంలీడర్ అయతొల్లా అలీ ఖమేనీ ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించిన సంగతి తెలిసిందే.

# నింగికేగిన 'ఉద్యమ' కెరటం..

**మారెడుమిల్లి ఎన్‌కౌంటర్‌లో చర్చల ప్రతినిధి గాజర్ల రవి మృతి..**

**జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో అలుముకున్న విషాదం..**

**ముగిసిన మావోయిస్టు నేత 33ఏళ్ల ఉద్యమ ప్రస్థానం..**

**శోకసంద్రంలో మునిగిన కుటుంబసభ్యులు, బంధుమిత్రులు..**




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** పెత్తందారి వ్యవస్థకు వ్యతిరేకంగా, తాడిత, పీడిత ప్రజల విముక్తి కోసం పోరుబాట పట్టిన 'ఉద్యమ' కెరటం నింగికెగిశాడు.. తన సోదరుని బాటలో అజ్ఞాతం వైపు అడుగులు వేసి, మావోయిస్టు పార్టీలో అంచెలంచెలుగా ఎదిగిన నాటి చర్చల ప్రతినిధి, మావోయిస్టు సెంట్రల్ కమిటీ సభ్యుడు, ఏవోబీ స్పెషల్ జోన్ కమిటీ కార్యదర్శి గాజర్ల రవి అలియాస్ గణేశ్ అలియాస్ ఉదయ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా మారెడుమిల్లి అటవీ ప్రాంతంలో బుధవారం తెల్లవారుజామున జరిగిన ఎన్ కౌంటర్ లో నేలకొరిగాడు.. గాజర్ల రవి మృతి ఎన్ కౌంటర్ లో మృతి చెందడంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో విషాద చాయలు అలుముకున్నాయి.. కుటుంబసభ్యులు, బంధుమిత్రులు శోకసంద్రంలో మునిగారు..

**ఆపరేషన్ కగార్ తో నెత్తురోడుతున్న అడవులు..**

'ఆపరేషన్ కగార్' తో అడవులు నెత్తురోడుతున్నాయి. భద్రత దళాలు అడవులను జల్లెడ పడుతుండడం, ఎదురు కాల్పులకు పాల్పడుతుండడంతో మావోయిస్టు పార్టీలోని కీలకు నేతలు నేలకొరుగుతున్నారు. వరుస ఎన్‌కౌంటర్లతో మావోలకు కోలుకోలేని దెబ్బ తగిలినట్లయింది. ఈ నేపథ్యంలోనే బుధవారం తెల్లవారుజామున అల్లూరి సీతారామరాజు జిల్లాలో భీకర ఎన్‌కౌంటర్ జరిగినట్లు తెలుస్తుంది. మారెడుమిల్లి అటవీ ప్రాంతంలోని కొయ్యల గూడెం సమీపంలో మావోయిస్టు అగ్ర నేతలు సంచరిస్తున్నారనే పక్కా సమాచారం మేరకు అల్లూరి జిల్లా పోలీసులు, గ్రేహౌండ్స్ సిబ్బందితో కలిసి మంగళవారం రాత్రి నుంచి కూంబింగ్ ఆపరేషన్ చేపట్టిన క్రమంలోనే వారికి మావోయిస్టులు ఎదురుపడగా ఇరువర్గాల మధ్య ఎదురుకాల్పులు జరిగినట్లు తెలిసింది ఈ ఎన్‌కౌంటర్‌లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా వెలిశాలకు చెందిన మావోయిస్టు సెంట్రల్ కమిటీ సభ్యుడు, ఏవోబీ స్పెషల్ జోన్ కమిటీ కార్యదర్శి గాజర్ల రవి అలియాస్ గణేశ్ అలియాస్ ఉదయ్ తో పాటు మావోయిస్టు జోనల్ కమిటీ సభ్యురాలు, ఏవోబీ స్పెషల్ జోన్ కమిటీ మెంబర్ అరుణ తీవ్రమైన బుల్లెట్ గాయాలతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. అదేవిధంగా మరో దళ సభ్యుడు కూడా మృతి చెందినట్లుగా తెలుస్తోంది. అయితే, ఎన్‌కౌంటర్ జరిగిన స్థలంలో మూడు ఏకే-47 రైఫిళ్లతో పాటు భారీగా మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లుగా అక్కడి పోలీసులు వెల్లడించినట్లు సమాచారం..

**అంచెలంచెలుగా ఎదిగి.. ఎన్ కౌంటర్ లో నేలకొరిగి..**

ఏపిలోని మారెడుమిల్లి అటవీ ప్రాంతంలో మావోయిస్టు పార్టీ కీలక నేత గాజర్ల రవి అలియాస్ గణేశ్ మృతి చెందడంతో ఆయన 33ఏళ్ల ఉద్యమ ప్రస్థానానికి తెరపడినట్లయింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని వెలిశాల గ్రామానికి చెందిన గాజర్ల రవి అలియాస్ గణేశ్ ఇంటర్మీడియట్, ఐటీఐ పూర్తి చేసి 23 సంవత్సరాల వయసులో అప్పటికే అజ్ఞాతంలో ఉన్న తన సోదరుడు గాజర్ల సారయ్య అలియాస్ భాస్కర్, అలియాస్ ఆజాద్ బాటలోనే నడిచాడు. 1992లో అప్పటి పీపుల్స్‌వార్ పార్టీలో 23 ఏళ్ల వయస్సులోనే సాయుధ ఉద్యమంలోకి వెళ్లిన గాజర్ల రవి 33ఏళ్లుగా ఉద్యమంలోనే ఉండి కీలక నేతగా వ్యవహరించారు. అప్పట్లో పీపుల్స్‌వార్ పార్టీ పరకాల ఏరియా కమిటీలో, ఏటూరునాగారం ఏరియా కమిటీలో పనిచేసి, కేకేడబ్ల్యూ డివిజన్ కమిటీ సభ్యుడిగా, ఉత్తర తెలంగాణ కమిటీ ప్రతినిధిగా వ్యవహరించి కీలక నేతగా ఎదిగారు. ప్రస్తుతం మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడిగా, ఆంధ్ర ఒడిశా సరిహద్దు ప్రత్యేక జోన్ కమిటీ (ఏవోబీఎస్‌జడ్‌సీ) కార్యదర్శిగా పనిచేశారు. పార్టీలో వివిధ హోదాల్లో పనిచేసి అంచెలంచెలుగా ఎదిగి, ఇప్పుడు కీలక పదవిలో ఉన్నారు. ప్రస్తుతం ఆయన ఆంధ్ర-ఒడిశా ప్రత్యేక జోనల్ కమిటీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న క్రమంలో ఎన్‌కౌంటర్‌లో అశువులు బాసాడు.

**ఉత్తర తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి హోదాలో శాంతి చర్చలకు..**

అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2004, అక్టోబర్‌లో జరిపిన శాంతి చర్చల్లో మావోయిస్టు పార్టీ తరపున ప్రతినిధిగా ఉత్తర తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి హోదాలో గాజర్ల రవి అలియాస్ గణేశ్ అలియాస్ ఉదయ్ పాల్గొన్నారు. ఆ శాంతి చర్చల ఎజెండాను తయారు చేయడంలో కామ్రేడ్ గాజర్ల రవి కీలక పాత్ర పోషించారు. చర్చల ప్రతినిధిగా కొన్నాళ్లు ప్రజాక్షేత్రంలోకి వచ్చినా, అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పీపుల్స్‌వార్‌తో పాటు పలు విప్లవ గ్రూపులతో జరిపిన చర్చలు విఫలం కావటంతో తిరిగి అజ్ఞాతంలోకి వెళ్లారు.

**గాజర్ల రవి కుటుంబ నేపథ్యం..**

వెలిశాలకు చెందిన గాజర్ల మల్లయ్య, కనకమ్మ దంపతులకు గాజర్ల రాజయ్య, సారయ్య, సమ్మయ్య, రవి, అశోక్ ఐదుగురు సంతానం. వీరిలో సారయ్య, రవి, అశోక్ ముగ్గురు సోదరులు నక్సల్ ఉద్యమంలోకి వెళ్లి కీలకంగా పనిచేశారు. గ్రామంలో తమకు ఉన్న ఎనిమిదెకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ కల్లుగీత వృత్తితో జీవనం సాగించే కుటుంబం వీరిది. 1987లో జరిగిన సింగిల్ విండో ఎన్నికల్లో గాజర్ల సారయ్య అలియాస్ ఆజాద్ డైరెక్టర్‌గా పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో సారయ్య ప్రత్యర్థి నల్లా కృష్ణారెడ్డి విజయం సాధించారు. కృష్ణారెడ్డి అప్రజాస్వామ్యంగా గెలిచారని సారయ్య అప్పట్లో ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఎన్నికల వ్యవస్థపై పెత్తందార్ల వ్యవస్థను జీర్ణించుకోలేక ఆగ్రహంగా ఉన్న సారయ్య 1989లో అప్పటి పీపుల్స్‌వార్ పార్టీలో చేరారు. ఆ తర్వాత అన్న బాటలోనే ప్రస్తుత ఎన్ కౌంటర్ మృతుడు గాజర్ల రవి అలియాస్ గణేష్ అలియాస్ బిరుసు అలియాస్ ఉదయ్ 1992లోనే పీపుల్స్‌వార్ పార్టీలో చేరారు. ఆ తరువాత మరో సోదరుడు అశోక్ కూడా 1994లో సోదరుల బాటలోనే నడిచాడు. ఆ తరువాత అనారోగ్య కారణాలతో పోలీసులకు లొంగిపోయాడు. పీపుల్స్ వార్ పార్టీలో చేరకముందే గాజర్ల తల్లిదండ్రులు మరణించారు. పెద్ద సోదరుడు రాజయ్య అనారోగ్యంతో మరణించారు. సమ్మయ్య సింగరేణిలో పనిచేసి రిటైరయ్యారు. ఆజాద్ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడిగా , మిలటరీ ప్లాటూన్ కమాండర్ గా పనిచేశారు. 2008 ఏప్రిల్ 2న ఏటూరునాగారం మండలం కంతనపల్లి అడవుల్లో జరిగిన ఎన్ కౌంటర్‌లో మరణించాడు. ఈ ఎన్ కౌంటర్ లో ఆయన భార్య రమ కూడ మరణించింది.

# నా ఫోన్ ట్యాపింగ్ నిజం

**విచారణకు ఎక్కడికైనా వస్తా**

**జగన్, కెసిఆర్ బంధంతో రక్త సంబంధం మటాష్**

**మీడియాతో ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల**



**విశాఖపట్టణం, జూన్18 (జనంసాక్షి) :** తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ జరిగిందనేది పచ్చి నిజమని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. తన ఫోన్‌తో పాటు భర్త, దగ్గర వాళ్ల ఫోన్లను ట్యాప్ చేశారని ఆరోపించారు. విశాఖపట్నం విమానాశ్రయం వద్ద మీడియాతో మాట్లాడుతూ ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు.'ఫోన్ ట్యాప్ జరిగినట్లు స్వయంగా వైవీ సుబ్బారెడ్డి నిర్ధరించారు. ఆనాడు ట్యాపింగ్ జరిగిన నా ఆడియో ఒకటి నాకే వినిపించారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో విచారణకు ఎక్కడికి రమ్మన్నా వస్తా. తెలుగు రాష్ట్రాల సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు ఫోన్ ట్యాపింగ్ విషయంలో విచారణ వేగవంతం చేయాలి. ఆనాడు జగన్, కేసీఆర్ మధ్య ఉన్న సంబంధం చూసి రక్త సంబంధం కూడా చిన్నబోయింది. ఫోన్ ట్యాపింగ్.. తెలంగాణలో నన్ను రాజకీయంగా, ఆర్థికంగా అణగదొక్కేందుకు ఆ ఇద్దరు కలిసి వేసిన స్కెచ్. ÷లిసీఆర్ కోసం జగన్ నన్ను తొక్కి పెట్టాలని చూశారు. ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు తెలిస్తే మీరు ఏం చేశారు అని నన్ను అడగొచ్చు. ఆనాడు ఉన్న పరిస్థితులు వేరు. అప్పుడు జగన్, కేసీఆర్ చేసినవి అరాచకాలు. వీరి అరాచకాలతో పోలిస్తే ఫోన్ ట్యాపింగ్ చిన్నది. నేను జగన్‌కు తోడబుట్టిన చె÷-లలెల్ని. ఆ విషయం మరిచి నేను ఆర్థికంగా, రాజకీయంగా ఎదగకూడదు అని కుట్ర చేశారు. నా భవిష్యత్తును పాతిపెట్టాలని ఎన్నో చేశారు. నాకు మద్దతు పలికిన వాళ్లను బెదిరించారు. రాజకీయంగా నా వాళ్లు రానివ్వకుండా చేశారు. నేను తెలంగాణలో పార్టీ పెట్టడంలో జగన్‌కు ఏ సంబంధం లేదు. కేసీఆర్ కోసం నన్ను తొక్కి పెట్టాలని చూశారు. నా చుట్టూ పరిస్థితులను కష్టతరం చేశారు. నా ప్రతి పోరాటానికి అడ్డుపడ్డారు.' అని షర్మిల అన్నారు.

## బేగంపేటకు బాంబు బెదిరింపు కాల్

**హైదరాబాద్, జూన్ 18 (జనంసాక్షి) :** బేగంపేట ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు కాల్ రావడం తీవ్ర కలకలం రేపింది. బుధవారం 10:30 గంటలకు బేగంపేట్ విమానాశ్రయంలో బాంబు ఉన్నట్లు కొందరు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ఫోన్ కాల్ వచ్చింది. దీంతో అప్రమత్తమైన ఎయిర్‌పోర్టు సిబ్బంది బాంబ్ స్క్వాడ్‌కు సమాచారం ఇవ్వగా.. వెంటనే వారు అక్కడకు చేరుకుని ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. విమానాశ్రయంలోని ఉద్యోగులందరినీ బయటకు పంపించి బాంబు స్క్వాడ్, ఎస్పీఎఫ్ పోలీసులు క్షుణ్ణంగా సోదాలు చేశారు. అయితే విమానాశ్రయంలో ఎలాంటి బాంబు లేదని.. అదంతా ఫేక్ కాల్‌గా బాంబు స్క్వాడ్ గుర్తించింది. కాల్ చేసిన నెంబర్ ఆధారంగా ఆగంతకుడిని పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

## హిందీ బోధన తప్పనిసరి కాదు

**మరో భాషను ఎంచుకునే అవకాశం ఉంది**

**హిందీపై వెనక్కి తగ్గిన మహారాష్ట్ర ప్రభుత్వం**

**ముంబై, జూన్ 18 (జనంసాక్షి) :** ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి చదివే పిల్లలందరికీ హిందీ విధిగా బోధించాలని ఇటీవల మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై తాజాగా రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. వ్యతిరేకత రావడంతోనే వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. అయితే తప్పనిసరి అనే పదాన్ని నోటిఫికేషన్ నుంచి తొలగించింది. ప్రభుత్వ నిర్ణయంపై వ్యతిరేకత వ్యక్తమైన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. బుధవారం మహారాష్ట్ర పాఠశాలల విద్యాశాఖ ఓ ప్రకటనను విడుదల చేసింది. అందులో 'తప్పనిసరి' అనే పదాన్ని తొలగించింది. హిందీకి బదులు మరో భాషను ఎంచుకునే అవకాశం విద్యార్థులకు కల్పించింది. అయితే, ఆ భాష నేర్చుకోవాల నుకునే తరగతిలో కనీసం 20 మంది విద్యార్థులు తప్పనిసరిగా ఉండాలని పేర్కొంది. అప్పుడే ఆ సబ్జెక్టు పాఠశాలలో అందుబాటులో ఉంటుందని స్పష్టం చేసింది. ఆ భాషకు సంబంధించిన ఉపాధ్యాయుడి నియామకం కుదరకపోతే ఆన్‌లైన్ ద్వారా తరగతులు జరుగుతాయని వెల్లడించింది. జాతీయ విద్యా విధానంలో భాగమైన త్రిభాషా సూత్రంలో భాగంగా దేశవ్యాప్తంగా విద్యార్థులు హిందీ, ఇంగ్లీషు, ఒక స్థానిక భాషను నేర్చుకోవాలని కేంద్రం పేర్కొంది. ఈ విధానాన్ని తమిళనాడు ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ద్విభాషా సూత్రానికే కట్టుబడి ఉంటామని, హిందీని బలవంతంగా రుద్దితే ఊరుకోబోమని డీఎంకే స్పష్టం చేస్తోంది. ఈ క్రమంలోనే హిందీని తప్పనిసరి చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది.

# పెద్దధన్వాడకు వెళ్తున్న పౌరసంఘం నాయకుల నిర్బంధానికి ఖండన

**హైదరాబాద్ (జనంసాక్షి) :** పెద్ద ధన్వాడలో ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజలకు సంఘీభావంగా వెళ్తున్న పౌరసంఘం నాయకులను పోలీసులు నిర్బంధించడాన్ని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, నారాయణరావు తీవ్రంగా ఖండించారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర కమిటీ తరపున, మహబూబ్ నగర్ జిల్లా కమిటీ తరపున ప్రొఫెసర్ లక్ష్మణ్ గడ్డం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ నారాయణరావు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షులు శుభా న్ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కా బాలయ్య జిల్లా సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణ వెంకటేష్ కోశాధికారి ఐదుగురు బృందం కలిసి ఎర్రవెల్లిలో చౌరస్తా దగ్గర కలుసుకొని పెద్ద దన్వాడలో ఇతనాలు కంపెనీకి వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజలపై పోలీసులు దాడి చేసి తీవ్రంగా గాయాల పాలు చేసిన ఘటనపై నిజనిర్ధారణకు వెళ్దామని, ఛత్తీస్గఢ్లో ఒక పెద్ద ఎన్కౌంటర్ జరిగినదని తెలియడంతో వెనక్కి హైదరాబాద్ వెళ్దామా అని చర్చించుకున్న సందర్భంలో ఒక పదిమంది పోలీసులు ఎర్రవల్లి చౌరస్తాలో తమను అదుపులోకి తీసుకొని ఇటిక్యాల పోలీస్టేషన్లో 11 గంటల నుండి నిర్బంధించారని తెలిపారు. ప్రజలు మేధావులు ప్రజాసంఘాల నాయకులు ఖండించాలని కోరారు. తెలంగాణలో గతంలో లాగా టిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వంలో ఉండగా అమలైన నిర్బంధం పునరావృతమవుతున్నదని, పౌర హక్కులను నిలబెడతానని, ప్రజాస్వామ్యాన్ని పునరుద్దరిస్తామని ముఖ్యమంత్రి చెప్పిన మాటలు గాలిమూటలయ్యాయని, ప్రజాస్వామిక పోరాటాలకు స్థానం ఉంటుందని చెబుతూనే రైతులను పరామర్శించడానికి వెళుతున్న హక్కుల బృందాన్ని నిలువరించి అదుపులోకి తీసుకొన్నారని తెలిపారు. పౌర హక్కుల పునరుద్ధరణ అవుతుందో లేదో పాలకులు ప్రజలకు వివరించాలని, రాష్ట్రంలో రైతు వ్యతిరేక పాలన కొనసాగుతుందని తెలిపారు. రైతులకు గత ప్రభుత్వం బేడీలు వేస్తే ఈ ప్రభుత్వం మహిళా రైతు తల పగలగొడుతుందని, రైతు సమస్యలను తీర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని, రాష్ట్రంలో ఏ వర్గం ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం పాలనతో సంతృప్తిగా లేరని, మాటలు చెబుతూ కాలం గడుపుతున్నారని తెలిపారు. అక్రమ అరెస్టులను నిలువరించాలని ప్రజలకు పోలీసుల నుండి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. పెద్ద దన్వాడలో విత్తనాలు కంపెనీని రద్దు చేయాలని తెలంగాణలో చిత్తనూరు ఇతర ప్రాంతాల్లో తలపెట్టిన విత్తనాలు కంపెనీలను మూసివేయాలని ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని వాతావరణాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ప్రజల పైన దాడి చేసిన పోలీసులను మరియమ్మ తలను పగులుగొట్టిన పోలీసుల పైన కఠినంగా కేసులు పెట్టి శిక్షించాలని డిమాండ్ చేశారు. రైతుల పైన నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని, పోలీసుల చేత పాలన నడిపించటం స్వస్తి పలకాలని హితవు పలికారు.

# గోశాలల నిర్మాణం ఆలోచన అద్భుతం

**గో సంరక్షణకు కమిటీ వేసి...నన్ను మెంబర్ చేయండి**

**సిఎం రేవంత్‌కు ఎమ్మెల్యే రాజాసింగ్ సూచన**



**హైదరాబాద్, జూన్18 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం కొత్త గోశాలలు నిర్మించాలనే నిర్ణయం తీసుకున్నందుకు సీఎం రేవంత్‌రెడ్డికి భాజపా ఎమ్మెల్యే రాజాసింగ్ ధన్యవాదాలు తెలిపారు. వేల సంఖ్యలో ఆవులు, దూడలు, ఎద్దులను కబేళాల్లో అక్రమంగా చంపుతున్నారని ఆరోపించారు. దీన్ని నివారించేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలని కోరారు. 'మోడల్ గోశాలలు నిర్మించే నిర్ణయం చాలా మంచిదని అన్నారు. గో రక్షణ గురించి ఒక స్పెషల్ పోలీస్ ఫోర్స్ ఏర్పాటు చేయండి. అందులో నన్ను కూడా సభ్యుడిగా నియమించండిని రాజాసింగ్ సిఎంకు సూచించారు. దేశంలోని ముఖ్యమంత్రులందరిలో గోవులకు సేవ చేసే నిజమైన ముఖ్యమంత్రి ఎవరు అని అడిగితే గుర్తుకు వచ్చే రెండో పేరు మీదేని అన్నారు. . మొదటి పేరు యోగి ఆదిత్యనాథ్, రెండో పేరు రేవంత్ రెడ్డి. ఇలాంటి పనులు చేస్తే మీకు దేశంలో మంచి గుర్తింపు వస్తుంది. తెలంగాణలో గోవధను నిషేధించాలి' అని రాజాసింగ్ కోరారు. గో రక్షణ గురించి ఒక స్పెషల్ పోలీస్ ఫోర్స్ తయారు చేయాలని, అందులో ఒక మెంబర్‌గా తనను కూడా ఉంచాలని ఎమ్మెల్యే రాజాసింగ్ సిఎం రేవంత్ రెడ్డిని కోరారు. ఈ పనులన్నీ ముఖ్యమంత్రి చేస్తే భారత దేశంలో ఒక మంచి గుర్తింపు దొరుకుతుందని ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. తెలంగాణలో గోవుల సంరక్షణకు ఎంత ఖర్చైనా ప్రభుత్వం వెనుకాడబోదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గోవుల సంరక్షణకు సమగ్ర విధానాన్ని రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ముగ్గురు అధికారులతో ఒక కమిటీని నియమించారు. గోవుల సంరక్షణ కోసం వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలను అధ్యయనం చేయాలని ఈ కమిటీని కోరారు. రాష్ట్ర పశు సంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ఈ కమిటీలో ఉన్నారు. వేములవాడ, యాదగిరిగుట్ట, హైదరాబాద్ నగర సమీపంలోని ఎనికేపల్లి, పశుసంవర్ధక శాఖ విశ్వవిద్యాలయం సమీపంలోని విశాల ప్రదేశాల్లో తొలుత గోశాలలు నిర్మించాలన్నారు. వేములవాడలో కోడెల పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ కనబర్చాలని సీఎం సూచించారు.

## ఇజ్రాయిల్‌లో జగిత్యాల వాసి మృతి

**జగిత్యాల, జూన్18 (జనంసాక్షి) :** ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య భీకర యుద్ధం జరుగుతున్న విషయం తెలిసిందే. ఇరు దేశాలు మధ్య జరుగుతున్న దాడుల్లో వందలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ యుద్ధం వల్ల జగిత్యాలకు చెందిన రవీందర్ అనే వ్యక్తి మృతి చెందాడు. బతుకుదెరువు కోసం రెండు సంవత్సరాల క్రితం రవీందర్ ఇజ్రాయెల్‌కు వెళ్లాడు. అయితే యుద్ధం జరుగుతుండగా.. బాంబు శబ్దం వల్ల రవీందర్ గుండెపోటుతో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న రవీందర్ కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. యుద్ధం కారణంగా విమాన రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. దీంతో రవీందర్ మృతదేహాన్ని ఎలాగైనా స్వదేశానికి రప్పించాలని కుటుంబసభ్యులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

## హనీమూన్ మర్డర్ కేసులో మరో బిట్ ట్విస్ట్

**సంజయ్ వర్మ అనే వ్యక్తికి సోనమ్ 119 కాల్స్**

**షిల్లాంగ్, జూన్18 (జనంసాక్షి) :** హనీమూన్ మర్డర్ కేసులో మరో బిట్ ట్విస్ట్ చోటు చేసుకుంది. ఇప్పటి వరకు ఈ కేసులో లేని కొత్త పేరు తెరపైకి వచ్చింది. ఇటీవల మేఘాలయలో జరిగిన రాజా రఘువంశీ హత్య దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. భార్య సోనమ్, ఆమె ప్రియుడు రాజ్ కుష్వాహ్ ప్లాన్ చేసి, హత్య కోసం కిరాయి హంతకులను నియమించుకున్నారు. మేఘాలయ హనీమూన్‌కి వెళ్లిన సమయంలో భార్య సోనమ్ దగ్గర ఉండీ తన భర్త రాజాను హత్య చేయించింది. ఈ కేసుకు సంబంధించి పోలీసు దర్యాప్తులో సోనమ్ కాల్ డేటాను విశ్లేషించగా మరో పేరు బయటకు వచ్చింది. సంజయ్ వర్మ అనే వ్యక్తికి సోనమ్ మార్చి 1 నుంచి మార్చి 25 వరకు 119 కాల్స్ చేసినట్లు గుర్తించారు. ప్రస్తుతం, అతడి మొబైల్ నెంబర్ స్విచ్ ఆఫ్‌లో ఉంది.

# కుంటయ్య చావుకు కారణమైన ఏ ఒక్కరినీ వదిలిపెట్టం

**న్యాయపోరాటం చేస్తాం**

**కుంటయ్య ఇద్దరు పిల్లల చదువులు,పెళ్లిల్లు చేయడంతో పాటు కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది**

**కుంటయ్య కుటుంబసభ్యులను పరామర్శించిన కేటీఆర్**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** కాంగ్రెస్ హయాంలో సెటిల్ మెంట్ లకు అడ్డాగా పోలీస్ స్టేషన్లు మారాయని విమర్శించారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారకరామారావు.తన భూమిని కాంగ్రెస్ నేత కబ్జా చేశాడని ఫిర్యాదుచేస్తే ఉల్టా తమ పార్టీ నేత కర్కబోయిన కుంటయ్యపైనే కేసు బనాయించి వేధించడంతో ఆయన ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు.సివిల్ మ్యాటర్ లో దూరి పోలీసులు సెటిల్మెంట్లు, అరాచకాలు చేయడం సమాజానికి ఎంతమాత్రం మంచిది కాదన్నారు. కాంగ్రెస్ నేత భూమిని కబ్జా చేయడంతో ఆత్మహత్య చేసుకున్న బీఆర్ఎస్ మాజీ ఎంపీటీసీ కర్కబోయిన కుంటయ్య కుటుంబాన్ని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇవాళ సిరిసిల్లలో పరామర్శించారు. ఆ తరువాత మీడియాతో మాట్లాడిన కేటీఆర్, కాంగ్రెస్ నాయకులు ఏం చేస్తే అది చేయడాన్నే డ్యూటీగా భావించి పోలీసులు విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. కుంటయ్య చావుకు కారణమైన పోలీసులపై చర్యలు తీసుకునే వరకు న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. ఎవరిని వదిలిపట్టమన్నారు. తాము అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో బిఆర్ఎస్ నేతలు ఎవరూ కూడా ఇంత చిల్లర, లేకి పనులు చేయలేదన్నారు. మొన్న ఏసీబీ విచారణ జరుగుతున్నప్పుడు తన కోసం హైదరాబాద్ దాకా వచ్చి ధైర్యం చెప్పిన కుంటయ్య అదే రోజు రాత్రి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసి మనసు కకావికలమైందన్నారు కేటీఆర్. రాజకీయ నాయకులు అంటే అందరూ ఏదోదో ఊహించుకుంటారన్న కేటీఆర్, బయటికి గంభీరంగా కనిపడ్డా లోపల దుఃఖాన్ని దాచుకొని ఓ వైపు ప్రజల కోసం పనిచేస్తూ మరోవైపు కుటుంబాన్ని కాపాడుకునే క్రమంలో తీవ్ర ఒత్తిడికి గురవుతారన్నారు.తన భూమిని కాంగ్రెస్ నేత కబ్జా చేయడం, పోలీసులు కూడా ఆయనకే వత్తాసు పలకడంతో కుంటయ్య ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు.విషయం తెలిసిన వెంటనే పార్టీ నేతలను పంపి ఆయనను కాపాడుకునేందుకు శాయశక్తులా ప్రయత్నించినా సాధ్యం కాలేదన్నారు. పార్టీలో నిబద్ధత కల నాయకుడు, నిఖార్సైన గులాబీ సైనికుడు కుంటయ్య ఇద్దరు పిల్లల చదువులు, వారి పెళ్లిళ్లు , ఇతర సమస్యలు అన్నింటికీ తనదే బాధ్యత అన్నారు కేటీఆర్. కుంటయ్య కుటుంబానికి పార్టీ పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని హామి ఇచ్చారు. ఈరోజు కుంటయ్య కి జరిగింది రేపు మరొకరికి జరగొచ్చన్న కేటీఆర్, ఈ అరాచకాలను ప్రభుత్వం అదుపుచేయాలన్నారు.ఈ ఆపద సమయంలో కుంటయ్య కుటుంబానికి మనోధైర్యాన్ని ఆ భగవంతుడు ప్రసాదించాలని కోరుకున్నారు. పెద్దకర్మ జరిగేదాకా పార్టీ జిల్లా నాయకత్వమే అన్ని పనులు దగ్గరుండి చూసుకుంటుందన్నారు. కుంటయ్య ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతున్ని కేటీఆర్ ప్రార్థించారు.


**CHANGE OF NAME**

I, VANKDOTH AJAY,H.NO.4-2,KATTUKALVA TANDA GP, KOTHUR(POST), BOMRASPET(MANDAL), VIKARABAD(DIST),TELANGANA STATE, PIN:509338, CHENGED MY NAME AS FOR BIRTH CERTIFICATE AJAY NAYAK S/O PULYA NAYAK.

**PUBLIC NOTICE**

I, Molugu Sravan Kumar, S/o Venkat Bajam, aged 31 years, resident of H.No. 11/04, Hanmath Nagar, Srirampur, Mandal Naspur, District Mancherial, an employee of Singareni, have lost my passport bearing number N1379229. The passport was lost while traveling by auto from Srirampur Bus Stop to Mancherial. Despite all efforts to trace it, the passport could not be recovered. If found, kindly return it to the nearest police station or contact me. I am applying for a duplicate passport, and the lost passport shall be considered invalid. Any misuse of the same will be at the user's risk.

### విహారం వినోదం ఆనందం

ఉరుకుల పరుగుల
హైటెక్ జీవితంలో
ఉపశమనం
పొందడానికి
రొటీన్ దిన చర్య
నుండి కొంత విరామం
పొందడానికి
ప్రియమైన వారితో
గడపడమే విహారం

విహారంతో ఆనందం
కలిగి సృజన జీవన
నాణ్యత పెరుగుతుంది
రోజువారి జీవితాల్లో
కలిగే ఆందోళన ఒత్తిడి
తగ్గి సరికొత్త ఉత్సాహం
ఉల్లాసాం ఉషారు
పురకలేసిజి
భావోద్వేగాల పంపిణీతో
ఆత్మీయత అనురాగం
బంధాలు అనుబంధాలు
బలోపేతమై మెరుగైన
సామాజిక సమరసత
వెల్లివిరుస్తుంది

పచ్చదనం పక్షుల కిలకిల
ధ్వనులు ఆరోగ్యాన్ని
మానవ సంబంధాలకు
ఉత్సాహాన్ని అందిస్తాయి

మానవత్వం
ప్రకృతి పట్ల ప్రేమ
మనుషుల మధ్య
అనుబంధాల
బలోపేతానికి
సహృదయుతకు
సమిత మమత
పంచుకునే రోజు
ప్రగతిశీల ఆలోచనలను
ఆవిష్కరించే రోజు

పచ్చని ప్రకృతి
సూర్యరష్మీ చక్కటి
సంగీతం ఆటపాటల
మధ్య హాయిగా
ఆనందిస్తూ
పరవశించే సదవకాశం
ఆటపాట దోస్తులుతో
విందు దిల్ పసందు
విహారంతో ఎడబాటు
తగ్గి నిర్మాణాత్మక
ఆలోచనలు
అంకురిస్తాయి

స్నేహం సోదర భావం
పెరుగుతుంది
ఆరు బయట
ఆనందించడం
సాంస్కృత
సామాజిక
సంబంధాలు
మెరుగుపడతాయి

విహారంతో ప్రకృతిలో
పరవశించే అవకాశం
వస్తుంది ప్రకృతి
మానవుల మధ్య
గడిపే అవకాశం
వస్తుంది


విహారంలో ఉండే
ఉత్సాహం ఉప్పొంగి
ఒకరికి ఒకరు
అవగాహనతో
జీవితం గడిపే
అవకాశం
ఏర్పడుతుంది
మరువలేని మరచిపోని
జ్ఞాపకాలు సృష్టి జరిగి
జీవితంలో తీపి జ్ఞాపకాలు
ఆహ్లాదకర వాతావరణం
సృష్టించడంతో
మానవ వనరుల వికాసం
జరిగి సంతోష భారత్
సిద్ధిస్తుంది



**నేదునూరి కనకయ్య**
అధ్యక్షుడు తెలంగాణ ఎకనామిక్ ఫోరం
9440245771

# చిలకమర్తి లక్ష్మీనరసింహం

## ఆధునిక తెలుగు గద్య విశ్వరూపం



తెలుగు సాహిత్య చరిత్రలో గద్యాన్ని తాత్విక, సామాజిక, రాజకీయ దిశలో ఆధునికీకరించిన చిలకమర్తి లక్ష్మీనరసింహం (1867–1946) పాత్ర అనన్యమైనది. తెలుగు గద్యంలో ఇంగ్లీషు గద్య లక్షణాలను పరిచయం చేసిన తొలి రచయితగా ఆయన గుర్తింపు పొందారు. వారి రచనలు సాహిత్య ప్రక్రియలలో, రాజకీయ చింతనలో, భాషా ఉద్ధరణలో మార్గదర్శకంగా నిలిచాయి. కందుకూరి వీరేశలింగం వేసిన హాస్య ప్రహసనాల పునాదిని కొనసాగిస్తూ, స్వతంత్ర విమర్శను జోడించారు.

**జాతీయోద్యమ కవిత్వం**
చిలకమర్తి జాతీయోద్యమ భావాలను తెలుగు కవిత్వంలో ప్రతిధ్వనించే కవిగా పేరు పొందారు. "భారతఖండం చక్కని పాడియావు" కవిత తొలి జాతీయోద్యమ కావ్యంగా గుర్తింపబడింది. ఈ కవిత దేశభక్తి, స్వాతంత్ర్య ఆకాంక్షలను స్ఫూర్తిగా వ్యక్తం చేసింది.
చిన్నతనంలో దృష్టి కోల్పోయినప్పటికీ, చిలకమర్తి రచనలు మేధస్సుతో, స్థిరత్వంతో సాగాయి. అంధత్వాన్ని బలహీనతగా భావించక, రచనా బలంగా మలచుకున్నారు. వీరి రచనలలో గోదావరి మండలి యాస స్పష్టంగా కనిపిస్తుంది. 1940 కాంగ్రెస్ సభలో దక్షిణాఫ్రికా వర్ణవివక్షపై ఇచ్చిన ఉపన్యాసం జాతీయోద్యమ సాహిత్యంలో ప్రపంచ దృష్టికి నిదర్శనం. భాసుని నాటకాలను తెలుగులోకి అనువదించడం, అహల్యాబాయి తొలి పౌరాణిక నవల రచన వారి కృషికి ఉదాహరణలు.
1867 సెప్టెంబరు 26న పశ్చిమ గోదావరి జిల్లా, ఖండవల్లిలో జన్మించిన చిలకమర్తి కవి, నాటక రచయిత, పాత్రికేయుడు, విద్యావేత్త, సంస్కర్తగా బహుముఖీనులు. వారి రచనలు సాహిత్యం, విమర్శ, అనువాదం, పౌరాణికతను సమన్వయం చేశాయి.

**విద్య, ఉద్యోగం**
ప్రాథమిక విద్య వీరవాసరం, నరసాపురంలో సాగింది. 1889లో రాజమండ్రి హైస్కూలులో పట్టభద్రుడై, ఆర్య పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేశారు. రాజమండ్రి మునిసిపల్ స్కూలులో బోధించి, 1899లో హిందూ లోయర్ సెకండరీ స్కూల్ స్థాపించారు, ఇది తరువాత వీరేశలింగం ఉన్నత పాఠశాలగా మారింది. వీరేశలింగం ప్రభావం వారి రచనా శైలిని విస్తృతం చేసింది.

**పత్రికా రంగం**
మనోరమ, సరస్వతి, దేశమాత పత్రికలకు సంపాదకుడిగా పనిచేశారు. మనోరమ సాహిత్య, సామాజిక విమర్శలకు వేదికగా నిలిచింది.

**పాఠశాలల స్థాపన**
వివేకానంద పాఠశాల వయోజన విద్యకు, రాజా రామ్మోహన్ రాయ్ పాఠశాల హరిజన విద్యకు అంకితమయ్యాయి. ఈ స్థాపనలు వారి సామాజిక దృక్పథాన్ని ప్రతిబింబిస్తాయి.

**నవలా సాహిత్యం**
**హేమలత (1896):** మహిళా విద్యపై చైతన్యం కల్పించింది.
**అహల్యాబాయి (1897):** తొలి పౌరాణిక నవల.
**దాసికన్య:** కుల విభేదాలపై విమర్శ.
**రామచంద్ర విజయం (1894):** దేశభక్తి, నైతికతను చిత్రించింది.
**దుందుభి:** విద్యా వ్యవస్థపై వ్యంగ్యం.

**నాటక సాహిత్యం**
**పౌరాణిక నాటకాలు:** ప్రసన్నయాదవం, కర్ణభారంలలో హేతువాదం కనిపిస్తుంది.
**అనువాదాలు:** భాసుని అవిమారకం అనువాదం.
**సామాజిక నాటకాలు:** ఆత్మగౌరవంలో హాస్యం, విమర్శ.
**జాతీయ నాటకాలు:** కీచకవధ బ్రిటిష్ వ్యతిరేకతను చిత్రించింది.
**శతక సాహిత్యం :** కృపాంబోధిని, భల్లట శతకం, గీతా మంజరి శతకాలు మానవతా విలువలు, వ్యంగ్యం, తాత్వికతను ఆవిష్కరించాయి.

**ప్రహసన సాహిత్యం**
**బధిర చతుష్టయం (1927):** సామాజిక నిర్లక్ష్యాన్ని విమర్శించింది.
**గయ్యాళి గంగమ్మ (1927):** దుష్టాచారాలపై హాస్య విమర్శ.
**జనాభా లెక్కలు:** బ్రిటిష్ పాలనపై వ్యంగ్యం.
**స్వీయ చరిత్ర :** 1944లో రాసిన స్వీయ చరిత్ర ఆయన జీవితాన్ని, సాహిత్య నిబద్ధతను వివరిస్తుంది.

**ప్రత్యేక రచనలు :**
గురు గోవింద్ సింగ్, సమర్థ రామదాసు, రాజా రామ్మోహన్ రాయ్ రచనలు ఆధునిక దృష్టితో చరిత్రను చిత్రించాయి.
**సూక్తులు**"చెరసాలల్ పృథు చంద్రశాలల్కై యగున్" – గురువు జ్ఞాన విశిష్టతను చెప్పింది.
**గౌరవ బిరుదులు** ఆంధ్ర మిల్టన్, ఆంధ్ర స్కాట్, కళా ప్రపూర్ణ బిరుదులు లభించాయి.
**పరిశోధకుల దృష్టి** మొదలి నాగభూషణ శర్మ, ముక్తవి భారతి, భమిడిపాటి సచ్చిదానందమూర్తి వారి రచనలను విశ్లేషించారు.
1946 జూన్ 17న చిలకమర్తి పరమపదించారు. వారి సాహిత్యం తెలుగు గద్యానికి విశ్వ రూపం ఇచ్చింది.



**డా. ఐ చిదానందం**
తెలుగు అధ్యాపకులు
వెల్దండ ప్రభుత్వ జూనియర్ కాలేజీ
నాగర్ కర్నూల్ జిల్లా
చరవాణి - 8801444335

### ఓ మహా కవి!




నువ్వు పుట్టినా గిట్టినా
అదినీకు అమరత్వమే!
కారణం నీ ప్రజాకవిత్వం!
ప్రజల నాలుకలపై నువ్వు
ఎప్పటికీ జీవించే ఉంటావు!

పదండి ముందుకు అంటూ
నువ్వు వ్రాసిన మహాప్రస్థానం
మ్రోగించిన కంచు నగారా
ఎర్రబావుటా నిగ నిగలు
అవి గొప్ప చైతన్య గీతాలు!

వైప్లవ్యగీతాన్ని నేను అంటూ
అభ్యుదయ భావావేశం తో
జయభేరి మ్రోగించావు కదా!
నువ్వుకట్టిన జ్వాలాతోరణం
నవకవితలు నీ అవతారం!

కళారవివి నువ్వు సాహసివి
కవితా ఓ కవితా అంటూ
నువ్వు వినిపించిన కవిత్వం
యువకాశల నవపేశల
చైతన్య సుమగీతాలు!

ఋక్కులు చైతన్య దృక్కులు
నువ్వుచేసిన ప్రతిజ్ఞ శ్రమ
సౌందర్యానికి విప్లవశంఖం!
బాటసారివై ఉన్మాదివై
చేదుపాట వినిపించావు!

భిక్షువర్షీయసి రూపాన్ని
కళ్ళకు సాక్షాత్కరించావు!
నీ సంధ్యాసమస్యల కేక
నేటికీ వినిపిస్తూనే ఉంది
అవతలిగట్టుకు వెళ్ళమని!

ఒకరాత్రి ఆకాశదీపం
ప్రజలింకా పరాజితులని
ఒక క్షణంలో సకల జనం
సభరసగమనంతో సాగే
యుగయుగాల రథనాదం!

కనిపించే ఈ నీడలు
పేదల వేదన రోదన!
గణగణ కొట్టే గంటలు
కాలానికి కళ్లెం వేస్తాయి
ప్రేమానికి గొళ్ళెం తీస్తాయి!

నీ శైశవగీతాలాపనతో
పరమాత్మలు చిరుతలు
శిశువులు ఇనబింబందాకా
ఎగరాలని ప్రయత్నిస్తారు
అది నీ గీతాల చైతన్యం!

నీ వినిపించిన దేశచరిత్రలు
చారిత్రక విభాత సంధ్యలు!
మానవకథ వికాసాన్ని
నాలుగుముక్కల్లోతేటతెల్లం
చేసిన 'వాడు' ఇంకెవరు?

మాయల మిధ్యావాదిలోని
వర్గ వ్యత్యాసం బైట పెట్టి
అన్నిదిక్కుల ఆశాదూతలు
ఈ లోకం మీదే అని కదిలే
జగన్నాథుని రథచక్రాలు!

మానవుడా!మానవుడా!అని
వినిపించిన చైతన్య గీతాల
రసధునీ! ఓమహాకవీ!ఇది
నీకు నేను ఇచ్చే స్మృతిగీతం
ఇదంతా నీ మహా ప్రస్థానం!!

**-తమ్మినేని అక్కిరాజు**
హైదరాబాద్

### దిగ్భ్రమ

గాలి ప్రయాణం
రోడ్డు ప్రయాణం
రైలు ప్రయాణం
గుండెల మీద
వేసుకొని చెప్పగలమా
సురక్షితం అని కోటి ఆశలతో
పతి వద్దకు చేరేందుకు సతి
కుటుంబము మొత్తం
బ్రిటన్‌లో స్థిర పడేందుకు
కొందరు
గాలి ప్రయాణం గాలిలో
కలిసినట్టు అయే
భోజనం చేస్తున్న మెడికోల
మృత్యుశకటం అయ్యి
ప్రాణాలు హరి
ప్రాణాలు పొసే డాక్టర్ల
కె క్షణకాలం లో
ప్రాణాలు పాయే
దిగ్భ్రమలుజి
నష్ట పరిహారాలు
ఆత్మ శాంతులు
ట్విట్టర్ వేదికగా ట్వీట్లు
గుండె కోతను
అపగలవా
ఒకరి తప్పు ఇంకొకరి
పై నెత్తివేయడం
కారణాలు ఏవైనా
ఆశలు ఆవిరి అయ్యి
రెప్పపాటు కాలం
లో సృష్టి వైచిత్రి
అంటూ ముందుకు
ఎగితున్నాం
యుద్దలకి కోట్ల ఖర్చు చేసే
ఆయుధాలు కొంటున్నాం
ప్రయాణానికి ఉపయోగించే
వాహనాలు సంగతి ఏమిటి
దిగ్భ్రమ తప్ప

**ఉమాశేషారావు వైద్య**
కామారెడ్డి
9440408080

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అన్యాయం

**తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు ఆ హామీ నుంచి వెనక్కి తగ్గినట్లు కనిపిస్తోంది. కేంద్ర ప్రభుత్వ నిబంధనలను సాకుగా చూపిస్తూ, చట్టబద్ధంగా రిజర్వేషన్లు అమలు చేయకుండా, కేవలం పార్టీ కోటా ఆధారంగా మాత్రమే బీసీలకు అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నేపథ్యంలో, సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన విధానాలపై లోతైన చర్చ జరిగినట్లు సమాచారం.**




కేంద్రం ఇటీవల రాష్ట్రాల కులగణనకు చట్టబద్ధత లేదని ప్రకటించడంతో, బీసీ రిజర్వేషన్ల అమలు సాధ్యా సాధ్యాలపై చర్చించిన ప్రభుత్వం, చివరకు చట్టబద్ధ రిజర్వేషన్లకు బదులు పార్టీ ఆధారిత కోటా విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయంతో బీసీలకు మరోసారి అన్యాయం జరిగే ప్రమాదం ఏర్పడింది.
బీసీల రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ హామీలు నీటిమీద రాతలే:
అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ బీసీలకు చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని గట్టిగా హామీ ఇచ్చింది,దీనినే "కామారెడ్డి డిక్లరేషన్" అంటారు. ఈ పేరుతో కాంగ్రెస్ పార్టీ బీసీల ఓట్లను ఆకర్షించే ప్రయత్నం చేసింది. అయితే, జనాభా గణన చట్టం–1948 ప్రకారం, కులగణన నిర్వహణ అధికారం కేవలం కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉంది. రాష్ట్ర ప్రభుత్వాలకు అటువంటి అధికారం లేదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇటీవల స్పష్టం చేశారు. రాష్ట్రాలు కులగణన పేరుతో చేసే ఏ ప్రయత్నమూ చట్టబద్ధంగా చెల్లదని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయం మొదటి నుంచీ తెలిసినప్పటికీ, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ బీసీలను బూటకపు హామీలతో మోసం చేసేందుకు "కులగణన" ను ఉపయోగించుకుందనే విమర్శలు వస్తున్నాయి.
2024 నవంబర్‌లో తెలంగాణ ప్రభుత్వం రూ.160 కోట్ల వ్యయంతో ఇంటింటి సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, అలాగే కుల సర్వేను నిర్వహించింది. ఈ సర్వే ఫలితాల ప్రకారం, రాష్ట్ర జనాభాలో బీసీలు 46.25 శాతం (1,64,09,179 మంది), బీసీ ముస్లింలు 10.08 శాతం (35,76,588 మంది), ఎస్సీలు 17.43 శాతం (61,84,319 మంది), ఎస్టీలు 10.45 శాతం (37,05,929 మంది), ఓసీ ముస్లింలు 2.48 శాతం (8,80,424 మంది), ఇతర ఓసీలు 13.31 శాతం (44,21,115 మంది) ఉన్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. అయితే, కులాలు, ఉపకులాల వారీ వివరాలను మాత్రం గోప్యంగా ఉంచడం గమనార్హం. ఈ సర్వే ఆధారంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు ఆమోదించబడినప్పటికీ, కేంద్రం దీన్ని ఆమోదించే అవకాశం లేదని తెలిసినా గవర్న ర్ ఆమోదానికి పంప డం విమర్శలకు దారితీసింది. ఆ తర్వాత ఈ బిల్లుపై ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు, దీంతో రూ.160 కోట్ల ప్రజాధనం వృథా అయ్యిందనే ఆరోపణలు వస్తున్నాయి.


**గత రిజర్వేషన్ల అమలు కూడా కష్టమే:**
2019 జనవరిలో జరిగిన సర్పంచ్ ఎన్నికల సమయంలో, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 50 శాతాన్ని మించకూడదని సుప్రీంకోర్టు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. 2011 జనాభా గణాంకాల ఆధారంగా, బీసీలకు 22.79 శాతం, ఎస్సీలకు 20.53 శాతం, ఎస్టీలకు 6.68 శాతం రిజర్వేషన్లు కేటాయించబడ్డాయి. అయితే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ విధానాల వల్ల ఈ రిజర్వేషన్లు కూడా కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. రాజ్యాంగం ప్రకారం, ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే స్థానిక సంస్థల్లో చట్టబద్ధమైన రిజర్వేషన్లు ఉన్నాయి. బీసీలకు అలాంటి హామీ లేదు. ఆర్టికల్ 243–డీ(6), 243–టీ(6) ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఇష్టానుసారం బీసీ రిజర్వేషన్లను కల్పిస్తున్నాయి. కానీ, ఇవి తరచూ న్యాయవివాదాలకు దారితీస్తున్నాయి.

**సుప్రీంకోర్టు జారీ చేసిన "ట్రిపుల్-టీ" మార్గదర్శకాల ప్రకారం:**
1. స్థానిక సంస్థల్లో ఓబీసీ రిజర్వేషన్ల కోసం రాజ్యాంగబద్ధమైన డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేయాలి.
2. జనాభా నిష్పత్తికి అనుగుణంగా రిజర్వేషన్లు ఖరారు చేయాలి.
3. ఎస్సీ,ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లు కలిపి 50 శాతాన్ని మించకూడదు.

ఈ మార్గదర్శకాలను పాటించని రాష్ట్రాల్లో ఓబీసీ రిజర్వేషన్లు అమలు చేయకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. గుజరాత్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో ఈ నిబంధనలు పాటించకపోవడంతో స్థానిక సంస్థల ఎన్నికలు రద్దయ్యాయి. తెలంగాణలో బూసాని వెంకటేశ్వర్లు నేతృత్వంలో ఏర్పాటైన డెడికేటెడ్ కమిషన్ నివేదిక సమర్పించినప్పటికీ, కులగణనకు చట్టబద్ధత లేకపోవడంతో 42 శాతం రిజర్వేషన్ ప్రతిపాదన చెల్లదు. గతంలో ఉన్న 23 శాతం రిజర్వేషన్‌ను కొనసాగించాలన్నా, కొత్త నివేదిక అవసరం, దీనికి సుదీర్ఘ సమయం తీసుకునే అవకాశం ఉంది.
ప్రస్తుత పరిస్థితుల్లో, బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 23 శాతం రిజర్వేషన్ కూడా కోల్పోయే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రం నిబంధనలను సాకుగా చూపి, పార్టీ కోటా ఆధారంగా రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించడం, బీసీలకు చట్టబద్ధ హక్కులను నిరాకరించడమేనని విమర్శకులు ఆరోపిస్తున్నారు. ఈ పరిణామాలు బీసీ సామాజిక వర్గాల్లో అసంతృప్తిని పెంచుతున్నాయి, మరియు రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో స్పష్టమైన, చట్టబద్ధమైన చర్యలు తీసుకోకపోతే, బీసీల రాజకీయ ప్రాతినిధ్యం మరింత దిగజారే అవకాశం ఉంది.

**డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్. 9849328496.**

# భారతదేశంలో పేదరికం



భారతదేశంలో పేదరికం నిర్వచనం ప్రధానంగా కనీస జీవన అవసరాల ఆధారంగా రూపొందించబడింది. ప్రణాళికా సంఘం (ప్రస్తుతం నీతి ఆయోగ్) గ్రామీణ ప్రాంతాల్లో రోజుకు 2,400 క్యాలరీలు, పట్టణ ప్రాంతాల్లో 2,100 క్యాలరీల ఆహారం పొందలేని వారిని పేదలుగా పరిగణిస్తుంది. ఈ క్యాలరీ ఆధారిత నిర్వచనం ఆహారం, గృహవసతి, దుస్తులు వంటి ప్రాథమిక అవసరాలను సమకూర్చుకోలేని స్థితిని సూచిస్తుంది. అంతర్జాతీయంగా, ప్రపంచ బ్యాంకు రోజుకు $3 (పీపీపీ డాలర్లలో) కంటే తక్కువ ఆదాయం ఉన్నవారిని తీవ్ర పేదరికంలో ఉన్నవారిగా గుర్తిస్తుంది. భారతదేశం లో పేదరికం నిరపేక్ష (అబ్సొల్యూట్) మరియు సాపేక్ష (రెలెటివ్) రకాలుగా వర్గీకరించబడింది, ఇక్కడ నిరపేక్ష పేదరికం కనీస అవసరాల లేమిని, సాపేక్ష పేదరికం ఆదాయ అసమానతలను సూచిస్తుంది.

**బీజేపీ హయాంలో పేదరికం తగ్గుదల**
2014 నుంచి బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలనలో గణనీయమైన పురోగతి సాధించినట్లు వాదిస్తోంది. ప్రపంచ బ్యాంకు గణాంకాల ప్రకారం, 2011–12లో 27.1 శాతం ఉన్న తీవ్ర పేదరికం 2022–23 నాటికి 5.3 శాతానికి తగ్గింది. బహుముఖ పేదరిక సూచిక (ఎం.పీ.ఐ.) ప్రకారం, 2005–06లో 53.8 శాతం ఉన్న పేదరికం 2022–23 నాటికి 15.5 శాతానికి తగ్గింది, సుమారు 26 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డార ని నివేదికలు చెబుతున్నాయి. పీఎం ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, జన్ ధన్ యోజన వంటి పథకాలు గృహవసతి, ఇంధనం, బ్యాంకింగ్ సేవలను అందించడం ద్వారా ఈ తగ్గుదలకు దోహదప డ్డాయని ప్రభుత్వం పేర్కొంటోంది.

**జిడిపి అలాగే తలసరి ఆదాయ సంబంధం:**
జిడిపి (స్థూల దేశీయోత్పత్తి) ఒక దేశ ఆర్థిక ఉత్పత్తిని సూచిస్తుంది, అయితే తలసరి ఆదాయం జనాభాకు జిడిపిని భాగించడం ద్వారా వచ్చే సగటు ఆదాయాన్ని సూచిస్తుంది. జిడిపి పెరిగినప్పుడు తలసరి ఆదాయం కూడా సాధారణంగా పెరుగుతుంది, కానీ జనాభా వృద్ధి రేటు జిడిపి వృద్ధిని మించితే తలసరి ఆదాయం తగ్గవచ్చు. భారతదేశంలో 2014–24 మధ్య జిడిపి వృద్ధి సగటున 6–7 శాతం ఉండగా, తలసరి ఆదాయం కూడా పెరిగింది, కానీ ఆదాయ అసమానతలు పేదరిక నిర్మూలనకు అవరోధంగా నిలిచాయి. ట్రికిల్ డౌన్ సిద్ధాంతం ప్రకారం, జిడిపి వృద్ధి పేదరికాన్ని స్వయంచాలకంగా తగ్గిస్తుందని భావించారు, కానీ 1970ల నాటికి ఈ సిద్ధాంతం విఫలమైనట్లు ఆర్థికవేత్తలు గుర్తించారు.

**రేషన్ బియ్యం - పేదరికం తగ్గుదల వాదనలు:**
కేంద్ర ప్రభుత్వం జాతీయ ఆహార భద్రతా చట్టం కింద 80 కోట్ల మందికి రేషన్ బియ్యం అందిస్తోంది, ఇది దాదాపు 60% జనాభాను కవర్ చేస్తుంది. ఇది పేదరికం ఇంకా విస్తృతంగా ఉందని సూచిస్తుంది. అయితే, ప్రభుత్వం ఈ సంఖ్యను సంక్షేమ పథకాల లబ్ధిదారుల సంఖ్యగా వివరిస్తుంది, పేదరిక గణాంకాలతో సంబంధం లేకుండా. ప్రపంచ బ్యాంకు, నీతి ఆయోగ్ డేటా ఆధారంగా పేదరికం తగ్గిందని ప్రభుత్వం వాదిస్తోంది, కానీ రేషన్ కార్డుల సంఖ్య ఈ వాదనకు విరుద్ధంగా కనిపిస్తుంది. ఈ వైరుధ్యం డేటా సేకరణ పద్ధతులు, పేదరిక రేఖ నిర్ధారణలోని తేడాల వల్ల ఏర్పడింది.

**ప్రతిపక్షాలు అలాగే వాముపక్షాల వాదనలు :**
వామపక్ష పార్టీలతో సహా ప్రతిపక్షాలు ప్రభుత్వ గణాంకాలను ప్రశ్నిస్తున్నాయి. పేదరిక రేఖ నిర్ధారణలో తెందూల్కర్, రంగరాజన్ కమిటీల పద్ధతులు వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించవని, ఆదాయ అసమానతలు, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవడం లేదని వారు వాదిస్తున్నారు. రేషన్ కార్డుల సంఖ్యను ఆధారంగా చూపి, పేదరికం తగ్గినట్లు చెప్పడం గణాంకాలను తప్పుదోవ పట్టించడమని విమర్శిస్తున్నారు. వామపక్షాలు బహుముఖ పేదరిక సూచిక (ఎంపీఐ )ని ఉపయోగించి ఆరోగ్యం, విద్య, జీవన ప్రమాణాలను కొలవాలని సూచిస్తున్నాయి, అయితే ప్రభుత్వం ఆదాయ ఆధారిత కొలతలపై ఎక్కువ దృష్టి పెడుతోంది.

**పేదరికం అంచనా పద్ధతులు**
పేదరికాన్ని కొలవడానికి రెండు ప్రధాన పద్ధతులు ఉన్నాయి:
**1.నిరపేక్ష పేదరికం:** కనీస క్యాలరీ అవసరాలు, ఆదాయం లేదా వినియోగ వ్యయం ఆధారంగా పేదరిక రేఖను నిర్ధారిస్తారు.
**2. సాపేక్ష పేదరికం:** సమాజంలో మధ్యస్థ ఆదాయంతో పోల్చి, ఒక నిర్దిష్ట శాతం కంటే తక్కువ ఆదాయం ఉన్నవారిని పేదలుగా గుర్తిస్తారు. బహుముఖ పేదరిక సూచిక (మల్టీ పర్పస్ ఇండెక్స్) (ఎంపీఐ) ఆరోగ్యం, విద్య, జీవన ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుంటుంది, ఇది మరింత సమగ్రమైన కొలతగా పరిగణించబడుతుంది. భారతదేశంలో ఎన్.ఎస్.ఎస్.ఓ. (జాతీయ నమూనా సర్వే సంస్థ) డేటా, ప్రణాళికా సంఘం అంచనాలు ఉపయోగించబడతాయి, కానీ ఈ పద్ధతులు ద్రవ్యోల్బణం, జీవన వ్యయంలో మార్పులను పూర్తిగా ప్రతిబింబించవని విమర్శలు ఉన్నాయి.
శాస్త్రీయంగా, పేదరికం తగ్గుదలను అంచనా వేయడానికి బహుమితీయ విశ్లేషణ అవసరం. (ఎన్.ఎస్.ఎస్.ఓ.) డేటా ప్రకారం, 2011–12లో 21.9 శాతం జనాభా దారిద్య రేఖ కింద ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లో 25.7%, పట్టణ ప్రాంతాల్లో 13.7 శాతం ఉన్నారు. ప్రపంచ బ్యాంకు డేటా 2022–23 నాటికి తీవ్ర పేదరికం 2.3 శాతం ($2.15/రోజు)కి తగ్గినట్లు చూపిస్తుంది. అయితే, ఆదాయ అసమానతలు (జినీ సూచిక 0.36కి పైగా) మరియు నిరుద్యోగం (2023లో 7 శాతానికి పైగా) పేదరిక నిర్మూలనకు సవాళ్లుగా ఉన్నాయి. రేషన్ కార్డుల సంఖ్య సామాజిక సంక్షేమ అవసరాలను సూచిస్తుంది, కానీ ఇది పేదరిక గణాంకాలతో నేరుగా సంబంధం కలిగి ఉండకపోవచ్చు.

**విమర్శనాత్మక దృక్పథం:**
ప్రభుత్వం పేదరిక తగ్గుదలను సంక్షేమ పథకాలకు ఆపాదిస్తున్నప్పటికీ, డేటా సేకరణలో పారదర్శకత లోపం, పేదరిక రేఖ నిర్ధారణలో వాస్తవికతకు దూరంగా ఉన్న పద్ధతులు విమర్శలకు గురవుతున్నాయి. ఉదాహరణకు, తెందూల్కర్ కమిటీ పద్ధతి రోజుకు రూ.32 (గ్రామీణ) లేదా రూ.47 (పట్టణ) ఆధారంగా పేదరిక రేఖను నిర్ణయించడం జీవన వ్యయంతో సరిపడదని రంగరాజన్ కమిటీ సూచించింది. అదేవిధంగా, ఆదాయ ఆధారిత కొలతల కంటే (ఎంపీఐ) వంటి సూచికలు మరింత ఖచ్చితమైన చిత్రణను అందిస్తాయి, కానీ ఇవి ప్రభుత్వ వాదనలలో తక్కువగా ఉపయోగిం చబడుతున్నాయి. వామపక్షాల వాదనలు ఆదాయ అసమానతలు, నిరుద్యోగంపై దృష్టి పెడతాయి, కానీ ఆచరణీయ పరిష్కారాలను సూచించడంలో విఫలమవుతున్నాయి.
చివరిగా... భారతదేశంలో పేదరికం తగ్గుదల గణాంకాలు ఆశాజనకంగా కనిపించిన ప్పటికీ, డేటా విశ్వసనీయత, కొలత పద్ధతులు, ఆదాయ అసమానతలపై సమగ్ర చర్చ అవసరం. శాస్త్రీయంగా, (ఎంపీఐ) వంటి బహుమితీయ సూచికలను ఆధారంగా చేసుకుని, ద్రవ్యోల్బణం, జీవన వ్యయం, నిరుద్యోగం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటే మరింత ఖచ్చితమైన అంచనా సాధ్యమవు తుంది. ప్రభుత్వం, ప్రతిపక్షాల వాదనలు రాజకీయ ధ్రువీకరణకు దారితీస్తున్నాయి, కానీ వాస్తవిక పేదరిక నిర్మూలన కు ఆర్థిక సమానత్వం, ఉపాధి సృష్టి, సమగ్ర డేటా విశ్లేషణపై దృష్టి అవసరం.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
9849328496.



### తేమవగలమా..?? తపనవగలమా..!!

గలగలా పారే ఏరులు
వొట్టిపోయే నేల ఇది..
పలుపు తెంచుకు వీచే
హోరు గాలులు సైతం
గడ్డ కట్టుకు పోయిన
మహా సముద్రమోలే
నిశ్శబ్ద రోదనలతో
విలపించే సందెవేళ..
పొడిపోడి అక్షరాలై
అయినా తేలినం..
మాటే గగనమయ్యి
మిగిలితిమిది నిజం..
అతని ఆ రాకడ కోసం
జన్మనిచ్చె ఆమె కోసం..
ఆ నూతన మానవ
ఆగమనాల కోసం..
ఆహ్వాన తోరణాలు
అవగలమా మనం..
తడి లేని పెదాల
వొడి కాని పగుళ్ల
తేమవగలమా..??
తపనవగలమా..!!

**- డా. ఇక్బాల్ పాషా**
9440775732

# ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



**హయత్‌నగర్, జూన్ 18 (జనం సాక్షి) :** తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ టియుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు రామినేని వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లచ్చిమల్ల వెంకన్న ల ఆధ్వర్యం లో పాఠశాల విద్యాశాఖ నూతన కమిషనర్, విద్యా సంచాలకులు ఈ నవీన్ నికోలస్ ని మర్యాద పూర్వకం గా కలిసి వారిని శాలువా తో సన్మానించి, సంఘ దైనందిని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఉన్న వివిధ సమస్యలపై వారికీ వినతి పత్రం సమర్పించామని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న క్రింది సమస్యలు వారి దృష్టికి తేవడం జరిగింది. పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులను అర్హత కలిగిన ఉపాధ్యాయులతో ప్రమోషన్ ఇచ్చి వెంటనే నింపాలి. మెడికల్ రీయింబర్స్మెంట్ బిల్లుల జారీలో జరుగుచున్న జాప్యాన్ని నివారించాలి. మండల విద్యాధికారి, జిల్లా విద్యాధికారి పోస్టులను రెగ్యులర్ వారితో నింపి పర్యవేక్షణను పెంచాలి. జిల్లాల లో గత సంవత్సరపు స్కావెంజర్ బిల్లులు జమ కాలేదు. కావున వాటిని వెంటనే జమ అయ్యే విధంగా చూడాలని కోరుచున్నాము. ఈ సంవత్సరం స్కావెంజర్ బిల్లులు డైరెక్టుగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అకౌంట్ లో జమ చేయాలి. పాఠశాల లలో సాంకేతిక విద్య కోసం కంప్యూటర్లు, టి. వి. లను ఏర్పాటు చేసినందున సెక్యూరిటీ కోసం నైట్ వాచ్ మెన్లను ఏర్పాటు చేయాలి. మధ్యాహ్న భోజన కార్మికులకు జీతాలు, బిల్లులు ప్రతి నెల వచ్చే విధంగా చూడాలి. ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే విద్యా వాలంటీర్లతో భర్తీ చేయాలి. గత సంవత్సరం ఇచ్చిన వర్క్ అడ్జస్ట్మెంట్ ఆర్డర్స్ ను పునః పరిశీలన చేసి వారి మాతృ స్థానంలో విద్యార్థులు పెరిగితే వారిని తిరిగి వారి స్థానం లోకి పంపాలి. పండిట్, వ్యాయామ ఉపాధ్యాయుల అప్గ్రేడేషన్ వల్ల సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు జరుగుచున్న నష్టాన్ని నివారించడానికి ఇస్తా అన్న ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. ఈ కార్యక్రమం లో హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిత్తలూరి వెంకటేశ్వరరావు, మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఆక గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన జిల్లా కలెక్టర్



**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 18 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లాలో ఇటీవల బాధ్యతలు చేపట్టిన జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, బుధవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవాని చంద్రను మర్యాద పూర్వకంగా కలిశారు. సంగారెడ్డి న్యాయస్థాన సముదాయ భవనంలోని జిల్లా జడ్జి ఛాంబర్లో ప్రధాన న్యాయమూర్తికి పూల మొక్కను అందించారు. ఈ సందర్భంగా న్యాయ సేవాధికార సంస్థ (డిఎల్ఎస్ఏ) ఆధ్వర్యంలో అమలు చేసే న్యాయ సహాయ కార్యక్రమాలపై ఇరువురు కొద్దిసేపు చర్చించారు.

## చదువుతోనే సమాజాభివృద్ధి

- జిల్లా కలెక్టర్ హైమావతి



**సిద్దిపేట, జూన్ 18 (జనం సాక్షి) :** చదువుతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని జిల్లా కలెక్టర్ హైమావతి అన్నారు. సిద్దిపేట జిల్లాలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ శ్రీమతి హైమావతిని పీఆర్‌టీయూ సిద్దిపేట జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లుగారి ఇంద్రసేనారెడ్డి, అదరాసుపల్లి శశిధరశర్మ, పీఆర్టీయూ బృందం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు అంకిత భావంతో నాణ్యమైన విద్య అందించాలని కోరారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు సమకూరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీ ఆర్ టీ యూ పత్రికా సంపాదక వర్గ సభ్యురాలు లక్కిరెడ్డి విజయ, అసోసియేట్ అధ్యక్షుడు నర్రా భాస్కర్ రెడ్డి, మాధవి, చామకుర అనిల్ కుమార్, నీరుడు లక్ష్మినారాయణ, సయ్యద్ సందాని, కొండపాక మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నర్రా రాంచంద్రా రెడ్డి, మహదేవ్ రాజు, తొగుట మండల అధ్యక్షుడు పుల్లగూర్ల రాంచంద్రారెడ్డి, నంగునూరు అధ్యక్షుడు ఎర్ర పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ నూతన కలెక్టర్‌ను కలిగిన టీజీవో నాయకులు



**హైదరాబాద్ సిటీ, జూన్ 18 (జనంసాక్షి) :** హైదరాబాద్ జిల్లాకు నూతనంగా పదవి బాధ్యతలు తీసుకున్న కలెక్టర్ దాసరి హరిచంద్ర ను బుధవారం తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ నాయకులు కలవడం జరిగింది. టీజీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎం బి కృష్ణ యాదవ్, కార్యదర్శి ఏమే ఖాదర్, అసోసియేట్ అధ్యక్షులు ఆశన్న, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎన్ సురేందర్, ట్రెజరర్ ఎంవి రమణ, శ్రీరాములు, డివో రోహిణి, నర్సింలు చారి ఆర్గనైజ్ సెక్రటరీ గౌస్ హుస్సేన్ అలీ, ఏ రాజశేఖర్, కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హైదరాబాద్ అభివృద్ధిలో ముందు వరుసలో నిలబడేందుకు కృషి చేస్తానని తెలియజేశారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కలెక్టర్ కి జిల్లాలో పనిచేస్తున్న అధికారులు అందరూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తూ కలెక్టర్ కి మంచి పేరు ప్రతిష్టలు తీసుకొస్తామని తెలియజేశారు.

## నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

- ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్, జూన్ 18 (జనం సాక్షి) :** నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి పనులు జరిపిస్తున్నా నని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. బుధవారం బండ్లగూడ జాగీర్ నగర పాలక సంస్థ లో రూ.744.20 లక్షల అభివృద్ధి పనులకు ఆయన కమిషనర్ శర చంద్ర తో కలిసి శంకుస్థాపన చేశారు. బండ్లగూడ జాగీర్ నగర పాలక సంస్థ పరిధిలోని 12, 17, 18, 19, 20 22 డివిజన్లలో వివిధ కాలనీ లలో రూ.744.20 లక్షలతో నూతన అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, నూతన సిసి రోడ్లు అభివృద్ధి పనులుగా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు పి కృష్ణారెడ్డి, మాజీ మేయర్ మహేందర్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ పి.రాజేందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు శ్రీలత సురేష్ గౌడ్, నికిలా సంగారెడ్డి పద్మావతి పాపయ్య యాదవ్, సాగర్ గౌడ్, మాజీ కో-ఆప్షన్ మెంబెర్స్, వివిధ పార్టీల నాయకులు, మునిసిపల్ అధికారులు స్థానికులు పాల్గొన్నారు.

# ఆస్పత్రి పనులను పరిశీలించిన మంత్రి వాకిటి శ్రీహరి



**మక్తల్, జూన్ 18 (జనంసాక్షి) :** మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో 150 పడకల ఆసుపత్రి పనులను తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక పాడి పరిశ్రమ మత్స్య క్రీడలు, యువజనుల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి పరిశీలించారు. మక్తల్ నియోజకవర్గం అభివృద్ధిలో భాగంగా సుమారు 55 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న నూతన 150 పడకల ఆసుపత్రి పనులను పరిశీలించి ఆసుపత్రి పనుల్లో నాణ్యత లోపాలు లేకుండా శరవేగంగా పనులు జరగాలని సంబంధిత అధికారులను కాంట్రాక్టర్ ను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రి తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు రవికుమార్, లక్ష్మారెడ్డి ,కోళ్ల వెంకటేష్, గడ్డంపల్లి హనుమంతు, ఆనంద్ గౌడ్, రాయ్ కోడ్ ఆనంద్ ,లక్ష్మణ్ సింగ్, బోయ వెంకటేష్ ,అడ్వకేట్ శ్రీనివాస్, వాకిటి శ్యామ్, గద్వాల్ రవి, నాగరాజ్, కల్లూరి గోవర్ధన్, నీలప్ప ముదిరాజ్, శివరాంరెడ్డి, దండు రాము తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక శాఖ మంత్రిని కలిసిన టిపిసిసి ప్రధాన కార్యదర్శి సానెం శ్రీనివాస్ గౌడ్



**రాజేంద్రనగర్, జూన్ 18 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రిగా నూతన పదవి చేపట్టిన గడ్డం వివేక్ వెంకటస్వామి ని మైలార్ దేవ్ పల్లి కి చెందిన టిపిసిసి ప్రధాన కార్యదర్శి సానెం శ్రీనివాస్ గౌడ్ కలిసి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మంత్రి తో మాట్లాడుతూ కార్మిక శాఖ మంత్రిగా మీరు రావడం ఎంతో సంతోషకరమని ఇప్పుడు ఇక కార్మిక సమస్య లు తొలగిపోతాయని ఆనందం వ్యక్తం చేశారు. మంత్రికి మైలార్ దేవ్ పల్లి డివిజన్లోని కాటేదాన్ పారిశ్రామిక వాడలో కార్మికులు దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నారని, వారిలో చాలామందికి కనీస వేతనం కూడా ఇవ్వకుండ యజమానులు గొడ్డు చాకిరీ చేయించుకుంటున్నారని కార్మికుల చట్టాల ప్రకారం కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని ఆయన మంత్రికి వివరించారు. అలాగే గతంలో కాటేదాన్ పారిశ్రామిక వాడలో కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు కార్మిక వేదిక ఉండేదని కానీ దానిని ఇప్పుడు అమలు చేయడం లేదని, దీనిని మరల అమలు అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు దీనికి స్పందించిన మంత్రి వెంటనే అమలు చేస్తానని కార్మికలకు ప్రభుత్వం అండగా ఉంటుందని శ్రీనివాస్ గౌడ్ కు హామీ ఇచ్చారు.

# మంత్రి గడ్డం వివేక్‌కు శుభాకాంక్షలు తెలిపిన జైపాల్ రెడ్డి



**శామీర్‌పేట్, జూన్ 18 (జనం సాక్షి) :** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రెండవ అంతస్తులో కేటాయించిన చాంబర్ లో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం రాష్ట్ర కార్మిక, ఉపాధి,శిక్షణ, కర్మాగారాలు,గనుల మరియు భూగర్భ శాఖా మంత్రిగా గడ్డం వివేక్ వెంకట స్వామి బాధ్యతలు స్వీకరిచారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్మిక,ఉపాధి,శిక్షణ, కర్మాగారాలు,గనుల మరియు భూగర్భ శాఖా మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని మర్యాద పూర్వకంగా మేడ్చల్ జిల్లా రీజినల్ ట్రాన్స్పోర్ట్ అథా రిటీ మెంబర్ జైపాల్ రెడ్డి కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## పర్యావరణాన్ని రక్షించుకోవడం మనందరి బాధ్యత



**చేవెళ్ల, జూన్ 18 (జనంసాక్షి) :** మండల విద్యాధికారి పురందాస్ తెలిపారు. బడిబాటలో భాగంగా దామరగిద్ద ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు, మండల విద్యాధికారి పురందాస్, గ్రామ మాజీ సర్పంచ్ వెంకటేశం గుప్తా ఉపాధ్యాయులు సమక్షంలో మొక్కల పెంపక ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరించి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటడం జరిగింది. ఎకోసాన్స్ ఫౌండేషన్ మరియు కన్వేజ్జీనియస్ వారి సహకారంతో ఏర్పాటవుతున్న తరగతి గదుల డిజిటలీకరణ పనులు మరియు విద్యార్థుల మూత్రశాలలు, మరుగుదొడ్ల ఆధునీకరణ పనులను పరిశీలిచడం జరిగింది. అనంతరం గ్రామ సరిహద్దులో ఆర్గానో సంస్థ నిర్మిస్తున్న విల్లాల నిర్మాణ ప్రాంతానికి వెళ్లి అక్కడ పనిచేస్తున్న వారి పిల్లలను అవుట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్ బడిలో చేర్పించుటకు వారి తల్లిదండ్రులతో, ఆర్గానో సంస్థ సైట్ ఇంజనీర్ తో మాట్లాడడం కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది. అక్కడి కూలీల పిల్లలను ఎంపియుపిఎస్ దామరగిద్ద బడిలో చేర్పించే విధంగా సంస్థ యాజమాన్యంతో మాట్లాడతానని వెంకటేశం గుప్తా అన్నారు. బడి ఉపాధ్యాయుల పై నమ్మకంతో ప్రైవేటు స్కూలు నుండి తమ పిల్లల్ని తీసి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తున్న తల్లిదండ్రులను ప్రశంసించారు. ఇప్పటివరకు 11 మంది విద్యార్థులు ప్రైవేటు స్కూల్ నుండి గ్రామ ప్రభుత్వ బడిలో చేరిన అంశాన్ని ప్రస్తావిస్తూ పాఠశాల ఉపాధ్యాయులను అభినందించారు. తన సమక్షంలో గ్రామస్తుడు శంకర్ తమ ముగ్గురు పిల్లలను ప్రైవేటు నుండి తీసి ప్రభుత్వ బడిలో చేర్పించినందుకు అతన్ని అభినందించారు. అనంతరం వెంకటేశం గుప్తా మాట్లాడుతూ...పాఠశాల వసతులు నిర్వహణపై సంతృప్తి వ్యక్తపరుస్తూ పాఠశాల ఆవరణలో షెడ్ వేస్తే బాగుంటుందని దీనికై తనవంతు కృషి చేస్తానని అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. పాఠశాల ఉపాధ్యాయుల పనితీరును మెచ్చుకొని తనదైన శైలిలో అభినందించారు. ఈ బడిబాట కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ వెంకటేశం గుప్తా, మండల విద్యాధికారి పురం దాస్, ప్రధానోపాధ్యాయురాలు ఎల్ సంగీత, ఉపాధ్యాయులు కే బాలాజీ, ఆంజనేయులు, కిరణ్ కుమార్, వసంత, సుమజా, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## లోతట్టు ప్రాంతాల్లో వరద ముంపు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలి

- కమిషనర్ ఆర్ వి కర్ణన్



**హైదరాబాద్ సిటీ, జూన్ 18 (జనంసాక్షి) :** లోతట్టు ప్రాంతాల్లో వరద ముంపు లేకుండా తక్షణ తాత్కాలిక చర్యలు చేపట్టాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్ అధికారులను ఆదేశించారు. ఇటీవల కురిసిన వర్షాలకు చార్మినార్ జోన్ సంతోష్ నగర్ సర్కిల్ లో ముంపు ప్రాంతాలను బుధవారం కమిషనర్ యాకుత్ పుర ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ లోతట్టు ప్రాంతాల్లో వరద నీటిని పంపింగ్ చేసి లోతట్టు ప్రాంతాల్లో వరద ముంపు నివారణకు సత్వర చర్యలు తీసుకోవాలని మెయింటెనెన్స్ సిఈ ని ఆదేశించారు. వరద నీటి ప్రవాహాన్ని నియంత్రించడానికి శాశ్వత చర్యల కోసం సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కమీషనర్ వెంట జోనల్ కమీషనర్ వెంకన్న, జోనల్ ఎస్ఈ మహేశ్వర్ రెడ్డి, డి సి మంగతాయారు, సి ఈ సహదేవ్ రత్నాకర్, ప్రాజెక్టు ఈఈ శ్రీనివాస్, కార్పొరేటర్ వాసిఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యల శాశ్వత పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

- వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ నాయక్



**మోమిన్‌పేట, జూన్ 18 (జనం సాక్షి) :** భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దే శంతోనే ప్రభుత్వం గ్రామాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులను తలపెట్టిందని అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ తెలిపారు. బుధవారం నాడు మండల కేంద్రమైన మోమిన్ పేట గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ మాట్లాడుతూ గ్రామాల్లో రైతులు, ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను స్వీకరించేందుకు, కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. దరఖాస్తుదారులకు, సహకరించేలా, హెల్ప్ డెస్కను అందుబాటులో ఉంచి, ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా, దరఖాస్తులను, రిజిస్టర్లలో నమోదు చేస్తూ, పూర్తి డాటా ను ఆన్లైన్లో పొందుపరుస్తు న్నామన్నారు. ప్రభుత్వ మార్గదర్శ కాలను, తూచా తప్పకుండా, పాటిస్తూ నూతన ఆర్ఆర్ చట్టం, నిబంధనల ప్రకారం, దరఖాస్తులు స్వీకరించి, వాటి పరిశీలన, విచారణ ప్రక్రి యలను నిర్వహిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ ఆర్డిఓ వాసు చంద్ర మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వై మహేందర్ రెడ్డి మండల తహసిల్దార్ రవీందర్ డిప్యూటీ తాసిల్దార్ సురేష్ కుమార్ ఆర్ఐలు, గోవర్ధన్ గౌడ్ సరిత, జూనియర్ అసిస్టెంట్లు, మహేష్ గౌడ్, అలివేలు, రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు రవి, వీణా కాంగ్రెస్ పార్టీ నాయకులు సుభాష్ గౌడ్ హే రాజ్ సిరాజుద్దీన్ఎజాజ్ పటేల్ మహంత్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# హఫీజ్‌పేట్ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తా..



**శేరిలింగంపల్లి, జూన్ 18 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం హఫీజ్పేట్ డివిజన్ పరిధిలో సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని డివిజన్ కార్పొరేటర్ పూజిత జగదీశ్వర్ గౌడ్, మాదాపూర్ డివిజన్ కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు డివిజన్ పరిధి సాయి నగర్ బస్తి, గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ, హిమ దుర్గా టవర్స్, జనప్రియ అపార్ట్మెంట్స్, డాల్ఫిన్ టవర్స్ తదితర ప్రాంతాలలో జిహెచ్ఎంసి ఏఈ ప్రతాప్, జలమండలి విభాగం మేనేజర్ హరి తదితరులతో కలిసి బుధవారం కార్పొరేటర్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఐయాబసీలలో నూతనంగా చేపటాల్సిన అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ముందుకు సాగుతోందని, తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని జగదీశ్వర్ గౌడ్, కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలింగ్ యాదగిరి గౌడ్, కనకమామిడి నరేంద్ర గౌడ్, సుదర్శన్, సంజు సాగర్, ముజీబ్, కామోజీ, లాలూ పటేల్, హమీద్, కాసిం, కృష్ణ, పాషా, మల్లేష్, సంతోష్, విల్సన్, శివప్ప తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి నోచుకోని కొమ్మనపెంట

- గత మూడేళ్లుగా ఐటీడీఏ ద్వారా ఎలాంటి సహకారం లేదు
- ఓట్ల కోసం వచ్చిన నేతలు..అనంతరం పట్టించుకోరు

**నియోజకవర్గ పరిధిలోని అమ్రాబాద్ మండలం నల్లమల్ల లోతట్టు ప్రాంతంలోని అమ్రాబాద్ ఆమ్లెట్ విలేజ్‌గా ఉన్న కొమ్మనపెంట ఆదివాసి గూడెం ఉంది. ఈ గూడెంలో 34 కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నాయి. గత మూడేళ్ల నుండి ఐటీడీఏ ద్వారా ఎలాంటి సహకారం ఆగుడం ఆదివాసులకు అందడం లేదు.**





**అచ్చంపేట, జూన్ 18 (జనం సాక్షి)**

ప్రభుత్వ పథకాలు అంతంత మాత్రమే.. వ్యవసాయం చేయాలని ఆసక్తి ఉన్నప్పటికీ కావలసిన కాడెద్దులు లేకపోవడం అందుకు ఐటిడిఏ ఆదివాసీల అభివృద్ధి కోసం దీర్ఘకాలిక ప్రణాళికలు చేయడంలో అలసత్వం చేయడం వెరసి ఆ పెంట ఇప్పటికీ అందమైన అడవి తల్లి ఒడిలో బొడ్డు గుడిసెలల్లో ఉంటూ అడవిలో కాస్తగా లభించే అటవీ పలసాయాలను సేకరిస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. మిగతా ఆదివాసి గుడాలల్లో ఆర్డిటి స్వచ్ఛంద సంస్థ ద్వారా లేదా ఐటీడీఏ ద్వారా పక్కా గృహాలు నిర్మించారు. ప్రభుత్వ వైద్య సదుపాయాలు, ఐదు సంవత్సరాల లోపు చిన్న పిల్లలకు అంగన్ వాడి ఫుడ్డు ఆ పెంట వారికి ఏడాదికి ఒక్కసారి కూడా సేవలు అందవు, కానీ కొమ్మనపెంటలో అటవీ శాఖ అధికారుల ఆటంకాల లేక ఏమైనా కారణాల వారికి మాత్రం పక్కా గృహాలు నిర్మించడంలో ఐటిడిఏ అధికార యంత్రాంగం ఇతర అధికారులు పూర్తిగా విఫలం చెందారని విమర్శలు ఉన్నాయి. ఆ గూడెం లో ఉన్న 70 సం.ల ఉడతల లింగయ్యకు ఇంతవరకు పెన్షన్ లేదు. పది రెషన్ కార్డులు లేవు, సోలార్ బోర్ మోటార్ దిక్కు.. అది పనిచేయకపోతే ఆ గూడెం నుండి సుమారు 1.5 కీ మీ దూరం బండల రేవు వద్దకు వెళ్ళాలి. గడిచిన మూడేళ్లగా ఐటీడీఏ నుండి ఎలాంటి సాయం అందడం లేదని ఆ పెంటవాసులు వాపోతు... ఇక్కడ నుండి వెళతామని ఎప్పుడూ కూడా అటవీశాఖ అధికారులకు అంగీకారం తెలుపలేదని గూడెం వాసులు ముక్తకంఠంతో తెలుపుతున్నారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి మాచారం గ్రామంలో గత నెల 19న "సౌర జల వికాస పథకం ను" ప్రారంభించారు. ఆ పథకాన్ని మా వ్యవసాయ భూములలో అమలు చేయాలని కోరారు.

### గొంతమ్మ కోరికలు కాదు...

ప్రభుత్వం ఆదివాసీల అభివృద్ధి కోసం ఏవైతే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారో.. ఆ పథకాలు మాకు వర్తింప చేయాలని ఆ గూడెం ఆదివాసీలు కోరుతున్నారు. మా సమస్యలు బయట సమాజానికి, అధికార యంత్రంగానికి తెలియాలంటే మీడియా ద్వారానే సాధ్యమవుతుందని గమనించిన ఆదివాసీలు అక్కడ సిగ్నల్ లేకపోయినా.. గుడానికి కొద్ది దూరములో ఒక చెట్టునెక్కి మంగ్లీ గోపి వ్యక్తి జనం సాక్షికి ఫోను చేసి తెలిపారు. ఉండడానికి పక్కా ఇందిరమ్మ నివాసం, రోడ్డు సౌకర్యం, వైద్య సదుపాయాలు, వ్యవసాయం చేసుకోవడానికి కాడెద్దులు, పోడు భూములకు అటవీ హక్కు పత్రాలు కల్పించాలని కోరుతున్నారు.

### దారి పూర్తిగా అధ్వానం ఆపద వస్తే అంతే..

శ్రీశైలం జాతీయ రహదారి కొల్లంపెంట బేస్ క్యాంపు నుండి అటవీ శాఖ అధికారులు ఆ పెంటావరకు రహదారి కాస్త మరమ్మతులు చేశారు.. కొమ్మనపెంటవరకు రోడ్డు మార్గం మరమ్మత్తులు చేయాలని ఆ గూడెం వాసులు అటవీశాఖ అధికారులకు వేడుకున్న నిధులు లేవు అని వదిలేశారన్నారు. దాదాపు 6 కిలోమీటర్ల దూరం కష్టంగా ప్రయాణం చేయాల్సి ఉంటుంది. వర్షాకాలంలో ఆ రహదారి మరింత అధ్వానం మార్గమధ్యలో మూతుల వాగు, మషమ్మ మడుగు వద్ద వాగు పెద్ద మొత్తంలో పారుతుంది. ఈ క్రమంలో కొమ్మనపెంట ఆదివాసీలకు ఏదైనా అనారోగ్య సమస్య, ఆపద వస్తే ఎటు వెళ్లడానికి అవకాశం ఉండదు.. అంతే సంగతులు.. ప్రాణాలు గాల్లో కలవాల్సిందే నని ఆదివాసీలు వాపోతున్నారు.


### ఓట్ల అప్పుడు నేతలు వస్తారు..ఆ తర్వాత మరుస్తారు...



ఓట్ల సమయంలో నాయకులు ఎంత ఇబ్బంది అయినా కూడా పెద్ద పెద్ద కార్లు వేసుకొని మా వద్దకు వస్తారు అది చేస్తాం అని మీకు ఆపద వస్తే ఈ నెంబర్లకు ఫోన్ చేయాలని ఇచ్చి పోతారు.. ఓట్లు అయిపోయినంక ఆ తర్వాత మమ్ములను మా బాధలను పట్టించుకునే వారు ఉండరు మా బ్రతుకు ఇక్కడే మాకు ఇక్కడే ఇందిరమ్మ ఇల్లు కట్టించాలి, ఆర్‌డిటి సంస్థ లేకపోతే మా ఆరోగ్యాలకు ఆ దేవుడే దిక్కు.

**చిగుర్ల నాగమ్మ**

### ప్రభుత్వ వైద్యులు ఈ పెంట వైపు కన్నెత్తి చూడరు..



ప్రభుత్వ వైద్యులు ఏనాడు ఈ పెంట వైపు కన్నెత్తి చూడరు. ఆర్డిటి అపోలో వైద్యులు వచ్చి చూసి పోతుంటారని, ప్రభుత్వ వైద్యులు ఏడాదికి ఒక్కసారి వచ్చిన గోలి మందులు ఇచ్చి పోతారు సూది మందు ఇవ్వరని, గత ప్రభుత్వంలో వైద్యులు వచ్చి పోయారు. ఆరుగురికి మాత్రమే ఆరువై ఎఫ్ ఆర్ భూమి హక్కు పత్రాలు ఉన్నాయని మిగతా వారికి కూడా అటవీ శాఖ వారు ఇస్తానని ఇవ్వలేదు. జ్వరంతో బాధపడుతూ నెల క్రితం లింగమ్మ (50)అనే మహిళ చనిపోయింది.

**ఉడతల వెంకటయ్య**

### 31 గృహాలు మంజూరు

కొమ్మనపెంట ఆదివాసి గిరిజనులకు ఏమైనా పక్కా గృహాలు మంజూరు చేశారా అని సీనియర్ అధికారి జాఫర్‌ను జనం సాక్షి వివరణ కోరగా ఆయన మాట్లాడుతూ.. సి సి డి పి ద్వారా పై పెంటకు 31 గృహాలు మంజూరు అయ్యాయని, గతంలో వారు రీ లోకేషన్ కోసం సానుకూలత తెలపడం వలన నిర్మాణాలను చేపట్టలేక పోయామన్నారు.

**ఐటీడీఏ అధికారి జాఫర్**

# ప్రజా సమస్యల పరిష్కారమే సీపీఎం పార్టీ ధ్యేయం

- సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి రాములు



**జడ్చర్ల, జూన్ 18 (జనం సాక్షి) :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ప్రజల పక్షాన పోరాడేది సిపిఎం పార్టీ అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ. రాములు అన్నారు. జడ్చర్ల అంబేద్కర్ కళాభవన్ లో బుధవారం నిర్వహించిన సిపిఎం పార్టీ శిక్షణ తరగతుల కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాములు హాజరై మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పక్కకు నెట్టేసి కార్పొరేట్ శక్తులకు, పెట్టుబడిదారులకు దేశ సంపదను దోచుపెడుతూ కార్మికుల, కర్షకుల, వ్యవసాయ కూలీల సమస్యలను పరిష్కరించడం లేదని, పెట్టు బడిదారులకు అనుకూలంగా చట్టాలను మారుస్తూ పేద ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ముందుగా సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాశక్తి పత్రిక సంపాదకులు మోటూరి హనుమంత రావు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు నల్లవెల్లి కురుమూర్తి, జిల్లా కమిటీ సభ్యులు దీప్లా నాయక్, పి. జగన్, శాఖ కార్యదర్శులు భీమ్లా నాయక్, చందర్, నర్సింహా, ఈర్లపల్లి యాదయ్య, బైండ్ల శ్రీశైలం, లక్ష్మీదేవి, రామ చంద్రయ్య, చెన్నయ్య, యాదమ్మ జంగమ్మ, సంధ్యారాణి, పుష్ప, నరసమ్మ, నర్సింలు, పరశురాం, సాయిలు, భీమయ్య, జయ రాములు, నందిని తదితరులు పాల్గొన్నారు.

# వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు తప్పకుండా పాటించాలి



**మక్తల్, జూన్ 18 (జనంసాక్షి) :** మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనదారులు తప్పకుండా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, లేనియెడల చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి హెచ్చరించారు. బుధవారం రోజు మక్తల్ లోని 167 జాతీయ ప్రధాన రహదారి పై పోలీసులు ముమ్మరంగా వాహనాలు తనిఖీలు నిర్వహించి వాహనదారులు పెండింగ్లో ఉన్న ఈ- ఛాలన్స్ కట్టాలని తెలిపారు. అలాగే వాహనాలకు సరైన పత్రాలు హెల్మెట్ సీట్ బెల్ట్ ధరించని వారిపై 18 కేసులు నమోదు చేసి 7545/- రూపాయల జరిమానా విధించడం జరిగిందని ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి మాట్లాడుతూ మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనదారులు తప్పకుండా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని కోరారు. లేనియెడల చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించి సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. వాహనదారులు ప్రయాణించేటప్పుడు మితిమీరిన వేగంతో వాహనాలు నడపరాదని అన్నారు. లేనియెడల వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. మక్తల్ మండల కేంద్రంలో బస్టాండ్, బ్యాంకుల వద్ద, %ూవీ% ల దగ్గర, ప్రధాన చౌరస్తాలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. అనుమానిత వ్యక్తులను ఫింగర్ ప్రింట్స్ డివైస్ తో తనిఖీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. దొంగతనాల నివారణకు నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని, సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని అన్నారు. మక్తల్ లో ఎవరికైనా అనుమానాస్పదంగా ఎవరైనా తిరుగుతున్న, కనిపించిన అట్టి వ్యక్తుల సమాచారం లోకల్ పోలీసులకు లేదా డయల్ 100 కు సమాచారం ఇవ్వాలని, ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచి అట్టి వ్యక్తులపై చర్యలు తీసుకుంటమని ఎస్ఐ తెలిపారు.

# మానవత్వం చాటుకున్న గ్రామస్తులు

- చనిపోయిన నిరుపేద కుటుంబానికి రూ.35 వేల ఆర్థిక సాయం



**నంగునూరు, జూన్ 18 (జనం సాక్షి) :** చనిపోయిన నిరుపేద కుటుంబానికి గ్రామస్తులంతా అండగా నిలిచారు. తలా కొంత పోగేసి కుటుంబానికి ఆర్థిక సహాయం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. గ్రామస్తుల సాయం నిరుపేద కుటుంబానికి భరోసానిచ్చింది. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం మగ్దుంపూర్ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన పేర్న రాజు అనారోగ్యంతో బుధవారం మరణించారు. దీంతో గ్రామస్థులు చందాలు వేసుకుని రాజు కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. గ్రామస్థులు తోచినంత ఆర్థిక సహాయం అందించడంతో జమ అయిన డబ్బుల నుంచి రూ.35,000 ల నగదును, ఒక క్వింటాలు బియ్యాన్ని రాజు కుటుంబ సభ్యులకు అందించారు.

### హరీశ్‌రావు రూ.5 వేల ఆర్థిక సాయం

మగ్దుంపూర్ గ్రామానికి చెందిన పేర్న రాజు అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. గ్రామ బీఆర్ఎస్ నాయకుల ద్వారా విషయాన్ని తెలుసుకున్న హరీశ్ రావు తక్షణ ఆర్థిక సహాయం కింద రూ.5 వేలు పంపించారు. ఈ డబ్బులను బుధవారం గ్రామ బీఆర్ఎస్ నాయకులు గ్రామ పెద్దల సమక్షంలో పేర్న రాజు కుటుంబ సభ్యులకు అందించారు.

# సమీకృత కలెక్టరేట్ భవనం త్వరలో పూర్తి చేయాలి

- కలెక్టర్ పట్నాయక్



**నారాయణపేట జిల్లా బ్యూరో, జూన్ 18 (జనం సాక్షి) :** నారాయణపేట సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయం పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. బుధవారం సింగారం దగ్గర నిర్మిస్తున్న ఐడిఓసి (సమీకృ త జిల్లా కలెక్టర్ కార్యాల యం)పనులను జిల్లా కలెక్టర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వివిధ గదులు, వాటిలో కొనసాగుతున్న పనులు ఎప్పటిలో గాపూర్తవుతాయని అధికారులను అడిగి తెలుసు కున్నారు. పనులలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



**జడ్చర్ల, జూన్ 18 (జనం సాక్షి) :** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జడ్చర్ల మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత అన్నారు. ఒక మార్పు అభివృద్ధికి మలుపు అనే నినాదంతో నిర్వహిస్తున్న 100 రోజుల ప్రణాళికలో భాగంగా బుధవారం 24వ వార్డు పద్మావతి కాలనీ, రంగారావు తోట పరిసర ప్రాంతాలలో తడి, పొడి చెత్త, ప్లాస్టిక్ నిషేధం పైన అవగాహన ర్యాలీ నిర్వహించారు. అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న చైర్ పర్సన్ పుష్పలత మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు అందరూ సహకరించాలని, వర్షాకాల నేపథ్యంలో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకొని, తడి పొడి చెత్తను వేరు చేసి చెత్త బండ్లకు అందజేయాలని, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని సూచించారు. వార్డు కౌన్సిలర్ కోట్ల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ ఒక మార్పు అభివృద్ధికి మలుపు అనే చక్కటి కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించడం సంతోషకర విషయమని, అయితే మన పరిసరాలను మనం శుభ్రంగా ఉంచుకోవడం 100 రోజుల ప్రణాళికలో భాగం కాదని, మన వార్డులో ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగాలని, వార్డు ప్రజలు తమ వంతు బాధ్యతగా పర్యావరణ పరిశుభ్రత కార్యక్రమానికి సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, వార్డు ఆఫీసర్ రమేష్, ఆర్.పి.లు, సాహితీ రెడ్డి, మహిళా సంఘాల సభ్యులు, కాలనీవాసులు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

- నాగర్‌కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ కూచు కూల రాజేష్ రెడ్డి



**బిజినేపల్లి, జూన్ 18 (జనం సాక్షి) :** పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ద్వేయమని నాగర్ కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ కూచుకుల రాజేష్ రెడ్డి అన్నారు బుధవారం మండల పరిధిలోని బిజినేపల్లి తండా, ఎర్రగుంట్ల తాండ, రావుల చెరువు తండా, లట్టుపల్లి, చిన్న పీరు తాండ, డాకుతాండ, బోయాపూర్ గ్రామాలలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే కూచుకుల రాజేష్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం 10 సంవత్సరాల పాటు తెలంగాణ రాష్ట్రాన్ని పాలించి డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టించి ఇస్తామని మాట చెప్పి మభ్యపెట్టి ప్రజలను మోసం చేశారని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిరుపేదలను ఆదుకొని అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వంతో అందించే సంక్షేమ పథకాలను అందిస్తుందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసుకుంటూ ముందుకు సాగుతున్నామన్నారు. రాబోయే రోజులలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేసుకుంటూ ముందుకు సాగుతామని ఆయన అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు రాణి పేదలు ఎవరైతే ఉన్నారో వారు ఎవరు కూడా అధైర్యపడవద్దని రెండో విడతలో అందరికీ ఇండ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ విషయంలో అధికారులు ఎవరైనా అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కథలప్ప, హౌసింగ్ ఏఈ అంజలి, మండల అధ్యక్షులు మిద్దె రాములు, అమృత్ రెడ్డి, సేవాదళ్ మండల అధ్యక్షులు సైదులు, వెంకటస్వామి, గోవింద నాయక్, చంద్ర గౌడ్, బంగారి పర్వతాలు, తిరుపతయ్య, నజీర్, పండ్ల పాషా, ప్రేమ్ లాల, శ్రీనివాస్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, మిద్దె సూరి, ఈశ్వర్, ప్రవీణ్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, చందూలాల్, ఆనంద్, పరుశురాములు, శ్రీనివాస్ గౌడ్, ఖలీల్ తదితరులు ఉన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

- ప్రభుత్వ పథకాల డొల్లతనాన్ని ప్రజల ముందుంచాలి
- నమ్మకద్రోహులకు పార్టీలో స్థానం లేదు
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



**వనపర్తి, జూన్ 18 (జనంసాక్షి) :** స్థానిక సంస్థలైన గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలతో పాటు మండల, జిల్లా పరిషత్ లకు ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు మాజీ వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పిలుపునిచ్చారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని మంత్రి నివాసంలో బుధవారం పెబ్బేరు,శ్రీరంగాపూర్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి బీఆర్ఎస్ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని, కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత విధానాల పట్ల అప్రమత్తంగా ఉండి ప్రజలకు వివరించాలని శ్రేణులను ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వ్యవహరించాల్సిన వ్యూహాత్మక విధానాలను వివరించారు.గ్రామ నాయకులను పలకరిస్తూ ప్రస్తుత పరిస్థితుల అడిగి తెలుసుకొని అనుసరించాల్సిన వ్యూహాలను వివరించారు. కార్యకర్తలను ఎన్నికల కోసం కార్యోన్ముఖులను చేయాలని మండల నాయకులను ఆదేశించారు. ఐకమత్యంగా ఉండి పార్టీ విజయానికి కృషిచేయాలని అన్నారు. ఈ సమావేశములో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్,మండల అధ్యక్షులు వనం రాములు,వెంకటస్వామి, కర్రెస్వామి, రంగాపురం కృష్ణారెడ్డి, పెద్దింటి వెంకటేష్, దిలీప్ రెడ్డి,జగన్నాథం నాయుడు, పృథ్వీనాథ్, ఎం.రాజశేఖర్, మాధవ్ రెడ్డి, సత్యారెడ్డి, ఎల్లారెడ్డి, యాపర్ల ఆనంద్, వడ్డే ఈశ్వర్, గోవిందు నాయుడు, వడ్డే.రమేష్, పరమేశ్ నాయి, చిట్యాల రాము, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# భూసమస్యల పరిష్కారం కోసం భూభారతి చట్టం

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల ప్రతినిధి జూన్ 18 (జనంసాక్షి) :** భూసమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి నూతన ఆర్.ఓ.ఆర్. చట్టంలో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల ద్వారా భూసమస్యలపై అందిన దరఖాస్తులను పరిష్కరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని లక్షెట్టిపేట మండల కేంద్రంలోని ఉత్కూర్ చౌరస్తాలోని ప్రభుత్వ భవనంలో తహశిల్దార్ దిలీప్ కుమార్ తో కలిసి, వెంకట్రావుపేట గ్రామంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులను సందర్శించి దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... భూభారతి నూతన ఆర్.ఓ.ఆర్. చట్టంలో భాగంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూసమస్యలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ దరఖాస్తులను రికార్డులతో సరి చూసి, క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే దిశగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు జిల్లాలోని అన్ని మండలాలలో (పైలెట్ మండలం అయిన భీమారం మినహా) కార్యచరణ ప్రకారం రెవెన్యూ సదస్సులు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. నూతన చట్టంలో రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం కల్పించడం జరిగిందని, రిజిస్ట్రేషన్, ముటేషన్ చేసేందుకు ముందు భూముల వివరాలు పూర్తి స్థాయిలో సర్వే చేసి, మ్యాప్ తయారు చేయడం జరుగుతుందని, పెండింగ్ సాదా బైనామా దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిష్కరించడం జరుగుతుందని, వారసత్వంగా వచ్చిన భూములకు విరాసత్ చేసే ముందు నిర్ణీత కాలంలో సమగ్ర విచారణ చేయడం, సంబంధిత వారసులకు నోటీసులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తుతో పాటు రిజిస్టర్డ్ దస్తావేజులు, రెవెన్యూ



రికార్డులు జతపరిచినట్లయితే త్వరగా పరిష్కరించేందుకు అవకాశం ఉ ంటుందని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూరిభా గాంధీ బాలికల ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యార్థినీ, విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందించే పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, వర్క్ పుస్తకాలు, ఏకరూప దుస్తులను పంపిణీ చేయాలని తెలిపారు. పాఠశాలలో తరగతి గదులు, వంట శాల, పరిసరాలలో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బంధీగా చేపట్టాలని, విద్యార్థులకు శుద్ధమైన త్రాగునీటితో పాటు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలని తెలిపారు. ఎంతో మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలలో చేరుతున్నారని, ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్యను పెంపొందించాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని, వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

**ములుగు ప్రతినిధి, జూన్ 18(జనంసాక్షి) :** ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసుకునేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గృహ నిర్మాణ సంస్థ, ఇంజనీరింగ్ అధికారులు, 10 మండలాల అధికారులు, ఏపిఎం లు, పంచాయితీ సెక్రటరీల తో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులపై జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు తో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు ఎలా జరుగుతున్నాయని గ్రామాల వారిగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, మొదటి విడతలో చేపట్టిన ఇండ్లను అన్ని గ్రౌండ్ అయ్యేలా చూడాలని, నిర్మాణ పనులలలో వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్ లైన్ యాప్ లో నమోదు చేస్తూ లబ్ధిదారులకు ప్రభుత్వ సహాయం వెంటనే అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. నిర్మాణ దశలను బట్టి దశల వారీగా లబ్దిదారులకు వారి ఖాతాలోనే నేరుగా డబ్బులను జమ చేయడం జరుగుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇండ్ల నిర్మాణాలకు విడతల వారిగా 5 లక్షల రూపాయలను అందిస్తుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పేరుతో ఇసుక అక్రమ రవాణా నిర్మూలించేందుకు టోకెన్ పద్ధతిని ప్రవేశపెట్టాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితాతో టోకెన్ల జారీ విధానంపై ప్రణాళిక రూపొందించాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ళను మ్యాపింగ్ చేయాలని సూచించారు. లబ్ధిదారుని గృహ నిర్మాణ అవసరాన్ని బట్టి టోకెన్లు జారీ చేయాలని తెలిపారు. గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శి, ఏఈలు ఇసుక టోకెన్ల జారీని చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ సంస్థ, ఇంజనీరింగ్ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, మండల అధికారులు, ఏపిఎం లు, సిసిలు, పంచాయతీ కార్యదర్శిలు, తదితరులు పాల్గొన్నారు.



## మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వివేక్ వెంకటస్వామి

**చెన్నూర్, జూన్ 18 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీలు, మైనింగ్, జియాలజీ శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఎమ్మెల్యే డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో కుటుంబ సమేతంగా మినిస్టర్ ఛాంబర్‌లో పూజలు నిర్వహించి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పెద్దపల్లి ఎంపీ వంశీ కృష్ణ, బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి, నియోజకవర్గం నుండి పలువురు కాంగ్రెస్ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఆర్థిక శుభాకాంక్షలు తెలిపారు.

## తమ్ముడు కంగ్రాట్స్



**బెల్లంపల్లి, జూన్ 18 (జనంసాక్షి) :** బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ బుధవారం సచివాలయంలో సోదరుడు చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి రాష్ట్ర భూగర్భ గనులు, కార్మిక, ఉపాధి కల్పనా, పరిశ్రమల శాఖ మంత్రిగా పదవిబాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కలిసి అభినందనలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందించి, ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. బెల్లంపల్లి నియోజకవర్గాన్ని కూడా చెన్నూర్ నియోజకవర్గంలా భావించి నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

## ముల్కనూరు సహకార సంఘం ఎన్నికలు ఏకగ్రీవం



**భీమదేవరపల్లి, జూన్ 18(జనం సాక్షి):** ముల్కనూరు సహకార సంఘం ప్రధాన కార్యాలయంలో ఎన్నికల నామినేషన్ పత్రాల ఉపసంహరణ ముగిసింది. బుధవారం ముల్కనూరు సహకార గ్రామీణ పరపతి సంఘం ఐదు డైరెక్టర్ స్థానాలకు జరుగుతున్న ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి కోదండరాములు ప్రకటించారు. బుధవారం ముల్కనూర్ సహకార సంఘంలో మొత్తం 15 డైరెక్టర్ స్థానాలు ఉండగా 1, 2, 5, 9, 15 స్థానాలు ఖాళీ అయ్యాయి. ఈ నెల 16వ తేదీన నామినేషన్ల స్వీకరణలో భాగంగా ఒకటో డైరెక్టర్ స్థానంలో అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, దొంగల చిన్న వెంకట్రాజం, రెండో స్థానంలో బొల్లంపల్లి కుమారస్వామి, కడారి ఆదాం, ఐదోస్థానంలో గణవేన శ్రీనివాస్, కూన కనుకయ్య, తొమ్మిదో స్థానంలో గుర్రాల భాస్కర్ రెడ్డి, మార్పాటి జయపాల్ రెడ్డి, బోయినపల్లి రత్నాకర్ రావు, 15లో కాశిరెడ్డి వసంత, కంకల భాగ్య నామినేషన్ దాఖలు చేశారు.

## భారీ వర్షాలు,వరదలపై అప్రమత్తంగా ఉండాలి

- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ రూరల్, జూన్ 18 (జనం సాక్షి) :** జిల్లాలో వర్షాలు,వరదలవలన ప్రజలు ప్రాణాలు,ఆస్తులు కోల్పోకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆమె ఫ్లడ్ మాన్యువల్ పై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,విపత్తుల నిర్వహణ కేవలం స్పందనకే పరిమితం కాకుండా ప్రమాద నివారణ తీవ్రత తగ్గింపు,పునరావాసం, పునర్నిర్మాణం దశల్లో ముందస్తుగా ప్రణాళికలు ఉండాలని సూచించారు. వర్షాకాలానికి ముందు నదులు, వాగులు, కుంటలలో నీటి ప్రవాహ మార్గాలను శు భ్రం చేయాలని,పట్టణాల్లో డ్రైనేజీ వ్యవస్థను పర్యవేక్షించాలని,పాడైన రహదారులను తక్షణమే మరమ్మతు చేయాలని సూచించారు. రిజర్వాయర్ల గేట్ల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కడెం, స్వర్ణ, గడ్డెన్న ప్రాజెక్టులు,గోదావరి పరివాహక గ్రామాల్లో నివసించే ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలనీ సూచించారు. నీటిపారుదల శాఖ అధికారులు ప్రాజెక్టుల నీటిమట్టాలను నిరంతరం గమనిస్తూ దిగువ గ్రామాలకు సమాచారం అందించాలని,కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలనీ చెప్పారు.అలాగే మత్స్యకారులు,విద్యుత్ శాఖ,మీడియాకు సమగ్ర సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రమాదకర ప్రాంతాల్లో ఉన్న బ్రిడ్జిలు, రహదారులను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ వైద్యులు,సిబ్బంది స్థానికంగా అందుబాటులో ఉండాలని అన్నారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పశువులను భారీ వర్షాల సమయంలో మేతకు తీసుకెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.రెవెన్యూ, పోలీస్,ఫైర్,విద్యుత్ శాఖలు అప్రమత్తంగా ఉండాలని,ప్రజలకు ముందస్తుగా హెచ్చరికలు ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు.అనంతరం మండలాల వారీగా వరద ప్రభావిత ప్రాంతాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్,ఏఎస్పీ ఉపేంద్ర రెడ్డి,ఆర్డీఓ రత్నాకల్యాణి,రెవెన్యూ, విద్యుత్, ఫైర్, ఇంజనీరింగ్ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్‌లో మొదటిసారిగా అభయ మై టాక్సీ ఇస్ సేఫ్ కార్యక్రమం

- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్




**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** ప్రయాణికుల భద్రత రక్షణ ధ్యేయంగా ఆదిలాబాద్ జిల్లాలో మొట్టమొదటిసారిగా ప్రజల రవాణా కు అతిముఖ్యంగా ఉండే ఆటోలలో అభయ మై టాక్సీ ఇస్ సేఫ్ అనే కార్యక్రమాన్ని జిల్లాలో లాంచనంగా ఈరోజు స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఉట్నూర్ ఎఎస్పి కాజల్ సింగ్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ రానున్నది విద్యా సంవత్సరం ప్రారంభం కావున యువతులు మహిళలు ప్రయాణికులు భద్రత చర్యలలో భాగంగా జిల్లాలోని ఇప్పటివరకు 3232 ఆటోలలో అభయ మై టాక్సీ ఇస్ సేఫ్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకొని ఆటోలలో ముందు భాగంలో, వెనుక భాగములో క్యూఆర్ కోడ్, జిల్లా ప్రత్యేక నంబరు కలిగిన పోస్టర్ అతికించబడి మరియు లోపలి భాగంలో ఆటో డ్రైవర్ వివరాలు, క్యూఆర్ కోడ్ మరియు ఆదిలాబాద్ ఆటో రిజిస్ట్రేషన్ నెంబర్ కనబడే విధంగా తగు పోస్టర్లను శాశ్వతంగా అతికించడం జరుగుతుంది. దీని ద్వారా ప్రయాణికులు ఎక్కిన వెంటనే క్యూఆర్ కోడ్ కనబడుతుంది దానిని స్కాన్ చేసిన తర్వాత, ప్రయాణికులకు ఒక వెబ్ అప్లికేషన్ లోకి వెళ్తుంది అందులో మొబైల్ నంబర్ ఎంటర్ చేసిన తర్వాత, వారికి మూడు భద్రత ఆప్షన్లు కనబడతాయి అవి మహిళలు ఎలాంటి అత్యవసర సమయంలోనైనా ట్రాక్ మై లొకేషన్ అనే ఆప్షన్స్ ఎంచుకున్నట్లయితే కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా అనుసంధానం చేయబడి ఉన్నందున కమాండ్ కంట్రోల్ సెంటర్ నుండి మీకు వెంటనే ఫోన్ ద్వారా సమాచారం తెలుసుకుంటారని, మీ ఫోన్ను ట్రాక్ చేయడం జరుగుతుందని తెలిపారు. రెండవ ఆప్షన్ ఎమర్జెన్సీ కాల్ ఆప్షన్ ఎంచుకున్న తర్వాత వెంటనే డయల్ 100 నుండి మీకు ఫోన్ కాల్ వస్తుందని తెలిపారు. మూడవ ఆప్షన్ ఎంచుకున్న తర్వాత మీకు ఎలాంటి ఫిర్యాదు నైనా సమర్పించవచ్చని తెలిపారు. ఎలాంటి ఫిర్యాదులు లేకుండా సక్రమంగా గమ్యస్థాలన చేరుతున్న ప్రయాణికులు ఆటోలకు రేటింగ్ కల్పించవచ్చని తెలిపారు. ఆటోలు, టాక్సీలు దొంగతనానికి గురైనప్పుడు వెంటనే సీసీటీవీ కెమెరాల ఆధారంగా కనుక్కునే సౌలభ్యం పోలీస్ యంత్రాంగానికి ఉంటుందని తెలిపారు. నేరాల నియంత్రణకు, నేరాల అదుపునకు ప్రతి ఒక్కరూ అభయ మై టాక్సీ ఇస్ సేఫ్ అనే కార్యక్రమంలో పాల్గొనాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉట్నూర్ ఎఎస్పి కాజల్ సింగ్ ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రణయ్ కుమార్, పట్టణ ఇన్స్పెక్టర్లు బి సునీల్ కుమార్, సిహెచ్ కరుణాకర్ రావు, ఎస్ఐలు ముజాహిద్, అశోక్, మహేందర్, దేవేందర్, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యతోనే గౌరవం



- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద...
- మధ్యాహ్న భోజన నాణ్యత పరిశీలన.
- బడిబాటలో విద్యార్థుల నమోదు పరిశీలన..

**వరంగల్ ప్రతినిధి, జూన్ 18(జనంసాక్షి):** తల్లితండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా బడికి పంపించాలని, విద్యతోనే గౌరవం సాధ్యమని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. బుధవారం ఖిలా వరంగల్ మండలంలోని కరీమాబాద్, మధ్య కోటలలో గల ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను కలెక్టర్ సందర్శించారు. హాజరు పట్టికలు, రిజిస్టర్లు, తరగతి గదులను పరిశీలించారు. కరీమాబాద్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమానికి కలెక్టర్ హాజరై చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు ఖిలా వరంగల్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 800 మంది చిన్నారులను చేర్పించామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో మమేకమై వారి సమస్యలు తెలుసుకోవడంతో పాటు వారి చదువు సామర్థ్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను స్వయంగా పరిశీలించిన కలెక్టర్ మధ్యాహ్న భోజన పథకం స్కూళ్లలో మెనూ ప్రకారం ఇస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అందిస్తున్న మధ్యాహ్న భోజనం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యార్థులకు గుణాత్మక విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్న సౌకర్యాలు వినియోగించుకుని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలన్నారు. నూతన మెను ప్రకారం పిల్లలకు పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో బోధిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ఉచితంగా బుక్స్ నోట్ బుక్స్ యూనిఫార్మ్ ఇస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్ మరుపల్లి రవి, బైరబోయిన ఉమా దామోదర్ యాదవ్, డి ఈ ఓ జ్ఞానేశ్వర్, ఎంఈఓ ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ బల్దియా కమిషనర్ ఆకస్మిక పర్యటనలు

**వరంగల్ ఎంజీఎం, జూన్ 18 (జనంసాక్షి):** నగర పరిధి లోని పలు ప్రాంతాల్లో బుధవారం బల్దియా కమిషనర్ ఛాహత్ బాజ్ పాయ్ క్షేత్ర స్థాయి లో పర్యటించారు.ఈ సందర్భం గా హసన్ పర్తి సమీపం లో గల జంతువుల శస్త్ర చికిత్స కేంద్రాన్ని (ఏ బి సి)తిరుమల జంక్షన్ ప్రాంతంలో గల నాలా స్మార్ట్ సిటీ పనుల పురోగతి తో పాటు బాలసముద్రం ప్రాంతంలో బల్దియా నిర్వహిస్తున రెండు నర్సరీలను కమిషనర్ బుధవారం క్షేత్రస్థాయిలో సందర్శించి నిర్వహణ తీరును అధికారులను అడిగి తెలుసుకుని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు.ఏబిసి కేంద్రం లో పర్యటించి కుక్కలకు నిర్వహించే శస్త్ర చికిత్సల తీరు ను డాక్టర్లను అడిగి తెలుసుకుని ప్రతి రోజు ఎన్ని కుక్కలకు చికిత్సలు ఇస్తారు అడిగి తెలుసుకున్నారు.గోకుల్ నగర్ ప్రాంతంలో



పర్యటించి రోడ్డు డ్రైన్ ను, రాజాజీ నగర్ ప్రాంతం లో రిటైనింగ్ వాల్ పనులను పరిశీలించారు. పైడిపల్లి మడికొండ ప్రాంతాలలో నిర్మించిన రెండు రోడ్ ల బిల్లుల చెల్లింపుకై నిర్మిత రోడ్ లను కమిషనర్ పరిశీలించి కొలతలు వేసి వాస్తవికతను నిర్ధారించుకున్నారు.బల్దియా హన్మకొండ లోని బాల సముద్రం లో నిర్వహిస్తున్న రెండు నర్సరీ లను పరిశీలించిన కమిషనర్ మాట్లాడుతూ వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా హోమ్ స్టేట్ మొక్కల పంపిణీ లో భాగం గా ప్రతి ఇంటికి పూల మొక్కలను అందజేయాల్సి ఉంటుందని అన్నారు. పొడవైన మొక్కలను ప్లాంటేషన్ కోసం వినియోగించాలని పట్టణంలోని ప్రధాన రోడ్ ప్రాంతాల్లో ఉన్న మీడియన్స్ పై దృష్టి సారించి ఉంచాలని ఈ సందర్భంగా కమిషనర్ అన్నారు. కార్యక్రమంలో ఇంచార్జి ఎస్ ఈ శ్రీనివాస్ వెటర్నరీ వైద్యులు డా. గోపాల్ రావు, హెచ్ ఓ రమేష్, ఏం హెచ్ ఓ డా. రాజేష్, ఈ ఈ రవికుమార్, సంతోష్ బాబు, మాధవి లత స్మార్ట్ సిటీ పి ఎం సి ఆనంద్, ఓలేటి డిఈ లు ఏఈ లు తదితరులు పాల్గొన్నారు.


## చెరువులోకి ఈతకు వెళ్లిన బాలిక మృతి



**గంగారం, జూన్ 18 (జనంసాక్షి) :** మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం కాటినగరం గ్రామానికి చెందిన మూతి యశోద భర్త నరేష్ లకు ఇద్దరూ కవుల పిల్లలు కుమారుడు శ్రావణ్ కుమారి శ్రావణి లు ఉన్నారు. బుధవారం ఉదయం కుమారి శ్రావణి తన స్నేహితులతో కలిసి పక్కనే ఉన్న కోమట్ల గూడెం చెరువులోకి ఈతకు వెళ్లారు. ఈతకు వెళ్లిన స్నేహితుల తల్లి వద్దని పిలవడంతో వారు తిరిగి ఇంటికి వెళ్లారు శ్రావణి(12) ఒక్క అమ్మాయి మాత్రమే చెరువులో ఈత కొడుతూ అక్కడే మునిగిపోయింది. మునిగిపోయిన ఆ అమ్మాయి చేతులు పైకెత్తడంతో అటు వైపు వెళ్లిన వారు గమనించి బయటికి తీయడానికి ప్రయత్నించగా, వారికి సాధ్యపడక పోవడంతో గ్రామంలోకి వెళ్లి ఇంకొందరిని తీసుకొని వెళ్లగా లోతులో మునిగిన అమ్మాయిని బయటికి తీశారు. పరిస్థితి విషమంగా ఉందని నర్సంపేటకు వైద్యం కోసం తరలించగా అక్కడికి వెళ్లేసరికి మరణించిందని బంధువులు తెలిపారు. శ్రావణి గంగారం మండల కేంద్రంలోని గిరిజన బాలికల పాఠశాలలో 8వ తరగతి చదువుతోందని బంధువులు తెలిపారు.

## అతిసార వ్యాధి ప్రబలకుండా అవగాహన

- మహబూబాబాద్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి రాథోడ్



**మహబూబాబాద్ ప్రతినిధి, జూన్ 18 జనం సాక్షి):** స్థానిక పట్టణ ఆరోగ్య కేంద్రం లో ఏర్పాటు చేసిన తల్లుల సమావేశానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా వైద్యాధికారి రవిరాథోడ్ మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో అతిసార వ్యాధి ప్రబలకుండా ఉండేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాల ద్వారా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నామని వారు పేర్కొన్నారు. ప్రజలు పరిశు భ్రమైన తాగునీరు మాత్రమే తాగాలని వేడి వేడి ఆహార పదార్థాలను మాత్రమే భుజించాలని, పిల్లలకు సరియైన శుభ్రత ను పాటించడం వంటివి మలవిసర్జన ఆహారం తీసుకోవడానికి ఇంటిలోని పెంపుడు జంతువులను ముట్టినప్పుడు చేతులను శుభ్ర పరుచుకోవడం ముఖ్యమని తెలిపారు అతిసార లక్షణాలు కనబడిన పక్షంలో తక్షణమే దగ్గరలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలను సంప్రదించి ఉచిత వైద్యం పొందాలని సూచించారు ఓఆర్ఎస్ తో పాటు జింక్ మాత్రలను వినియోగించడం ద్వారా డీహైడ్రేషన్ నుంచి తప్పించుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలలో క్షేత్ర స్థాయి హెల్త్ సిబ్బంది ప్రతీ గడప గడపకు తిరిగి ప్రజలకు సూచనలు అందజేస్తారని జిల్లా ప్రజలు సహకరించి ఆరోగ్య కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

### గూడూరు సిహెచ్‌సిలో అదనపు బెడ్ల రూం ప్రారంభం

గూడూరు మండలంలో ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో సీజనల్ వ్యాధులతో జ్వరం బారిన పడిన రోగుల కోసం ప్రత్యేక గదులను ఏర్పాటు చేసి అదనంగా 15 బెడ్లను మంజూరు చేసి ప్రారంభించిన జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి రాథోడ్ రోగుల బారిన పడకుండా జాగ్రత్త పడి ప్రభుత్వం అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ సుధీర్ రెడ్డి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మీనారాయణ స్థానిక వైద్యాధికారులు డాక్టర్ బానోత్ వీరన్న నాయక్ మౌనిక డాక్టర్ బి. ఎమూనా డిప్యూటీ డెమో కొప్పు ప్రసాద్ హెల్త్ ఎడ్యుకేటర్ కె.వి రాజు హెల్త్ అసిస్టెంట్ వి. సర్దార్ బాబు, యంపియాచ్ ఈఓ శ్రీనివాస్ సీసీ అనిల్ కుమార్ రాజేందర్ సూపర్వైజర్ పుష్పలీల ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆయిల్‌ఫామ్‌తో అధిక లాభాలు

- వరికి ప్రత్యామ్నాయ పంటలపై రైతులు శ్రద్ధ పెట్టాలి
- సమీకృత వ్యవసాయ సాగు పద్ధతిని పరిశీలించిన కలెక్టర్



**సూర్యాపేట ప్రతినిధి, జూన్ 18 (జనంసాక్షి) :** ఆయిల్ పామ్ సాగు చేయటం ద్వారా అత్యధిక లాభాలు పొందవచ్చని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం చివ్వెంల మండలం బి.చందుపట్ల గ్రామంలో మార్కాల వెంకటరెడ్డి ఆయిల్ పామ్ తోటను సందర్శించారు.ఈ సందర్భంగా ఆయిల్ పామ్ సాగు వివరాలను,వారి క్షేత్రంలో ఆయిల్ ఫామ్ తో పాటు మామిడి, కొబ్బరి అన్ని రకాల పండ్లు,నాటు కోళ్ళు, గొర్రెలను సమీకృత పద్ధతిలో సాగు విధానం గురించి రైతు నుండి అడిగి తెలుసుకున్నారు.ఆయిల్ ఫామ్ సాగులో తీసుకోవాలిసిన యాజమాన్యంపై పలు సూచనలు చేశారు.జిల్లాలో ఆయిల్ పామ్ గెలల కోతలు ప్రారంభమైనందున ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగుకై అందిస్తున్న ప్రోత్సాహకాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో నాలుగేండ్ల క్రితం సాగు చేసిన ఆయిల్ ఫామ్ పంట చేతికి వస్తుండటం, గెలల ధర భారీగా పెరగడంతో రైతుల్లో నూతన ఉత్సాహం నెలకొందన్నారు. ఇన్నాళ్లు ఎప్పుడో నాలుగేళ్ళకి వచ్చే పంట కోసం ఇప్పటి నుండే కష్టపడి సాగు చేయాలనుకున్న రైతులు కూడా ఇప్పుడు ఆయిల్ పామ్‌ను సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారని, జిల్లాలో సాగు పెరుగుతున్నదని తెలిపారు.జిల్లాలో ప్రస్తుతం 4885 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు అవుతుందని, ఆయిల్ ఫామ్ పథకంలో పెట్టిన టార్గెట్ లో ఇప్పటి వరకు సుమారు 400 ఎకరాల్లో తాజాగా పంట చేతికి వస్తుండడంతో పంటను చూసిన ఇతర రైతులు ఈ సాగుకు ఆకర్షితులవుతున్నారని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ ఫామ్ సాగును ప్రోత్సహించేందుకు పలు చర్యలు తీసుకుంటుందని అన్నారు.దిగుబడి వచ్చేంత వరకు అంతర పంటల సాగుతో అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు.వరి, పత్తి పంటలతో పోల్చితే రైతులు తక్కువ పెట్టుబడి, తక్కువ శ్రమతో మంచి లాభాలు సాధించే అవకాశం ఉందని పేర్కొన్నారు.దీంతో గత నాలుగేండ్లుగా జిల్లాలో ఆయిల్ పామ్ గణనీయంగా పెరుగుతోందని ,ఈ మొక్కలను ఒకసారి నాటితే 30 ఏండ్ల వరకు దిగుబడి వస్తుందని తెలిపారు.నాటిన నాలుగో యేడు నుంచి పంట చేతికి వస్తుందని,మొదటి నాలుగేండ్ల వరకు ప్రభుత్వమే నిర్వహణ ఖర్చులు భరిస్తున్నదని అన్నారు.మొదటి మూడేండ్లు మొక్కజొన్న, పత్తి, వేరుశనగ లాంటి పంటలను అంతర పంటగా సాగు వేసుకోవచ్చని అన్నారు.నాలుగోయేడు నుంచి పంట ఎకరాకు కనీసం 8 నుంచి 10 టన్నులకు తక్కువ కాకుండా దిగుబడి వస్తుందని ,చెట్టు పెరిగే కొద్దీ మెలకువలు పాటిస్తూ 15 నుంచి 20 టన్నుల వరకు దిగుబడి రాబట్టవచ్చని తెలిపారు.

**ఆయిల్‌ఫామ్‌కు ప్రోత్సాహం..**

వరి ఇతర సంప్రదాయ పంటలకు ప్రత్యామ్నాయంగా రైతులకు లాభాలు తెచ్చిపెట్టే ఆయిల్ ఫామ్ సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని అన్నారు.నూనె వినియోగానికి తగినట్టు పంట లేకపోవడంతో ఏటా దిగుమతి చేసుకోవాల్సి వస్తుంది కాబట్టి ఫలితంగా ఆదాయం కోల్పోవడంతో పాటు అధిక ధరలకు నూనెలను కొనుగోలు చేయాల్సి వస్తుందన్నారు.దీనిని నివారించేందుకు ప్రభుత్వం ఆయిల్ ఫామ్ సాగుకు సబ్సిడీలు, ప్రోత్సాహకాలు అందించేందుకు రాష్ట్రంలో 2020-21 నుంచి ఆయిల్ ఫామ్ మిషన్ కొనసాగుతుందని అన్నారు.రైతులకు రాయితీలు ఇచ్చి సాగును ప్రోత్సహిస్తున్నారని, సాగుచేసే రైతులకు మొదటి నాలుగేండ్లలో అంతర పంటల సాగుకు, కలుపు తీయడానికి, ఇతర నిర్వహణ ఖర్చుల కోసం ప్రభుత్వం ఎకరానికి రూ.4200 ఆర్థిక సాయం చేయటం జరుగుతుందని తెలిపారు.మార్కెట్ లో రూ.193 నుంచి రూ.200 ఉండే ఆయిల్ పామ్ మొక్కలను సబ్సిడీతో రూ.20కే రైతులకు అందిస్తోందని, అలాగే డ్రిప్ సౌకర్యం కల్పించేందుకు యూనిట్ ఖర్చులో ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం, బీసీలకు 90 శాతం, ఇతరులకు 80 శాతం సబ్సిడీగా అందిస్తోందని చెప్పారు. ఒక ఏకరానికి మొత్తం రాయితీ గా రూ.50918 ప్రభుత్వం అందిస్తున్నదని తెలిపారు.తుంగతుర్తి మండలం కేశవపురం గ్రామానికి చెందిన శివారులో తూము వెంకన్న, తూము సత్యనారాయణ 14 ఎకరాల విస్తీర్ణంలో గత మూడు సంవత్సరాల క్రితం ఆయిల్ ఫామ్ సాగు చేయగా మొదటి కోతను 2025 జూన్ 13న కోశారని, పంటను తుంగతుర్తి మండల కేంద్రంలో పతాంజలి ఆయిల్ ఫామ్ కంపెనీ వారు ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రంలో రైతు నేరుగా విక్రయించినట్లు తెలిపారు.మొదటి కోత లోనే పది టన్నులు దిగిబడి రావడంతొ రైతులు సంతోషంగా ఉన్నారని ప్రస్తుతం టన్ను ధర రూ.18748 ఉండగా పది టన్నులకు గాను ఆ రైతుకు రూ.187000 రావడంతో ఆనందంతో ఉన్నట్లు అధికారులు కలెక్టర్ కి వివరించారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సంతోష్ కుమార్, ఉద్యానవన డివిజన్ అధికారిణి స్వాతి, మండల ఉద్యానవన అధికారి మహేష్, వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు , పతంజలి కంపెనీ ప్రతినిధులు, అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# రైతులు బ్యాంకుల ద్వారా రుణాలు పొందేలా చర్యలు తీసుకోవాలి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, జూన్ 18 (జనం సాక్షి) :** రైతులను అధిక వడ్డీ రుణాలు భారీ నుండి తప్పించి ప్రభుత్వ బ్యాంకుల ద్వారా రుణాలు పొందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి టి నాగరాణి ఆదేశించారు. బుధవారం కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి రైతు వేదికలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ మరియు వ్యవసాయ శాఖ సంయుక్తంగా రైతులకు రుణాల మార్పిడి, మంజూరుపై న్యాయ చైతన్య సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని బ్యాంకు అధికారులు వ్యవసాయ శాఖ అధికారులు రైతులు పాల్గొన్నారు. ఆర్బిఐ సూచనలు మరియు రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు రైతులకు రుణాలు మంజూరులో ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పిస్తున్నామని నాగరాణి అన్నారు. అవగాహన లోపంతో రైతులు అధిక వడ్డీలకు ప్రైవేటు వ్యక్తుల దగ్గర అప్పులు చేస్తున్నారని దీని వల్ల అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొనీ ఆర్థికంగా నష్టపోతున్నారని ఆమె అన్నారు. రైతులు బ్యాంకుల్లో రుణాలు పొందడానికి వ్యవసాయ అధికారులు సహకరించాలని సూచించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తిరుమల ప్రసాద్ మాట్లాడుతూ.. రైతులు ఏ విధమైన రుణాలు పొందడానికి అవకాశం ఉందో తెలుసుకోవడానికి ఫైనాన్షియల్ లిటరసీ క్యాంప్స్ ఏర్పాటు చేసేలా బ్యాంకు అధికారులు మరియు వ్యవసాయ శాఖ చర్యలు తీసుకుంటామని అన్నారు. అందుకు కావలసిన సహకారాన్ని వ్యవసాయ శాఖ అధికారులు అందిస్తారని అన్నారు. రైతులకు వంటల బీమా పై అధికారుల అవగాహన కల్పించాలని, రుణాల మంజూరులో అధికారులు రైతులకు సహకరించాలని రైతు సంఘం అధ్యక్షుడు శ్రీహరి రావ్ అన్నారు. అనంతరం రుణాల మంజూరు లో ఎదురయ్యే సమస్యలపై రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సూపరింటెండెంట్ చంద్రసేన్ రెడ్డి, ఏడిఏ అపర్ణ, ఏవోలు, ఏ ఈ ఓ లు. బ్యాంక్ అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో విద్యకు మొదటి ప్రాధాన్యత

- ఎమ్మెల్యే బాలు నాయక్



**కొండమల్లేపల్లి, జూన్ 18 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలలు, విద్యాలయాలు, గురుకులాలను బలోపేతం చేయాలన్నదే ప్రజా ప్రభుత్వం లక్ష్యం అని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కోల్ ముంతలపహాడ్ గ్రామపంచాయతీ పరిధిలో రైతువేదిక సమీపంలో కస్తూర్బా గాంధీ బాలికల కళాశాలను అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికరమైన ఆహారంతో బాలికలకు అన్ని రకాల సౌకర్యాలను కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అందిస్తున్నారన్నారు. ప్రభుత్వంపై నమ్మకంతో బాలికల తల్లిదండ్రులు తమ పాఠశాలలో పిల్లలను చేర్పిస్తున్నారని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో మెరుగైన సదుపాయాల కల్పనపై ప్రజా ప్రభుత్వం దృష్టి సారించిందని పేదరికంలో ఉన్న బాలికలకు నాణ్యమైన విద్యను అందించడానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. గురుకుల హాస్టల్ విద్యార్థుల ఆలనా పాలన చూస్తున్న ప్రజా ప్రభుత్వం 40శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ ఛార్జీలు పెంచిన కాంగ్రెస్ ప్రభుత్వందే అన్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే దృఢసంకల్పంతో ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవ రెడ్డి, నల్గొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్ ఖాన్, పిఎసిఎస్ చైర్మన్ డాక్టర్ దూదిపాల వేణుధర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, వడ్త్య దేవేందర్ నాయక్, మాజీ ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్ రెడ్డి, మేకల శ్రీనివాస్ యాదవ్, మండల పార్టీ అధ్యక్షులు వేమన్ రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు, మాజీ జడ్పీటీసీ సలహాదారుడు పసునూరి యుగేందర్ రెడ్డి, డిఈ శైలజ, ఎంపిడిఓ బాలరాజు రెడ్డి, తహసిల్దార్ నరేందర్, ఎంఈఓ నాగేశ్వరరావు, ఏఈ లస్కర్ నాయక్, స్పెషల్ ఆఫీసర్ సరళ, బొడ్డుపల్లి సైదులు, యూనుస్, కొర్ర రాంసింగ్, మాజీ సర్పంచులు కుంభం శ్రీనివాస్ గౌడ్, అబ్బనబోయిన శ్రీనివాస్ యాదవ్, మాదుగుల యాదగిరి, కొర్ర రవి నాయక్, మాజీ ఎంపిటిసీ రాణి రాజు నాయక్, జగన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి

**నిజామాబాద్ జిల్లా బ్యూరో, జూన్ 18 (జనంసాక్షి) :** అంగన్వాడీ కేంద్రాలకు విచ్చేసే చిన్నారులు, గర్భిణీ, బాలింతలకు ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలని కామారెడ్డి జిల్లా కలెక్టర్ అశీష్ సాంగ్వాన్ అన్నారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ ప్రాజెక్టులోని తిర్మలాపూర్ గ్రామంలో అప్గ్రేడషన్ అంగన్వాడి సెంటర్ ను కలెక్టర్ ఆశిష్ సాంగ్వన్ మరియు బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్వాడి పాఠశాలలో చిన్న పిల్లలు కలెక్టర్, సబ్ కలెక్టర్కు పూలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అంగన్వాడి సెంటర్‌ను వారు సందర్శించి పిల్లలతో పాటలు పాడించి, బొమ్మలను చూపిస్తూ వాటి పేర్లను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా అంగన్వాడి సెంటర్ లోని వంటశాలను సందర్శించి ఫుడ్ మెనూ అడిగి తెలుసుకొని కొత్తగా వచ్చిన పిల్లలకు కలెక్టర్ మరియు సబ్ కలెక్టర్ ల చేతుల మీదుగా అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ తర్వాత అంగన్వాడి ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఆ తర్వాత అంగన్వాడీ



ప్రాంగణంలో గల గ్రౌండ్ మరియు ఆట వస్తువుల గురించి మాట్లాడి వాటిని నిర్మించడానికి కావలసిన చర్యలను తీసుకోవాలని, మెనూ ప్రకారం చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని, పూర్వ ప్రాథమిక విద్యలో మంచి శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ప్రేమల, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, సీడీపీఓ, సూపవైజర్ మరియు మండల అధికారులు తహసీల్దార్, ఎంఈఓ, ఎంపీడీవో, గ్రామ సెక్రటరీ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్థలాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**మెదక్ జిల్లా బ్యూరో, జూన్ 18 (జనం సాక్షి) :** జిల్లాలోని హవేలీ ఘన్పూర్ మండలంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ బుధవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మెదక్ ఆర్డీవో రమాదేవి, హవేలీ ఘన్పూర్ తాసిల్దార్ సింధూ రేణుకతో కలిసి మండలంలోని ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హవేలి ఘనపూర్ మండల కేంద్రంలో ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని, మద్దులవాయి, గ్రామములో మరో ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించడం జరిగిందని స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీ , జిల్లా ఎలక్ట్రిసిటీ స్టోర్, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ తదితర నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వ స్థలాలను పరిశీలించడం జరిగిందని క్షుణ్ణంగా డీటెయిల్ మ్యాప్ తయారు చేయమని తాసిల్దారును ఆదేశించడం జరిగిందన్నారు. తదుపరి చర్యలు చేపడతామని వివరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మధిరలో రూ.10 కోట్లతో నూతన బస్ స్టేషన్ నిర్మాణం

- శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్క



**మధిర, జూన్ 18 (జనం సాక్షి) :** మధిరలో రూ.10 కోట్లతో నిర్మించనున్న నూతన బస్ స్టేషన్ నిర్మాణానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మల్లు బట్టి విక్రమార్క తో పాటు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ముందుగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంతకుముందు నాలుగు ఫ్లాట్ ఫారమ్స్ గా ఉన్న మధిర బస్ స్టేషన్ ను 10 ప్లాట్ ఫార్మ్స్ గా ఆధునికరిస్తూ రూ.10 కోట్లతో నిర్మించే కొత్త బస్ స్టేషన్ ను నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే మహాలక్ష్మి పథకం కింద కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని తెలిపారు. 10 సంవత్సరాల కాలంలో టిఆర్ఎస్ ప్రభుత్వంలో ఆర్టీసీ దివాలా తీసిందని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీని నిలబెట్టి ఈ సంస్థను అభివృద్ధి పథంలో నడపటానికి ప్రయత్నిస్తున్నట్లు వారు తెలిపారు. కల్లిబొల్లి మాటలతో బి.ఆర్.ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టింది అని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినాక అన్ని హామీలను అమలు చేస్తున్నట్లు వారు తెలిపారు. ఉచిత విద్యుత్తు పథకం అమలు చేశామని దీనివల్ల లక్షలాది మధ్యతరగతి కుటుంబాలు లబ్ది పొందాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, జిల్లా కలెక్టర్ అనుదీప్, ఖమ్మం కమిషనర్ సునీల్ దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి. దుర్గాప్రసాద్, టి ఎస్ ఆర్ టి సి జిల్లా అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు, శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దర్తి అభా జనభగీరథి అభియాన్ పథకాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలి



**బూర్గంపహాడ్, జూన్ 18 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన దర్తి అభా జన్ భగీరథి అభియాన్ పథకాన్ని ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కృష్ణసాగర్ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ మారుమూల ఆదివాసీ గిరిజన గ్రామాల్లో నివసించే గిరిజన కుటుంబాల సౌకర్యార్థం ఈ పథకం ప్రవేశపెట్టడం జరిగిందని, దీనిని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సభకు వచ్చిన గిరిజనులకు గ్రామసభలో అధికారులు చేపడుతున్న కార్యాచరణ, గిరిజనులకు అందిస్తున్న వివిధ రకాల కార్డుల గురించి వివరించారు. ఈ పథకంలో జిల్లాలో ఏజెన్సీ ఏరియాలో 130 పంచాయతీలను ఎంపిక చేయడం జరిగిందని, అందులో కృష్ణసాగర్ పంచాయతీ ఉందని చెబుతూ ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలంటే తప్పనిసరిగా ప్రతి ఒక్కరికీ గుర్తింపు కార్డు అనేది తప్పనిసరని, అలాంటి గుర్తింపు కార్డులను అధికారులే వచ్చి మీ గ్రామస్థుల సమక్షంలో మీకు అందించడం జరుగుతుందన్నారు. ఆధార్, కుల ధృవీకరణ, ఓటరు గుర్తింపు, రేషన్ కార్డు, కిసాన్ సమ్మాన్నిధి యోజన, ఆయుష్మాన్ భారత్, ఆర్వోఎస్ఆర్ పట్టాలు, జనదన్ కార్డులు, ఎన్ఆర్ఆజీఎస్ తదితర కార్డులు అర్హులైన ప్రతి గిరిజనులకు అందిస్తారని, వీటివల్ల ప్రభుత్వం నుంచి వచ్చే ఏ పథకాలైనా సులభంగా తీసుకోవచ్చన్నారు. అర్హులందరికీ తప్పనిసరిగా కార్డులు రిజిస్ట్రేషన్ చేసి అందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గిరిజనులకు ఆయన చేతులమీదుగా గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో బాలయ్య, ఏవో శంకర్, ఈజీఎస్ ఏపీవో విజయలక్ష్మి, ఆర్ ఐ నర్సింహారావు, ట్రాన్స్కో ఏఈ గుర్రం ఉపేందర్, మోరంపల్లి బంజర వైద్యురాలు లక్ష్మిసాహితి, ఐకేపీ ఏపీఎం, బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ లక్ష్మణ్, మీసేవా నిర్వాహకులు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# విద్యుత్ సంస్థల్లో ఆధునిక టెక్నాలజీ వినియోగం

- రాష్ట్ర విద్యుత్ చరిత్రలో కీలక ఘట్టం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్



**బోనకల్, జూన్ 18 (జనంసాక్షి) :** ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం బోనకల్ మండలంలోని జానకిపురం గ్రామంలో నిర్మించిన సబ్ స్టేషన్‌ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క , మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ తో కలిసి ప్రారంభించారు. విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తు సరఫరా, అంతరాయం ఏర్పడితే వేను వెంటనే గుర్తించి మరమ్మతులు చేసేందుకు రియల్ టైం ఫీడర్ మేనేజ్మెంట్ సిస్టం, ఫాల్ట్ పాస్ ఏజ్ ఇండికేటర్స్ లు ఎంతో ఉపయోగపడతాయని డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం మధిర నియోజకవర్గం బోనకల్లు మండలం జానకిపురం సబ్ స్టేషన్ లో ఆర్ పి ఎఫ్ ఎంఎస్, ఎఫ్‌పిఐ వ్యవస్థలను మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి డిప్యూటీ సీఎం ప్రారంభించారు. ఈ ఆధునిక పరిజ్ఞానాన్ని తెలంగాణ ఎస్పీడీసీఎల్ ఎస్పీడీసీఎల్ రెండు సంస్థల పరిధిలో అమలు చేయనున్నట్టు తెలిపారు. ఎక్కడ విద్యుత్ సరఫరా నిలిచిపోయిందో కంప్యూటర్ ద్వారా గుర్తించి కార్యాలయంలోని డాష్ బోర్డు ద్వారా కూడా రాష్ట్రంలో ఎక్కడ విద్యుత్ సమస్య ఏర్పడినా గుర్తించే అవకాశం ఈ ఆధునిక వ్యవస్థల ద్వారా వీలవుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రియల్ టైం ఫీడర్ మేనేజ్మెంట్ సిస్టం అనేది సబ్ స్టేషన్లలోని ఫీడర్ల పర్యవేక్షణ, నియంత్రణ, రక్షణ, రియల్ టైం ప్రాతిపదికన సమాచారాన్ని తీసుకోవడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యుత్ సరఫరాకు సంబంధించిన ప్రతి సమాచారం కంప్యూటర్ ఆధారితంగా నమోదు అవుతుందని తెలిపారు. ఈ వ్యవస్థ వినియోగదారులకు నాణ్యమైన నిరంతరాయ విద్యుత్ సరఫరా ఎక్కడైనా విద్యుత్ సరఫరా లో సమస్య ఏర్పడితే విద్యుత్ సిబ్బంది వేను వెంటనే ప్రతిస్పందించేందుకు సహకరిస్తుందని వివరించారు. మొదట రాష్ట్రంలోని 100 సబ్ స్టేషన్లలో ఈ వ్యవస్థకు శ్రీకారం చుట్టామని తెలిపారు. ఇకపోతే మరో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఫాల్ట్ పాసెజ్ ఇండికేటర్ అనేది విద్యుత్తు సరఫరా లో సమస్యను అతి త్వరగా గుర్తించడానికి, ఏ ప్రాంతంలో సమస్య ఏర్పడిందో తెలుసుకోవడానికి ఉపయోగపడుతుంది అన్నారు. ఈ వ్యవస్థ ద్వారా విద్యుత్ సరఫరాలో ఏర్పడిన అంతరాయాన్ని గుర్తించే సమయం గననీయంగా తగ్గుతుందని తెలిపారు. విశ్వసనీయతను మెరుగుపరచడానికి, విద్యుత్ సరఫరాను అతి త్వరగా పునరుద్ధరించడంలో సహాయపడుతుందని తెలిపారు. మొదటి దశలో 25 కిలోమీటర్ల కంటే ఎక్కువ పొడవైన 33 కెవి ,11 కె.వి ఫీడర్లు లో లోపాలను త్వరగా గుర్తించి సరఫరాను పునరుద్ధరించడానికి 1000 ఎఫ్ పి ఐ లను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీడీసీఎల్ సిఎండి వరుణ్ రెడ్డి, ఏఈ శ్రీనివాసాచారి, పలువురు జిల్లా ఉన్నతాధికారులు, స్థానిక ఎమ్మార్వో రమాదేవి, ఎంపీడీవో రమాదేవి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, టిపిసిసి సభ్యులు పైడిపల్లి కిషోర్ కుమార్, ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరరావు వడ్డే నారాయణ రావు, మండల అధ్యక్షుడు గాలి దుర్గా రావు, మాజీ జెడ్పీటీసీ సుధీర్ బాబు, కాంగ్రెస్ నాయకులు బిపి నాయక్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేజెండ్ల సాయికుమార్, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు మరియు విద్యుత్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## జాబ్‌లో చేరకుండానే జాక్‌పాట్

**జనంసాక్షి:**ఆఫర్ లెటర్ అనేది ఉద్యోగ ఎంపికలో కీలక దశ. స్క్రీనింగ్ టెస్టులు, ఇంటర్వ్యూలు.. ఇలా ఎంపిక ప్రక్రియ అంతా పూర్తయి ఆఫర్ లెటర్ చేతికొచ్చేసిందంటే ఇక ఉద్యోగం ఖరారైపోయిందని అభ్యర్థులు ఆనందంగా భావిస్తారు. కానీ ఆఫర్ లెటర్ ఇచ్చి ఉద్యోగంలో చేర్చుకోకుండా, జీతమూ ఇవ్వకుండా వేధిస్తున్న కంపెనీని కోర్టుకు లాగి సరిగ్గా బుద్ధి చెప్పాడో అభ్యర్థి..ఆఫర్ లెటర్ ఇచ్చి ఉద్యోగంలో చేర్చుకోని అబుదాబిలోని ఓ కంపెనీపై స్థానిక కోర్టు తగిన చర్యలు తీసుకుంది. ఖలీజ్ టైమ్స్ నివేదిక ప్రకారం.. సదరు బాధిత ఉద్యోగికి 'బకాయి వేతనం'గా 1,10,400 దిర్హామ్‌లు అంటే భారత కరెన్సీలో చెప్పాలంటే రూ.25 లక్షలు చెల్లించాలని కంపెనీని కోర్టు ఆదేశించింది. 2024 నవంబర్ 11 నుంచి 2025 ఏప్రిల్ 7 వరకు తన వేతనాన్ని యజమానులు నిలిపివేశారని ఆరోపిస్తూ సదరు ఉద్యోగి కంపెనీపై దావా వేశారు. ఆఫర్ లెటర్ ప్రకారం.. ఉద్యోగితో ఆ కంపెనీ ఫిక్స్‌డ్ టర్మ్ కాంట్రాక్ట్ కుదుర్చుకుంది. 7,200 దిర్హామ్‌ల బేసిక్ వేతనం, నెలకు 24,000 దిర్హామ్‌ల ప్యాకేజీ ఇస్తామని ఎంప్లాయిమెంట్ కాంట్రాక్ట్ నిబంధనల్లో పేర్కొంది. కానీ అతని జాయినింగ్ తేదీని కంపెనీ ఆలస్యం చేస్తూ వచ్చింది. ఉద్యోగంలో చేర్చుకోకుండా, జీతం కూడా ఇవ్వకపోవడంతో సదరు ఉద్యోగి కంపెనీని కోర్టుకు లాగాడు.

**కోర్టు ఏం చెప్పిందంటే..**

వేతన నివేదిక, ఎంప్లాయిమెంట్ కాంట్రాక్ట్, కేస్ మేనేజ్మెంట్ సిస్టమ్ ద్వారా సమర్పించిన సపోర్టింగ్ డాక్యుమెంట్ల ఆధారంగా ఉద్యోగి విధుల్లో చేరిక జాప్యానికి కంపెనీ యాజమాన్యమే కారణమని స్పష్టమైందని కోర్టు పేర్కొంది. కార్మిక చట్టాల ప్రకారం సకాలంలో వేతనాలు చెల్లించాల్సిన బాధ్యత యాజమాన్యాలపై ఉందని స్పష్టం చేసింది. బాధిత ఉద్యోగికి రూ.1,10,400 (సుమారు రూ.25 లక్షల వరకు) వేతనం చెల్లించాలని కోర్టు తీర్పునిచ్చింది. మరోవైపు, సదరు ఉద్యోగి సెలవుపై వెళ్లాడని, విధులకు హాజరు కాకపోవడం వల్ల అతను పూర్తి వేతనానికి అర్హుడు కాదని కంపెనీ వాదించింది. అయితే ఉద్యోగి విధులకు గైర్హాజరయ్యాడన్నదానికి ఎలాంటి ఆధారాలు లభించ లేదని, అతని విధుల్లో చేరిక జాప్యం పూర్తిగా కంపెనీ తప్పిదమేనని కోర్టు తేల్చిచెప్పింది. కాగా తాను ఎనిమిది రోజులు మాత్రమే సెలవు తీసుకున్నట్లు ఉద్యోగి చెప్పడంతో ఈ మేరకు అతని జీతంలో మినహాయించారు.

## ఓలా డ్రైవర్లకు జీరో కమీషన్

దేశవ్యాప్తంగా జీరో కమీషన్ మోడల్‌ను అమలు చేస్తున్నట్లు ఓలా క్యాబ్స్ తెలిపింది. 10 లక్షలకు పైగా డ్రైవర్ భాగస్వాములు తమ సంపాదనలో 100 శాతం ఆదా చేసుకోవచ్చని చెప్పింది.ప్రస్తుతం దేశవ్యాప్తంగా క్రియాశీలకంగా ఉన్న ఈ కార్యక్రమం ఆటోలు, బైకులు, క్యాబ్ డ్రైవర్లకు బిగ్ రిలీఫ్ అవుతుందని పేర్కొంది. రైడ్ పరిమాణం లేదా ఆదాయంపై ఎటువంటి పరిమితులను ఉండవని పేర్కొంది.కొత్త ప్రోగ్రామ్‌లో భాగంగా డ్రైవర్లు ఈ ప్రణాళికను ఎంచుకోవచ్చని చెప్పింది. కమీషన్ రూపంలో ఓలాకు వెళ్లే ఛార్జీలను ఎటువంటి మినహాయింపులు లేకుండా డ్రైవర్లు ఆ మొత్తాన్ని పొందవచ్చు. అయితే అందుకు నెలవారీ సబ్‌స్క్రిప్షన్ పొందాలని కంపెనీ తెలిపింది. ఈ ఫీచర్ను ఉపయోగించుకునే డ్రైవర్లు 30 రోజుల పాటు రోజుకు రూ.67 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది.



## యుద్ధభయాల్లోనే సూచీలు

**కొనసాగిన మార్కెట్ పతనం • 24,850 దిగువకు నిఫ్టీ**

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు స్వల్ప నష్టాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల ప్రభావంతో సూచీలు వరుసగా రెండో రోజూ నష్టాల్లో ముగిశాయి.ఫైనాన్షియల్, ఆటో స్టాక్స్ రాణించడం సూచీలకు కొంతమేర కలిసొచ్చింది. మరోవైపు అమెరికా ఫెడరల్ రిజర్వ్ పాలసీ నిర్ణయం ఈ రాత్రికి వెలువనుండడంతో మదుపర్లు ఆచితూచి వ్యవహరించారు.సెన్సెక్స్ ఉదయం 81,314.62 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. తర్వాత లాభాల్లోకి వచ్చినప్పటికీ ఎంతోసేపు నిలవలేదు. ఇంట్రాడేలో 81,237.01- 81,858.97 పాయింట్ల మధ్య కదలాడిన సూచీ.. చివరికి 138 పాయింట్ల నష్టంతో 81,444.66 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 41 పాయింట్లు కోల్పోయి 24,812.05 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.48గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టీసీఎస్, అదానీ పోర్ట్స్, హిందుస్థాన్ యూనిలీవర్, నెస్లే ఇండియా, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. ఇండస్ ఇండ్ బ్యాంక్, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతీ సుజుకీ, ఏషియన్ పెయింట్స్ లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 76 డాలర్ల వద్ద కొనసాగుతోంది

# ఐపీఓలకు సెబీ లైన్ క్లియర్

**న్యూఢిల్లీ:**కొత్త ఏడాదిలో తిరిగి జోరందుకున్న ప్రైమరీ మార్కెట్లు పలు అన్‌లిస్టెడ్ కంపెనీలకు జోష్‌నిస్తున్నాయి. ఈ ప్రభావంతో తాజాగా మూడు కంపెనీలు లిస్టింగ్ బాట పట్టాయి.క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నుంచి పబ్లిక్ ఇష్యూ చేపట్టేందుకు అనుమతిపొందాయి. జాబితాలో సన్‌షైన్ పిక్చర్స్, లూమినో ఇండస్ట్రీస్, ఎంఅండ్‌బీ ఇంజినీరింగ్ చేరాయి. ఈ మూడు కంపెనీలు ఈ ఏడాది జనవరి-ఫిబ్రవరి మధ్య సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు చేశాయి. వివరాలు చూద్దాం..టీవీ, సినిమాల నిర్మాత, దర్శకుడు విపుల్ షా కంపెనీ సన్‌షైన్ పిక్చర్స్ పబ్లిక్ ఇష్యూకి రానుంది. దీనిలో భాగంగా 50 లక్షల ఈక్విటీ షేర్లను కొత్తగా జారీ చేయనుంది. వీటితోపాటు మరో 33.75 లక్షల షేర్లను ప్రమోటర్లు ఆఫర్ చేయనున్నారు. వెరసి ఐపీవోలో 83.75 లక్షల షేర్లను విక్రయించనుంది. కంపెనీ ప్రమోటర్లలో ప్రధానంగా విపుల్ అమృత్‌లాల్ షా 23.69 లక్షల షేర్లు, షెఫాలీ విపుల్ షా 10 లక్షల షేర్లు చొప్పున విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధులను దీర్ఘకాలిక వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు వినియోగించనుంది. వీటితోపాటు రూ. 94 కోట్లు భవిష్యత్ వృద్ధి, కార్యకలాపాల నిర్వహణకు వెచ్చించనుంది.ప్రధానంగా ఈపీసీ కార్యకలాపాలు నిర్వహించే కోల్‌కతా కంపెనీ లూమినో ఇండస్ట్రీస్ ఐపీవో బాటలో సాగుతోంది. ఇందుకు వీలుగా రూ. 600 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో రూ. 400 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. తద్వారా రూ. 1,000 కోట్ల సమీకరణపై కన్నేసింది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 420 కోట్లు రుణ చెల్లింపులకు వెచ్చించనుంది. రూ. 15 కోట్లు పెట్టుబడి వ్యయాలకు వినియోగించనుంది. మిగిలిన నిధులు సాధారణ కార్పొరేట్ అవసరాలకు




కేటాయించనుంది.

**పీఈబీ సేవలు:**

ప్రీఇంజినీర్డ్ బిల్డింగ్స్(పీఈబీ)తోపాటు సెల్ఫ్‌సపోర్టెడ్ రూఫింగ్ సర్వీసులందించే ఎంఅండ్‌బీ ఇంజినీరింగ్ ఐపీవోకు సిద్ధపడుతోంది. ఇందుకు అనుగుణంగా గుజరాత్ కంపెనీ రూ. 325 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 328 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు ఆఫర్ చేయనున్నారు. దీంతో ఐపీవో ద్వారా రూ. 653 కోట్లు సమీకరించనుంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 64 కోట్లు పరికరాలు, మెషీనరీ కొనుగోలుకి వెచ్చించనుంది. రూ. 60 కోట్లు రుణ చెల్లింపులకు, మరో రూ. 110 కోట్లు వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు కేటాయించయనుంది. మిగిలిన నిధులు సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది.

**గ్లోబ్ ప్రాజెక్ట్స్ ఏ రూ. 67-71**


మౌలిక సదుపాయాల అభివృద్ధి కంపెనీ గ్లోబ్ సివిల్ ప్రాజెక్ట్స్ పబ్లిక్ ఇష్యూ ఈ నెల 24న ప్రారంభం కానుంది. 26న ముగియనున్న ఇష్యూకి ధరల శ్రేణి షేరుకి రూ. 67-71 చొప్పున ప్రకటించింది. దీనిలో భాగంగా రూ. 10 ముఖ విలువగల 1,67,60,560 ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. తద్వారా రూ. 119 కోట్లు సమకూర్చుకోవాలని ఆశిస్తోంది. వీటిలో రూ. 75 కోట్లు వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు, రూ. 14 కోట్లు పరికరాలు, మెషీనరీ కొనుగోలుకి వెచ్చించనుంది. మిగిలిన నిధులు సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. 2024 డిసెంబర్ 31తో ముగిసిన 9 నెలల కాలానికి దాదాపు రూ. 255 కోట్ల ఆదాయం, రూ. 18 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2025 మార్చి31కల్లా కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ. 669 కోట్ల విలువైన ఆర్డర్‌బుక్‌ను కలిగి ఉంది.

**స్టార్‌బిగ్‌బ్లాక్ ఐపీవో బాట**

స్టార్‌బిగ్‌బ్లాక్ బిల్డింగ్ మెటీరియల్ పబ్లిక్ ఇష్యూకి రానుంది. తాజాగా నిర్వహించిన అసాధారణ సర్వసభ్య సమావేశం(ఈజీఎం)లో ఇందుకు వాటాదారులు అనుమతించినట్లు కంపెనీ వెల్లడించింది. బీఎస్‌ఈ లిస్టెడ్ బిగ్‌బ్లాక్ కన్‌స్ట్రక్షన్‌కు పూర్తి అనుబంధ సంస్థఇది. ఐపీవో ద్వారా సంస్థకు సరైన విలువను వెలికితీయడం, విస్తరణకు అవసరమైన పెట్టుబడుల సమీకరణ తదితరాలకు వీలుంటుందని మాతృ సంస్థ బిగ్‌బ్లాక్ కన్‌స్ట్రక్షన్ పేర్కొంది. అయితే నియంత్రణ సంస్థల అనుమతులు, క్యాపిటల్ మార్కెట్ పరిస్థితులు, ఇతర క్లియరెన్స్‌లపై ఆధారపడి ఐపీవో చేపట్టనున్నట్లు వివరించింది. 2015లో ఏర్పాటైన బిగ్‌బ్లాక్ కన్‌స్ట్రక్షన్ దేశీయంగా ఏఏసీ బ్లాకు తయారీలో ఏకైక లిస్టెడ్ కంపెనీగా నిలుస్తోంది. గుజరాత్, మహారాష్ట్రలలోగల ప్లాంట్ల ద్వారా వార్షికంగా 1.3 మిలియన్ ఘనపు మీటర్ల సామర్థ్యాన్ని కలిగి ఉంది. గతేడాది(2024-25) రూ. 225 కోట్ల ఆదాయం సాధించింది.

## జియో బ్లాక్‌రాక్ కొత్త ప్లాట్‌ఫామ్ 'అలాదీన్'

జియో బ్లాక్‌రాక్ మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులను మరింత సులభతరం చేసేందుకు 'అలాదీన్' ప్లాట్‌ఫామ్‌ను ఆవిష్కరించింది. దీంతో బ్లాక్‌రాక్‌కు చెందిన పెట్టుబడుల విశ్లేషణ, రిస్క్ నిర్వహణ ప్లాట్‌ఫామ్ మొదటిసారి భారత ఇన్వెస్టర్లకు అందుబాటులోకి వచ్చినట్టు సంస్థ ప్రకటించింది.''పెట్టుబడులు ఇక ఎంతో సులభం. జియో ఫైనాన్షియల్, బ్లాక్‌రాక్ సంయుక్తంగా ఇదే నమ్మకాన్ని ఇన్వెస్టర్ల ముందుకు తీసుకొచ్చాయి. జియో డిజిటల్ ఫస్ట్ విధానానికి, బ్లాక్‌రాక్ సంస్థకు అంతర్జాతీయంగా పెట్టుబడుల్లో ఉన్న నైపుణ్యం కలగలిసి ఇన్వెస్టర్లకు అనుకూలమైన సొల్యూషన్లను అందించనున్నాం''అని చెప్పారు.




# ఈ యుద్ధం.. ప్రపంచానికి పెనుముప్పు

- ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంపై ప్రపంచ దేశాల ఆందోళన
- పతనమైన స్టాక్ మార్కెట్లు..
- మదుపరుల సంపద ఆవిరి
- హెర్మూజ్ జలసంధిని మూసివేసే యోచనలో ఇరాన్
- ముడి చమురు ధర పెరిగే అవకాశం ఉందంటున్న నిపుణులు
- పెరుగనున్న ఉత్పత్తి వ్యయం...
- వినియోగదారులపైనే భారం



ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య మొదలైన యుద్ధం ప్రపంచ దేశాలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ప్రపంచంలో ముడి చమురు, సహజ వాయువు ఉత్పత్తిలో అగ్రశ్రేణి దేశాల్లో ఒకటైన ఇరాన్ నేడు యుద్ధభూమిగా మారింది. పశ్చిమాసియాలో బలీయమైన సైనిక శక్తి కలిగిన రెండు దేశాలు ప్రత్యక్షంగా తలపడుతున్నాయి. ఈ యుద్ధం మరింత ముదిరే సూచనలు కనిపిస్తున్నాయి. రానున్న రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు, వైమానిక రంగంతోపాటు కీలక రంగాలు తీవ్రంగా ప్రభావితం కానున్నట్లు నిపుణులు హెచ్చరిస్తున్నారు.ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు పతనమయ్యాయి. భారీగా సంపద హరించుకుపోయింది. సోమవా రం కొంతవరకు కోలుకున్నాయి. మరోవైపు ఆయుధ తయారీ సంస్థలతోపాటు చమురు కంపెనీల షేర్ల ధరలు ఒక్కసారిగా పెరిగిపోవడం గమనార్హం. ఇప్పుడున్న పరిస్థితుల్లో స్టాక్ మారెక్‌ట్‌ను నమ్ముకోవడం తెలివైన పని కాదన్న ఆలోచనతో పెట్టుబడిదారులు సురక్షితమైన పెట్టుబడి సాధనాల వైపు దృష్టి పెట్టారు. వారు తమ సొమ్మును బంగారం కొనుగోళ్ల వైపు మళ్లిస్తున్నారు. ఇరాన్‌లో ఎప్పుడు యుద్ధం జరిగినా తక్షణమే ప్రభావితమయ్యేది చమురు రంగమే. బ్యారెల్(158.98 లీటర్లు) ముడి చమురు ధర సోమవారం 74.60 డాలర్లకు చేరుకుంది. గురువారంతో పోలిస్తే 7 శాతం పెరిగింది. ఒకవేళ యుద్ధం మరింత ఉధృతంగా మారి, హెర్మూజ్ జలసంధిని ఇరాన్ మూసివేస్తే బ్యారెల్ ముడి చమురు ధర 100 డాలర్లు దాటేస్తుందని గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ గోల్డ్‌మాన్ సాచ్స్ తేల్చి చెప్పింది. ప్రపంచంలో సముద్ర మార్గంలో జరిగే చమురు రవాణాలో మూడింట ఒకవంతు హెర్మూజ్ జలసంధి గుండానే జరుగుతోంది. ఇక్కడ ప్రతిరోజూ 2.1 కోట్ల బ్యారెళ్ల చమురు రవాణా అవుతోంది. ఇరాన్, గల్ఫ్ దేశాలను వేరుచేసే అతిసన్నని సముద్ర మార్గమైన హెర్మూజ్‌పై ఆధిపత్యం ఇరాన్‌దే. ఇజ్రాయెల్‌తో యుద్ధం తీవ్రస్థాయికి చేరితే హెర్మూజ్ జలసంధిని పూర్తిగా మూసివేయాలని ఇరాన్ నిర్ణయించుకున్నట్లు సమాచారం. అదే జరిగితే భారత్, జపాన్, చైనా సహా పలు ఆసియా దేశాలకు చమురు కష్టాలు తప్పవు. 1980వ దశకంలో ఇరాన్-ఇరాక్ యుద్ధ సమయంలో హెర్మూజ్ జలసంధిని పూర్తిగా మూసివేయలేదు. ఈసారి కూడా మూసివేసే పరిస్థితి ఉండబోదని నిపుణులు అంచనా వేస్తున్నారు.ఎందుకంటే ముడి చమురు ఎగుమతులు ఆగిపోతే ఇరాన్ ఆర్థికగా నష్టపోవడం ఖాయం. పొంచి ఉన్న ద్రవ్యోల్బణ ముప్పు చమురు ధరలు పెరిగితే ప్రత్యక్షంగా, పరోక్షంగా దాని ప్రభావం అన్ని రంగాలపైనా పడుతుంది. ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. అంతిమంగా ఆ భారం భరించాల్సింది వినియోగదారులే. చమురు కోసం దిగుమతులపై అధికంగా ఆధారపడే దేశాల్లో ద్రవ్యోల్బణం పెరిగిపోతుంది. వృద్ధిరేటు తగ్గిపోతుంది. ధరల పెరుగుదల నుంచి ప్రజలకు ఉపశమనం కల్పించడానికి ఇప్పటికే కొన్ని దేశాలు వడ్డీరేట్లు తగ్గిస్తున్నాయి.



## ముగ్గురి చేతుల్లోనే సింహభాగం

**అంబానీ వారసుల చేతుల్లో రూ.10 లక్షల కోట్లకుపైగా సంపద**


రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ ఛైర్మన్ ఆకాశ్ అంబానీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ రూ.3.59 లక్షల కోట్ల చొప్పున నికర విలువతో ఇండియాలో సంపద సృష్టికర్తల జాబితాలో అగ్రస్థానంలో నిలిచారు.క్రిసిల్ సహకారంతో 360 వన్ వెల్త్ దేశంలోని వివిధ రంగాల్లో సేవలిందిస్తున్న అత్యంత సంపన్నుల జాబితాను తయారు చేసింది.ఈ సమగ్ర జాబితాలో కనీసం రూ.500 కోట్ల నికర విలువ కలిగిన 2,013 మంది ఉన్నారు. వీరిలో పారిశ్రామికవేత్తలు, వారసులు, పెట్టుబడిదారులు, వృత్తి నిపుణులు చోటు సంపాదించుకున్నారు. వీరి సంపద దాదాపు రూ.100 లక్షల కోట్లుగా ఉందని నివేదిక తెలిపింది. 161 మంది వ్యక్తులు రూ.10,000 కోట్లకు మించి, 169 మంది వ్యక్తులు రూ.5,000-రూ.10,000 కోట్ల మధ్య సంపద కలిగి ఉన్నారని ఈ అధ్యయనం తెలిపింది.మహిళా పారిశ్రామికవేత్తల్లో ఇషా అంబానీ రూ.3.58 లక్షల కోట్లతో అత్యంత ధనిక వ్యాపార యజమానిగా నిలిచారు. వ్యాపారాలను స్థాపించిన లేదా అధిక విలువ జోడించేందుకు గణనీయమైన పాత్ర పోషించిన 72 మంది మహిళా నాయకులను కూడా ఈ నివేదిక గుర్తించింది. భారతదేశంలోని అతిపెద్ద కార్పొరేట్ సంస్థల ఆధిపత్యాన్ని ఈ రిపోర్ట్ హైలైట్ చేసింది. మొత్తం ప్రమోటర్ సంపదలో రిలయన్స్, టాటా, అదానీ గ్రూపుల వాటా 24 శాతంగా ఉంది. దేశంలోని టాప్ 50 వ్యాపార సంస్థలు 360 ఐటీ వెల్త్ క్రియేటర్స్ జాబితాలో ఉన్న కంపెనీల మొత్తం సంపదలో 59 శాతం ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, అదానీ ఎంటర్ప్రైజెస్ మాత్రమే ఇందులో 12% వాటాను కలిగి ఉన్నాయి.

అంబానీల ప్రభావం

టెలికాం, రిటైల్, ఎనర్జీ, డిజిటల్ సర్వీసెస్.. వంటి కీలక రంగాల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్ సుస్థిర నాయకత్వాన్ని అంబానీ కుటుంబం కొనసాగిస్తోంది. భారతదేశ డిజిటల్ విప్లవానికి జియో నాయకత్వం వహించడం, రిలయన్స్ రిటైల్ దూకుడుగా విస్తరించడంతో అంబానీ కుటుంబం ఆర్థిక సామ్రాజ్యం రానున్న రోజుల్లో మరింత పెరుగుతుందని నివేదిక అంచనా వేసింది.

## వార్షిక టోల్ పాస్‌ను ప్రకటించిన కేంద్రం

**జనంసాక్షి:**టోల్ గేట్ గుండా ప్రయాణించే వాహనదారులకు కేంద్రం వార్షిక పాస్‌ను ప్రకటించింది. రూ.3,000 ధరతో సంవత్సరం పొడవునా జాతీయ రహదారుల మీదుగా ప్రయాణించడానికి వీలు కల్పిస్తున్నట్లు చెప్పింది.ఈ ఫాస్టాగ్ ఆధారిత పాస్ ఆగస్టు 15 నుంచి అమల్లోకి వస్తుందని కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు.యాక్టివేట్ చేసిన తేదీ నుంచి ఏడాది పాటు లేదా 200 ట్రిప్పులు ఏది ముందు పూర్తయితే అప్పటివరకు పాస్ చెల్లుబాటు అవుతుందని మంత్రి తెలిపారు. కార్లు, జీపులు, వ్యాన్లు వంటి వాణిజ్యేతర ప్రైవేట్ వాహనాల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ పాస్ హైవే ప్రయాణాన్ని చౌకగా, ఇబ్బంది లేకుండా మార్చడానికి వీలు కల్పిస్తుందని ఆయన చెప్పారు. పాస్ యాక్టివేషన్, రెన్యువల్ కోసం ప్రత్యేక లింక్‌ను త్వరలో రాజ్‌గార్ యాత్ర యాప్‌తో పాటు ఎన్‌హెచ్‌ఏఐ, ఎంఓఆర్‌టీహెచ్ అధికారిక వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంచుతామని గడ్కరీ తెలిపారు.ఈ విధానం 60 కిలోమీటర్ల పరిధిలో ఉన్న టోల్ ప్లాజాలకు సంబంధించి ప్రయాణికుల దీర్ఘకాలిక ఆందోళనలను పరిష్కరిస్తుందని చెప్పారు. పరిమిత కాలంపాటు ఒకేసారి టోల్ చెల్లింపులు చేసి ప్రయాణాన్ని సులభతరం చేసుకోవచ్చు.



# భారత ఆటబొమ్మల నాణ్యత భేష్

**• బీఐఎస్ సైంటిస్ట్ డైరెక్టర్ అద్భుత్ సింగ్**

**జనంసాక్షి:**భారత ఆటబొమ్మల (టాయ్స్) నాణ్యత ప్రమాణాలు అంతర్జాతీయ బెంచ్‌మార్క్ కంటే మెరుగైనవని భారతీయ ప్రమాణాల సంస్థ (బీఐఎస్) సైంటిస్ట్ డైరెక్టర్ (వెస్టర్న్ రీజినల్ ఆఫీస్ ల్యాబరేటరీ) అద్భుత్ సింగ్ తెలిపారు. దేశీ ఎగుమతిదారులు తమ ఉత్పత్తులను విదేశీ మార్కెట్లకు ఎగుమతి చేయడంలో ఈ ప్రమా ణాలు సాయపడుతున్నట్టు చెప్పారు.టాయ్స్‌కు సంబం ధించి భౌతిక, రసాయన, ఎలక్ట్రికల్ భద్రతా ప్రమాణా లను బీఐఎస్ రూపొందించి, అమలు చేస్తుండడం గమ నార్హం. అంతర్జాతీయంగా ఐఎస్‌వో, ఐఈసీ సంస్థలు నిర్ణయించిన బెంచ్‌మార్క్ ప్రమాణాలకు అనుగుణంగా భారతీయ ప్రమాణాలను బీఐఎస్ అభివృద్ధి చేసింది. వీటి ప్రకారం దేశీయంగా తయారీకి, దిగుమతులకు గాను ఏడు రకాల ప్రమాణాలను పాటించాల్సి ఉంటుంది. ఈ ప్రమాణాలు దేశీయంగా, అంతర్జాతీయంగా భారత ఆటబొమ్మల అమ్మకాలు పెరిగేందుకు సాయపడినట్టు అద్భుత్ సింగ్ తెలిపారు.

**పోటీకి అవకాశం..**

బీఐఎస్ ప్రమాణాలు ఆవిష్కరణలను ప్రోత్సహించడం తోపాటు దిగ్గజ కంపెనీలతో పోటీపడే అవకాశం కల్పించినట్లు ముంబైకి చెందిన జెఫిర్ టాయ్‌మేకర్స్ ప్రైవేటు లిమిటెడ్ సీఈవో మోయిజ్ గబ్జీవాలా తెలిపారు. 'బీఐఎస్ ప్రమాణాలు అమల్లోకి వచ్చిన తర్వాత (2021 జనవరి 1 నుంచి) మా ఆదాయం గణనీయంగా పెరిగింది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.25 కోట్ల ఆదాయం సాధించాం. 2025-26లో 20 శాతం వృద్ధిని అంచనా వేస్తున్నాం' అని ప్రకటించారు.తమ ఉత్పత్తుల్లోకి వినియోగించే ముడి సరుకుల్లో 99 శాతం దేశీయంగా తయారైనవేనని చెప్పారు. 15 కేటగిరీల్లో 100కు పైగా రకాలతో 1-1.5 లక్షల బొమ్మలను నెలవారీగా ఉత్పత్తి చేస్తున్నట్టు చెప్పారు. భారత కంపెనీలు ఇప్పుడు నాణ్యమైన ఆటబొమ్మలను అందుబాటు ధరలకే ఉత్పత్తి చేయగలుగుతున్నట్టు వివరించారు. బీఐఎస్ సర్టిఫికేషన్ ఉంటే సంబంధిత ఆటబొమ్మల్లో పాదరసం, థాలేట్స్ వంటి విషపూరిత పదార్థాలు లేవని, మింగేందుకు అవకాశం ఉన్న చిన్నపాటి విడిభాగాల్లేవని, పదునైన అంచుల్లేవన్న భరోసానిస్తుందని అద్భుత్ సింగ్ తెలిపారు. గ్లోబ్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ సంస్థ (జీటీఆర్ఐ) నివేదిక ప్రకారం చూస్తే.. 2023-24లో టాయ్స్ ఎగుమతులు అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోల్చి చూస్తే 154 మిలియన్ డాలర్ల నుంచి 152 మిలియన్



## శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్ర మళ్లీ వాయిదా

ఉంటుందని తొలుత ఇస్రో తెలిపినప్పటికీ..అది 22కు వాయిదా పడింది. ఇప్పటికే సాంకేతిక కారణాలతో యాక్సియం-4 ప్రయోగం పలుమార్లు వాయిదా పడిన సంగతి తెలిసిందే.ఈ మిషన్ కోసం ఉపయోగిస్తున్న ఫాల్కన్-9 రాకెట్‌లో ద్రవ ఆక్సిజన్ లీక్ అవుతున్నట్లు అధికారులు గుర్తించడంతో ఈనెల 11న జరగాల్సిన ప్రయోగాన్ని వాయిదా వేశారు. ఆ సమస్య పరిష్కారమైనట్లు తెలిపిన ఇస్రో.. 19న రోదసీ యాత్ర ఉంటుందని వెల్లడించింది. అయితే.. తాజాగా ఇది మరోసారి వాయిదా పడినట్లు ఇస్రో తెలిపింది.''ప్రయోగ తేదీపై ఇస్రో బృందం యాక్సియం స్పేస్‌తో సుదీర్ఘ చర్చల జరిపింది. ప్రయోగ సంసిద్ధతపై నాసా, స్పేస్ ఎక్స్‌తో యాక్సియం స్పేస్ సంప్రదింపులు జరిపింది. ఇటీవల చేపట్టిన మరమ్మతులు, వాతావరణ పరిస్థితులు, సిబ్బంది ఆరోగ్య పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని జూన్ 22ను తదుపరి ప్రయోగ తేదీగా యాక్సియం స్పేస్ వెల్లడించింది'' తెలిపింది.



### ఫేక్ బాండ్లు.. భారీ వసూళ్లు

చిరు వ్యాపారస్థులను, ఆటో డ్రైవర్లను వెళ్లగొట్టాలని ఎంతగా ప్రయత్నిస్తున్నాడో అంత కంటే వంద రెట్లు ఎక్కువగా పెద్దోళ్లను కాపాడేందుకు యత్నిస్తున్నాడు. కార్పోరేట్ హస్పిటల్ తో పాటు బడా బాబులను వ్యాపార సముదాయాలను కాపాడటం కోసం వారికి కలగని సలహాలు సూచనలు ఇచ్చి వారిని కాపాడుతున్నట్లు విమర్శలున్నాయి. పక్కనే ఉన్న ఖాళీ స్థలాలను లీజ్ కు తీసుకున్నట్లు నకిలి బాండ్లు సృష్టింపజేసి అనుమతులు ఇప్పిస్తున్నట్లు సమాచారం. అందుకు గాను భారీ మొత్తంలో నగదు మారుతున్నట్లు సమాచారం. నెలవారి మామూళ్ల కోసం ఓ కానిస్టేబుల్ ని నియమించుకొని నెల నెల ఖాతాలు వసూలు చేస్తున్నారని సమాచారం. భారీ మొత్తంలో వసూళ్లకు పాల్పడి ఖమ్మంలో నయా దందాకు తెరలేపిన ఖాకీ దేఖో మై పోలీసిజం అంటున్నాడు.

# దేఖో మై పోలీసిజం!

## అధికార పార్టీకి తలనొప్పిగా మారిన ఖాకీ

- పేదోడిపై ప్రతాపం.. పెద్దోడిపై కనికరం
- పేరు కోసం తపన

ఖమ్మం జిల్లాలో పనిచేసిన ఒక్కో పోలిస్ అధికారిది ఒక్కో స్టైల్. చాలా వరకు పోలీసులు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉంటూ రౌడీ గ్యాంగుల ఆటకట్టించడంలో తమ మార్క్ చూపించారు. ఎస్సై నుంచి మొదలు ఎస్పీ వరకు తమ తమ స్టైల్‌లో పోలీసింగ్ నిర్వహించారు. కొందరు ప్రజల దృష్టిలో హీరోగా ప్రశంసలు పొందితే మరికొందరు అవినీతిపరులుగా, వ్యభిచారులుగా అప్రతిష్ట పాలయ్యారు. కొందరి పేరు చెబితే గొప్పగా భావిస్తే.. మరికొందరి పేరు చెబితే ఛీత్కరించుకునే పనులు చేసారు. గొప్పగా పని చేసిన వాళ్లు డబ్బు, ఆస్తులు మూట కట్టుకోలేదేమో కాని మంచి పేరు తరతరాలు గుర్తుపెట్టుకొనేల పని చేసారు. ఛీత్కారానికి గురైన వారు సొమ్ము, ఆస్తులు మూట కట్టుకున్నారేమో కాని వారి బంధువులు ఎక్కడైనా వారి పేరు చెబితే వారికున్న విలువ తగ్గే పరిస్థితులు కల్పించుకున్నారు. ఇప్పుడు ఖమ్మం ట్రాఫిక్ లో కొత్తగా ప్రతినాయకుడి పాత్ర పోషించేందుకు ఓ సారు బయలు దేరాడు.

### పెద్దోడు తప్పా పేదోడు ఉండొద్దు

"బెల్లం" చుట్టూ ఈగలు ఉన్నట్లు ఈయన గారు కాసులు ఉన్న వారి చుట్టూనే ఉంటాడు. పేద వర్గాలు తోపుడు బండ్ల వ్యాపారులు అతనికి కనపడ వద్దంటా, పొట్టకూటి కోసం రోడ్డు మీద వ్యాపారం చేసుకునే వారంటే అతనికి అసహ్యం. ఏ పని దొరక్కా కుటుంబ పోషణ కోసం పేగులు తెంచుకొని ఆటో నడిపే వాళ్లంటే అతనికి అసహనం. పేదోడు ఎలా బతికిన అతనికి అవసరం లేదు.. పెద్దోడు హాయిగా ఉండటమే అతను నిర్వర్తించే విధి నిర్వహణగా పెట్టుకున్నాడు. బస్టాండ్ కు వచ్చిన ప్రయాణికుడు బంధువుల ఇండ్లకు వెళ్లాలన్న, ఆసుపత్రిలో ఉన్న రోగులను పరామర్శించడానికి వెళ్లాలన్నా పండ్లు తీసుకెళ్లే ఆనవాయితీ ఉంటుంది. ఆ పండ్లు అమ్ముకునే తోపుడు బండ్లు రోడ్డు పై కనపడ వద్దంటూ హుకుం జారీచేసి చేసాడు. అసలే కరువుతో తాండవిస్తున్న పేద బలహీన వర్గాల ప్రజలు లబోదిబోమంటున్నారు. ప్రతి రోజూ కట్టే గిరిగిరిలు, నెలవారి కట్టే వాయిదాలు వెళ్లతీసుకోలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదే పెద్దోళ్ల షాపింగ్ మాల్స్ ముందు, రెస్టారెంట్ల ముందు, కార్పోరేట్ ఆసు పత్రుల ముందు కార్పొరేట్ కాలేజీల ముందు ఎంత పార్కింగ్ చేసుకున్న తప్పు లేనట్లు వ్యవహరిస్తున్నాడు. వాళ్ల నుంచి నెల నెల మామూళ్లకు అలవాటు పడి పెద్ద వర్గాలకు చాకిరి చేస్తున్నాడని ఆరోపణలు ఉన్నాయి. ఆ ఖాకీ తీరు వల్ల అధికార పార్టీకి తలనొప్పిగా మారింది. ఓట్లు వేసేది మాస్ జనాభా మాత్రమే అనేది జగమెరిగిన వాస్తవం. పెద్ద వర్గాలు ఓటు వేయడానికి వచ్చే అవకాశమే ఉండదు. అలాంటి వారి కోసం ఈ ఖాకీ సాబ్ తహ తహలాడడం అధికార పార్టీ నాయకులకు ఇబ్బందికరంగా మారు తుంది. చిరు వ్యాపారులంతా మంత్రి తుమ్మలను కలిసి ఆ ఖాకీ మీద ఫిర్యాదు చేసారు. ఖాకీ తీరు గురించి మంత్రి ఆరా తీస్తున్నట్లు సమాచా రం. ఇప్పటికే ఓ ఏసిపి స్థాయి అధికారికి వాస్తవ సమాచారం తెలుసుకొ ని తెలపాలని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

ఆటో వాలాలు మంత్రి పొంగులేటిని కలవగా ట్రాఫిక్ ఏసిపికి ఫోన్ ద్వారా సమస్య పరిష్కరించమని కోరిన ట్లుగా సమాచారం. ఇరువురు మంత్రులకు ఇతని తీరు ఇబ్బందిగా మారింది.

### ఎస్పీలో చర్చ

ట్రాఫిక్ సిఐ వివాదాస్పద వైఖరి పట్ల ఎస్పీ అధికారులు అంతర్గతంగా దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. పోలిస్ బాస్‌కి జరుగుతున్న పరిణామాలపై నివేదిక అందజేసినట్లు తెలుస్తుంది. జిల్లాకు చెందిన వ్యక్తిని సేమ్ జోన్‌లో పోస్టింగ్ ఇవ్వడం పట్ల అనేక రకాలుగా అధికార పార్టీ బద్నాం అయ్యే అవకాశం లేకపోలేదు. ఇప్పటికే ఖమ్మం పోలీసింగ్ వ్యవహారం వివాదస్పదంగా ఉంది. ట్రాఫిక్ లో పనిచేసే సిఐ సాబ్ ని మార్చుకోకపోతే సామాన్య ప్రజల్లో, కూటి కోసం పోరాటం చేసే కూలీ బతుకులు బహిరంగా పోరాటం చేసే అవకాశం లేకపోలేదు.

### పోస్టింగ్‌లో చేరకుండా

ఇతను ఒక్కసారి మాత్రమే ఎస్హెచ్‌ఓగా పని చేసినట్లు సమాచారం. మిగతా సమయం అంతా లూప్ లైన్లోనే విధులు వెలగపెట్టాడు. సొంత జిల్లాలో ఇతనికి పోస్టింగ్ ఇవ్వడం అంటే అది పూర్తి నిబంధనలకు విరుద్ధం. కొత్తగూడెం, ఖమ్మంలలో టాస్క్ ఫోర్స్‌లో పని చేసి అనేక మంది అమాయకులపై గంజాయి కేసులు బనాయించాడని సమాచారం. షీ టీమ్‌లో పని చేసిన ఇతను విధులు ఏ మాత్రం సక్రమంగా నిర్వర్తించలేక పోయాడు. ఇతని జీవిత కాలం లూప్ లైన్ లోనే గడిచిపోయింది. ఎప్పుడో ట్రాఫిక్ లో జాయిన్ అవ్వాల్సిన ఇతడిని ఖమ్మం పోలీస్ ఉన్నతాధికారి ఇతని వివాదాస్పద వ్యవహారం తెలిసి ట్రాఫిక్ పోస్టింగ్ ఇవ్వకుండా టాస్క్ ఫోర్స్ లో విధులు అప్పగించినట్లు సమాచారం.



## ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రిని కలిసిన ప్రభుత్వ విప్

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూన్ 18 (జనంసాక్షి) :** ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంత్రిగా నియామకమైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావును బుధవారం హైదారాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డితో కలిసి మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం జిల్లా ఇన్చార్జి మంత్రికి స్వామివారి కండువాతో పాటు ప్రసాదాలను అందజేశారు.

### ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్‌లో

## పారమిత విద్యార్థులు ప్రతిభ



**కరీంనగర్ బ్యూరో, జూన్ 18 (జనంసాక్షి) :** ఇటీవల జరిగిన ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ (ఐటిఓ)లో స్థానిక కొత్తపల్లి మండలం పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి పలు స్థానాలను కైవసం చేసుకున్నారు. గణితం లో కె.అగస్త్య విశ్రుత్ (9వ తరగతి) రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంకు సాధించి నగదు బహుమతి గెలుపొందారు. అదేవిధంగా జి.ఆరుష్ రెడ్డి (6వ తరగతి), సాయిరిశిత్ జె. (8 వ తరగతి)లు అత్యుత్తమ ప్రతిభను కనబరిచి ప్రశంసా పత్రాలు, మెడల్ ఆఫ్ ఎక్సలెన్స్ సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ.ప్రసాదరావు, డైరెక్టర్లు రశ్మిత, ప్రసూన, అనూకర్ రావు, రాకేష్, వియయం. ప్రసాద్, వినోద్ రావు, టి.యస్.వి. రమణ, హన్మంత రావులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ, కోఆర్డినేటర్లు రాము, నాగరాజు, గణిత ఉపాధ్యాయులు వీరలక్ష్మి , ప్రదీప్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఏడాదిలోగా పూర్తవ్వాలి

### కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్



**నిజామాబాద్ జిల్లా బ్యూరో జూన్ 18 (జనం సాక్షి) :**
ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ఏడాదిలోగా పూర్తవ్వాలని కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలోని బీడీ వర్కర్స్ కాలనీలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి బుధవారం అయన భూమి పూజ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నిబంధనల మేరకే ఇళ్లను నిర్మించాలని లబ్ధిదారులకు సూచించారు. విడతల వారీగా లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయన్నారు. అనంతరం పాత బాన్సువాడలోని సహకార సంఘం చౌక ధరల దుకాణంలో సన్న బియ్యాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, డీఎల్పీవో సత్యనారాయణ రెడ్డి, తహశీల్దార్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మహత్యకు యత్నించిన యువతి

### ప్రాణం కాపాడిన మియాపూర్ పోలీసులు

**శేరిలింగంపల్లి, జూన్ 18 (జనంసాక్షి) :**
ఇంటి నుంచి బయటికి వచ్చి అనారోగ్య సమస్యలు మానసిక ఆందోళనతో జీవితం పై విరక్తి చెంది ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించిన ఓ యువతి విషయంలో మియాపూర్ పోలీసులు బుధవారం సకాలంలో స్పందించడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ మేరకు మియాపూర్ పోలీస్ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం... సికింద్రాబాద్‌కు చెందిన మహిళకు ముగ్గురు పిల్లలు. ఆమె జూబ్లీహిల్స్‌లోని ఓ ఇంట్లో కేర్ టేకర్‌గా పని చేస్తుంది. అయితే గత కొంతకాలంగా తీవ్రమైన తలనొప్పితోపాటు ఇతర అనారోగ్య సమస్యలతో మానసికంగా కృంగిపోయింది. ఈ నేపథ్యంలోనే మియాపూర్ ప్రాంతంలోని చర్చికి ప్రార్థన నిమిత్తం వచ్చింది. ప్రార్థనల అనంతరం ఆమె హఫీజ్ పేట్ రైల్వే స్టేషన్ ప్రాంతానికి వెళ్లి తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసింది. ఒకసారి తన పిల్లలను చూపించాలని తాను ఆత్మహత్య చేసుకుంటానని వారికి చెప్పడంతో కంగారుపడిన కుటుంబ సభ్యులు 100కు ఫోన్ చేశారు. అయితే కంట్రోల్ రూమ్ నుంచి సమాచారం అందుకున్న మియాపూర్ సిఐ క్రాంతి కుమార్ మియాపూర్ పెట్రోల్ వన్ మొబైల్ లో విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ కానిస్టేబుల్ రుషేశ్వర్ రావు, ఎస్పిఓ రాజేశ్వర్ రెడ్డిలను తక్షణం అప్రమత్తం చేయడంతో ఆమె కాల్ సిగ్నల్స్ ఆధారంగా హఫీజ్ పేట రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే ట్రాక్ వద్ద ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు పోలీస్ స్టేషన్ కు చేరుకొని పోలీసులు తక్షణం స్పందించడం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. తమ బిడ్డను కాపాడిన పోలీసులకు ఈ సందర్భంగా వారు ధన్యవాదాలు తెలియజేశారు. అయితే సదరు మహిళకు సిఐ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించి పిల్లల భవిష్యత్ దృష్టిలో ఉంచుకొని ఇటువంటి అఘాయిత్యాలకు పాల్పడవద్దని సూచించారు. దీంతో ఆమె తన నిర్ణయాన్ని మార్చుకొని తల్లిదండ్రులతో ఇంటికి వెళ్లిపోయింది. తక్షణం స్పందించి మహిళ ప్రాణాలు కాపాడిన పోలీస్ స్టాఫ్ ను సిఐ క్రాంతి కుమార్ అభినందించారు.



## త్రివేణి సంగమం వద్ద భద్రత ఏర్పాట్లు పరిశీలన

### జిల్లా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య

**బోధన్, జూన్ 18 (జనంసాక్షి) :** రెంజల్ పోలీస్ స్టేషన్ పరిధిలో కందకుర్తి వద్ద గల త్రివేణి సంగమం నది పరివాహక ప్రదేశాల వద్ద భద్రత ఏర్పాట్లను బుధవారం జిల్లా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పర్యవేక్షించారు. వర్షాకాలంలో భారీ స్థాయిలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నిజామాబాదు, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలోని నీటి పరివాహక ప్రాంతాల్లో మరియు నదులు, కాలువల ప్రాంతాలలో ప్రజలు వారి యొక్క మొక్కులు తీర్చుకోవడానికి, స్నానాలు చేయడానికి వస్తుంటారని కావున, ప్రజల భద్రత నేపథ్యంలో అట్టి స్థలాలలో గట్టి భద్రతా ఏర్పాట్లు చేయాలని కింది స్థాయి అధికారులకు ఆదేశించారు. త్రివేణి సంగమం వద్ద గజ ఈతగాలను అందుబాటులో ఉంచాలని, ఘాట్ల వద్ద ప్రమాదాలు నివారణకు భారికేడ్లు, ప్రమాద గటికలను గుర్తించి ఆ ప్రాంతంలో అటు వైపు ఇటు వైపు త్రాడుతో కట్టి వేయాలని, అట్టి త్రాడు దాటి ఎవరు ముందుకు వెళ్ళారాదని తెలిపే విధంగా ఏర్పాట్లు చేయాలనీ ఆయన ఆదేశించారు. అలాగే ప్రమాద గటికల చిహ్నాలు ఫ్లెక్సీ రూపంలో తయారు చేసి ఉంచాలని జిల్లా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య స్పష్టం చేశారు. ఈ సందర్భంలో బోధన్ ఏసీపీ పి. శ్రీనివాస్, బోధన్ రూర ల్ సీఐ డి. విజయ్‌బాబు, రెంజల్ ఎస్ఐ కె. చంద్ర మోహన్ ఉన్నారు.

*ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ బీసీ రిజర్వేషన్ బిల్లును తక్షణమే భారత రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూడ్‌లో చేర్చాలని ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఓబీసీఎస్ఏ) డిమాండ్ చేసింది. ఇదే డిమాండ్ తో ఏఐఓబీసీఎస్ఏ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఈ నెల 21న సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు.*

## భారతదేశపు సాంస్కృతిక వైవిధ్యాన్ని గౌరవించాలి

- ఆరోగ్యవంతమైన భారతదేశాన్ని నిర్మించుకుందాం
- బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి దిలీప్ ఆచారి



**తాండూరు జూన్ 18(జనంసాక్షి) :** భారతదేశపు సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రతి ఒక్కరు గౌరవించాలని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి దిలీప్ ఆచారి అన్నారు .బుధవారం తాండూరు పట్టణంలోని ఎంపీటీహాల్లో పట్టణ శాఖ అధ్యక్షులు నాగారం మల్లేశం సభ అధ్యక్షుని ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ వికాస్ భారత్ సంకల్ప సభ నిర్వహించారు. వికాస్ భారత్ 2047 ప్రతిజ్ఞ సంకల్పంతో ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి దిలీప్ ఆచారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కును వినియోగించు కోవడంతో పాటు ఇతరులను కూడా ప్రోత్సహించడం ద్వారా మన రాజ్యాంగ ప్రజాస్వామ్య విలువలను కాపాడుతానాని ప్రతిజ్ఞ చేయించారు. పరిశుభ్రతను మరియు ప్రజాసంపద రక్షణను నైతిక బాధ్యతగా గుర్తించాలన్నారు. శుభ్రమైన, అందమైన, అభివృద్ధి చెందిన మరియు ఆరోగ్యవంతమైన భారతదేశాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరు భాగ స్వాములు అవ్వాలని పిలుపునిచ్చారు. జాతి, మతం, భాష, లింగం, ప్రాంతం వంటి వైరుధ్యాలను దాటి, జాతీయ ఐక్యత, సమగ్రత మరియు సోదరభావాన్ని ప్రోత్సహించేందుకు కృషి చేయాలన్నారు. భారతదేశపు సాంస్కృతిక వైవిధ్యాన్ని మరియు సమృద్ధిగల వారసత్వాన్ని గౌరవించాలని సూచించారు. స్త్రీల గౌరవం, మర్యాద, మరియు సాధికారతకు బాధ్యతగా కృషి చేయాలన్నారు. దేశ నిర్మాణానికి కీలకమైన విద్య, పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణ మరియు ఇంధన సామర్ధ్య రంగాలలో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ చురుకుగా పాల్గొన్నాలన్నారు. నిజాయితీతో కూడిన, సమానత్వంతో నిండిన, సామరస్యమైన సమాజ నిర్మాణానికి సహకారాన్ని అందిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు రమేష్ కుమార్, సీనియర్ నాయకులు బాలి శివకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, జిల్లా ఉపాధ్యక్షురాలు అంతారం లలితక్క, జిల్లా కార్యదర్శి బంటారం భద్రేశ్వర్, రాష్ట్ర మహిళా మోర్చా నాయకురాలు సాహు శ్రీలత, సీనియర్ నాయకులు, తాండూరు పట్టణ కమిటీ సభ్యులు, శక్తి కేంద్రం ఇంచార్జిలు, బూత్ అధ్యక్షులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# 133.8 కిలోల గంజాయి దగ్ధం

### కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం

**కరీంనగర్ బ్యూరో, జూన్ 18 (జనంసాక్షి) :**
కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల్లో స్వాధీనం చేసుకున్న 133.8 కిలోల గంజాయిని బుధవారం రోజు ధ్వంసం చేసినట్లు కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌస్ ఆలం ఒక ప్రకటనలో తెలిపారు. మానకొండూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఈదులగట్టెపల్లి గ్రామంలో ఉన్న వెంకటరమణ ఇన్సినేటర్‌లో పోలీస్ కమిషనర్ సమక్షంలో డ్రగ్ డిస్పోసల్ కమిటీ ఆధ్వర్యంలో ఈ గంజాయిని దహనం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు వేణుగోపాల్, విజయ్ కుమార్, ఇన్స్పెక్టర్లు పుల్లయ్య, సంజీవ్, రజినీకాంత్, అలాగే ఇన్సినరేటర్ ప్లాంట్‌కు చెందిన తిరుపతి, ప్రభాకర్ రెడ్డిలతో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిషేధిత మత్తు పదార్థాల విక్రయాలపై కఠిన చర్యలు తప్పవని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం హెచ్చరించారు. కమిషనరేట్ పరిధిలో నార్కోటిక్ సెల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశామని, ఈ సందర్భంగా బుధవారం ఆయన వెల్లడించారు. నార్కోటిక్ జాగిలం 'లియో'తో జిల్లా కేంద్రంలో తనిఖీలను ముమ్మరం చేసినట్లు ఆయన తెలిపారు. కమిషనరేట్ పరిధిలో నిషేధిత గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను నిరోధించడానికి కరీంనగర్ ఒకటవ ఠాణా పోలీసులు బుధవారం విస్తృత



తనిఖీలు నిర్వహించారు. బస్టాండ్, పార్సిల్ కార్యాలయాలు, కిరాణా షాపులు, పాన్ షాపులు, హాస్టళ్లు, అనుమానిత ఇళ్లలో ఎస్సై రాజన్న ఆధ్వర్యంలో ఈ తనిఖీలు జరిగాయి. నార్కోటిక్స్ విభాగంలో ప్రత్యేక శిక్షణ పొందిన పోలీస్ జాగిలం, డాగ్ హ్యాండ్లర్ కానిస్టేబుల్ ఎ.శంకర్ ఈ తనిఖీల్లో పాలుపంచుకున్నారు. ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించి, ఎవరైనా వ్యక్తుల వద్ద ప్రభుత్వం నిషేధించిన గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలు ఉన్నా, వాటిని విక్రయిస్తున్నట్లు సమాచారం ఉన్నా వెంటనే డయల్ 100కు కాల్ చేసి పోలీసులకు తెలియజేయాలని కమిషనర్ గౌస్ ఆలం విజ్ఞప్తి చేశారు. కమిషనరేట్ వ్యాప్తంగా ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.





## మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే మహిళా సాధికారత సాధ్యం

- ఇంట్లోనే మహిళలకు స్వయం ఉపాధి కల్పించేలా ప్రభుత్వం కృషి
- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

**తాండూరు జూన్ 18(జనంసాక్షి) :**
మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం తాండూరు ఎంపీడీవో కార్యాలయంలో యాలాల్, పెద్దేముల్, తాండూరు మండలాల లబ్ధిదారులకు మరియు మున్సిపల్ కార్యాలయంలో తాండూరు పట్టణ లబ్ధిదారులకు అల్పసంఖ్యాక వర్గాల ఆర్థిక సంస్థ ఇందిరమ్మ అల్పసంఖ్యాక మహిళ శక్తి – రేవంత్ అన్నాకా భరోసా పథకం ద్వారా 150 మంది ముస్లిం మహిళలకు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి కుట్టుమిషన్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే మహిళా సాధికారత సాధ్యమన్నారు. ఇంట్లోనే ఉంటూ కుట్టు మిషన్ ద్వారా మహిళలు ఆదాయం ఆర్జించే విధంగా పని చేయాలన్నారు. దీంతో ఆర్థిక స్వావలంబన సాధ్యమవు తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు.
ఫ్రీ బస్సు ఇచ్చిన, సిలిండల్ సబ్సిడీ ఇచ్చిన, ఇందిరమ్మ ఇళ్ళు ఇచ్చిన, వడ్డి లేని రుణాలిచ్చిన మహిళలకే ఇస్తున్నామని తెలిపారు. 150 మంది మహిళలు ఆర్థికంగా ఎదగాలని తెలిపారు. తాండూరు లో నిరుపేదలు ఎక్కువగా ఉన్నారు. 150 కుట్టు మిషన్ లతో పాటు, ఇంకా 200 కుట్టు మిషన్లు మంజూరు చేయాలని అడిగిన వెంబడే మంజూరు చేసిన జిల్లా పిడి రాజేశ్వరికి తాండూరు మహిళ సోదరీమణుల తరుపున ప్రత్యేక్య ధన్యవాదాలు తెలిపారు. రోజురోజుకి డిజైన్‌లు మారుతున్నాయి. తాండూరులో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్ , ఫైనాన్స్ కమిషన్ మెంబర్ రమేష్ మహారాజ్ , జిల్లా మైనారిటీ కార్పొరేషన్ పిడి రాజేశ్వరి, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# గిల్‌తో కోహ్లీ, రోహిత్ లోటు భర్తీ

## గిల్‌పై బట్లర్ ఆకాశమంత ఆశలు



- వన్డే కెప్టెన్సీపై సస్పెన్స్
- వన్డే కెప్టెన్సీ రేసులో ఎవరు?
- భారత జట్టు.. మూడు ఫార్మాట్లు, మూడు కెప్టెన్లు
- జోస్ బట్లర్ ప్రశంసలు

ఇంగ్లండ్ స్టార్ బ్యాటర్ జోస్ బట్లర్, టీమిండియా నయా టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌ను ఆకాశానికెత్తేశాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల నైపుణ్యాలను గిల్ సమన్వయం చేశాడని, వారి లోటును భర్తీ చేయగలడని కొనియాడాడు. భారత్–ఇంగ్లండ్ మధ్య ఐదు టెస్ట్‌ల సిరీస్ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. కోహ్లీ, రోహిత్ టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్ అయిన నేపథ్యంలో, గిల్ సారథ్యంలో టీమిండియా ఈ సిరీస్‌లో బరిలోకి దిగనుంది. బట్లర్ ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో గిల్ గురించి మాట్లాడుతూ, "శుభ్‌మన్ గిల్ అద్భుతమైన ఆటగాడు. మాటల్లో ప్రశాంతంగా, మైదానంలో దూకుడుగా ఉంటాడు. కోహ్లీ, రోహిత్‌ల లక్షణాలు అతనిలో కలిసాయి. ఈ ఇద్దరి దిగ్గజాల నుంచి ఎంతో నేర్చుకున్నాడు, అయినా తన ఆటలో సొంత ముద్ర వేసుకున్నాడు. టెస్ట్ కెప్టెన్సీ అనేది దేశంలో అత్యంత ప్రభావవంతమైన హోదాల్లో ఒకటి. గిల్ క్రీజులో బ్యాటర్‌గా దృష్టి పెడతాడు, తర్వాతే కెప్టెన్సీపై ఫోకస్ చేస్తాడు. రెండు పాత్రలకూ న్యాయం చేస్తాడు," అని ప్రశంసించాడు.

అదే ఇంటర్వ్యూలో బట్లర్, ఐపీఎల్ 2025లో రాజస్థాన్ రాయల్స్ యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ బ్యాటింగ్ గురించి మాట్లాడుతూ, "వైభవ్ బ్యాటింగ్ చూసి ఆశ్చర్యపోయాను. నా కంటే 20 ఏళ్లు చిన్నవాడైనా, 35 బంతుల్లో సెంచరీతో క్రికెట్ ప్రపంచాన్ని సంభ్రమాశ్చర్యానికి గురిచేశాడు," అని అన్నాడు. రోహిత్ శర్మ ఇటీవల టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్ అయ్యాడు. 2024 టీ20 వరల్డ్ కప్ తర్వాత టీ20 నుంచి కూడా తప్పుకున్నాడు. బోర్డర్–గవాస్కర్ ట్రోఫీలో టీమిండియా ఓటమి తర్వాత రోహిత్ టెస్టులకు వీడ్కోలు పలకడం జట్టుపై ప్రభావం చూపనుంది. ఇప్పుడు వన్డే క్రికెట్ నుంచి కూడా రోహిత్ రిటైర్ అయ్యే అవకాశం ఉందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఒకవేళ రోహిత్ వన్డేల్లో కొనసాగినా, కెప్టెన్సీ మార్పు జరిగే సూచనలు ఉన్నాయి. బీసీసీఐ యువ ఆటగాళ్లకు వన్డే కెప్టెన్సీ అప్పగించే అవకాశం ఉంది.

రోహిత్ వన్డే కెప్టెన్సీ నుంచి తప్పుకుంటే, శుభ్‌మన్ గిల్, జస్‌ప్రీత్ బుమ్రా, రిషబ్ పంత్, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా పేర్లు పరిశీలనలో ఉన్నాయి. అయితే, రాహుల్‌కు అవకాశం తక్కువ. హార్దిక్ తరచూ గాయాలతో సతమతమవుతున్నాడు. గిల్, అయ్యర్, పంత్ మధ్య పోటీ ఉండవచ్చు. టెస్టులకు ఇప్పటికే గిల్‌ను కెప్టెన్‌గా నియమించార్న కాబట్టి, వన్డేల్లోనూ అతనే పగ్గాలు చేపట్టే అవకాశం ఎక్కువ. శ్రేయస్ అయ్యర్ ఐపీఎల్‌లో కెప్టెన్సీ నైపుణ్యం, బ్యాటింగ్‌లో సత్తా చాటాడు. దేశవాళీ క్రికెట్‌లోనూ రాణిస్తున్నాడు. పంత్ కూడా రేసులో ఉన్నాడు, కానీ గిల్‌కు అవకాశం ఎక్కువగా కనిపిస్తోంది.

ప్రస్తుతం భారత జట్టుకు మూడు ఫార్మాట్లలో ముగ్గురు వేర్వేరు కెప్టెన్లు ఉన్నారు. వన్డేల్లో రోహిత్ శర్మ, టెస్టుల్లో శుభ్‌మన్ గిల్, టీ20ల్లో సూర్యకుమార్ యాదవ్ సారథ్యం వహిస్తున్నారు. రోహిత్ వచ్చే వన్డే వరల్డ్ కప్ వరకు ఆడతాడని అతని సన్నిహితులు చెబుతున్నారు. అయితే, కెప్టెన్‌గా కొనసాగుతాడని హామీ లేదు. క్రికెట్ ప్రేమికులు ఇప్పటి నుంచే గిల్, అయ్యర్‌లలో ఎవరు వన్డే కెప్టెన్ అవుతారని చర్చలు మొదలుపెట్టారు.



# టెస్టు కెప్టెన్సీని నేనే వద్దనుకున్నా

### స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా

టీమ్‌ఇండియా స్టార్ ప్లేయర్ రోహిత్ శర్మ టెస్టులకు గుడ్ బై చెప్పడంతో జట్టుకు స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రానే కెప్టెన్ అవుతాడని అందరూ భావించారు. అప్పటికే రోహిత్?కు డిప్యూటీగా ఉన్న బుమ్రాకు సెలక్టర్లు కెప్టెన్‌గా ప్రమోషన్ ఇవ్వడం పక్కా అనుకున్నారు. కానీ, యంగ్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ వైపు మొగ్గు చూపిన సెలక్షన్ కమిటీ అతడికి జట్టు పగ్గాలు అప్పగించింది. దీంతో సీనియర్ బుమ్రాను కాకుండా గిల్‌కు నాయకత్వ బాధ్యతలు ఇవ్వడంతో ఆశ్చర్యానికి గురయ్యారు. దీనిపై బుమ్రా తాజాగా స్పందించాడు. టెస్టు కెప్టెన్సీని తానే వద్దనుకున్నట్లు బుమ్రా తెలిపాడు. ఈ విషయాన్ని బీసీసీఐకు ఐపీఎల్ సమయంలోనే చెప్పినట్లు పేర్కొన్నాడు. రీసెంట్‌గా మాజీ ప్లేయర్ దినేశ్ కార్తీక్‌తో ఓ టీవీ కార్యక్రమంలో బుమ్రా మాట్లాడాడు. ఈ సందర్భంగా తాను టెస్టు కెప్టెన్సీని తిరస్కరించడానికి కారణాలు చెప్పాడు. వర్క్? లోడ్ కారణంగానే కెప్టెన్సీ వద్దనుకున్నానని చెప్పాడు. నాయకత్వం కన్నా బౌలింగ్‌కే ప్రాధాన్యం ఇవ్వాలనుకుంటున్నట్లు వివరించాడు. 'నా నిర్ణయం వెనుక పెద్ద పెద్ద కథలు లేవు. కాంట్రవర్సీలు కూడా లేవు. ఐపీఎల్ సమయంలో రోహిత్, విరాట్ రిటైర్ కాకముందే నేను బీసీసీఐతో మాట్లాడాను. ఇంగ్లాండ్‌తో 5మ్యాచ్ ల సిరీస్‌లో నా వర్క్‌లోడ్ గురించి చర్చించా. నా వెన్ను పరిస్థితి గురించి సంబంధిత వ్యక్తులతోనూ మాట్లాడాను. సర్జన్‌ను కూడా సంప్రదించాను. వర్క్‌లోడ్ విషయంలో ఎంత తెలివిగా ఉండాలో వాళ్లెప్పుడూ చెబుతుంటారు. వాళ్లతో చర్చించిన అనంతరం కొంచెం తెలివిగా ఉండాలని నిర్ణయించుకున్నా. ఆ తర్వాత బీసీసీఐతో మాట్లాడా. కెప్టెన్సీ రేస్‌లో నన్ను పరిగణనలోకి తీసుకోవద్దని చెప్పేశా" బీసీసీఐ నాకు కెప్టెన్సీని బాధ్యతలు ఇవ్వాలని భావించింది. కానీ నేనే వద్దన్నాను. ఎందుకంటే, ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో మూడు మ్యాచ్‌లకు ఒకరు, రెండు మ్యాచ్‌లకు ఇంకొకరు కెప్టెన్‌గా ఉండడం కరెక్ట్ కాదు. నేను జట్టు ప్రయోజనాలకే ప్రాధాన్యమిస్తా. కెప్టెన్‌గానే కాదు. ఆటగాడిగా కూడా జట్టుకు ఎంతో చేయగలను. కెప్టెన్సీ ఒక హోదా. కెప్టెన్సీ గొప్ప గౌరవం. బాగా కష్టపడడం వల్లే నాకు ఆ అవకాశం వచ్చింది. నేను ప్లేయర్‌గా జట్టుకు ఎక్కువ సేవ చేయాలనుకుంటున్నా. అది బీసీసీఐ కూడా చెప్పా' అని బుమ్రా వివరించాడు.

## అనికేత్ వర్మ అద్భుత ప్రదర్శన

ఐపీఎల్ 2025వేలంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ (జట్టు కావ్య మారన్ సారథ్యంలో కొనుగోలు చేసిన యువ ఆటగాడు అనికేత్ వర్మ, మహా రాష్ట్ర ప్రీమియర్ లీగ్ 2025లో తన సత్తా చాటాడు. అయితే, అతని అద్భుతమైన బ్యాటింగ్‌కు వానదేవుడు అడ్డు తగిలాడు. పుణెలో జరుగుతున్న 2025లో ఈ సంఘటన జరిగిం ది. అనికేత్ వర్మ కేవలం 39 బంతుల్లోనే 91 పరుగుల మెరుపు ఇన్నింగ్స్ ఆడి, తాను ఎందుకు ఇంతటి చర్చనీయాంశంగా మారాడో నిరూపించాడు. ఈ ఇన్నింగ్స్‌లో అనికేత్ 7 బౌండరీలు, 7 భారీ సిక్సర్లు బాది, మైదానం నలు మూలలా పరుగులు పిండుకు న్నాడు. అతని బ్యాటింగ్ దూకుడు చూస్తుంటే, సులభంగా సెంచరీ సాధించేలా కనిపించాడు. అనికేత్ వర్మ అద్భుతమైన బ్యాటింగ్‌తో అతని జట్టు భారీ స్కోరు దిశగా పయనిస్తున్న సమయంలో, వర్షం అంతరాయం కలిగించింది. దీంతో మ్యాచ్‌ను రద్దు చేయాల్సి వచ్చింది. అనికేత్ శతకాన్ని మిస్ చేసుకోవడం, అతని అభిమాను లతో పాటు క్రికెట్ ప్రేమికులందరికీ నిరాశను కలిగించింది. అయినప్ప టికీ, అతని ఈ మెరుపు ఇన్నింగ్స్ అతని ప్రతిభను మరోసారి చాటి చెప్పింది.

## సూపర్ సెంచరీతో మ్యాక్స్‌వెల్ వరల్డ్ రికార్డ్

ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ అదరగొట్టాడు. అమెరికా డొమెస్టిక్ లీగ్ మేజర్ లీగ్ క్రికెట్‌లో జరిగిన తాజా మ్యాచ్‌లో మ్యాక్సీ విధ్వంసం సృష్టించాడు. ఈ టోర్నీలో వాషింగ్టన్ ఫ్రీడమ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న మ్యాక్స్‌వెల్, లాస్ ఏంజెలెస్‌తో జరిగిన మ్యాచ్‌లో సెంచరీతో కదం తొక్కాడు. 49 బంతుల్లోనే 106 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఈ క్రమంలోనే రోహిత్ శర్మ రికార్డ్ సమం చేశాడు.టీ20 కెరీర్‌లో తాజా సెంచరీ మ్యాక్స్‌వెల్‌కు ఎనిమిదో శతకం. దీంతో టీ20 క్రికెట్‌లో అత్యధిక శతకాలు బాదిన నాలుగో బ్యాటర్‌గా నిలిచాడు. ఈ క్రమంలోనే స్టార్లు రోహిత్ శర్మ, డేవిడ్ వార్నర్, ఆరోన్ ఫించ్, జాస్ బట్లర్ రికార్డును సమం చేశాడు. ఈ నలుగురు ప్లేయర్లు కూడా టీ20ల్లో ఇప్పటికే నాలుగేసి శతకాలు బాదారు. తాజా ఇన్నింగ్స్‌తో మ్యాక్స్‌వెల్ ఈ స్టార్ ప్లేయర్ల సరసన చేరాడు. ఈ లిస్ట్‌లో 22 సెంచరీలతో వెస్టిండీస్ స్టార్ క్రిస్ గేల్ టాప్‌లో ఉన్నాడు. ఆ తర్వాత బాబర్ అజామ్ (11), టీమ్‌ఇండియా స్టార్ విరాట్ కోహ్లీ (9), రెలీ రొసో (9) ఉన్నారు. ఈ ఇన్నింగ్స్‌తో మ్యాక్స్‌వెల్ టీ20ల్లో 10500 పరుగులు పూర్తి చేసుకున్నాడు. అలాగే అతడి ఖాతాలో 170 టీ20 వికెట్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆసీస్ స్టార్ వరల్డ్ రికార్డ్ సాధించాడు. టీ20ల్లో 10500 పరుగులు, 170ం వికెట్లు, ఐదు సెంచరీలు సాధించిన ఏకైక ప్లేయర్‌గా రికార్డు నెలకొల్పాడు.ఇక మ్యాక్సీ ఇన్నింగ్స్ విషయానికొస్తే, ఈ మ్యాచ్‌లో తొలి 15 బంతుల్లో 11 పరుగులే చేశాడు. ఆ తర్వాత 34 బంతుల్లో 95 రన్స్‌తో రఫ్ఫాడించాడు. ఈ ఇన్నింగ్స్‌లో 2 ఫోర్లు, ఏకంగా 13 సిక్స్‌లతో బీభత్సం సృష్టించాడు. దీంతో వాషింగ్టన్ 208 పరుగులు చేసింది. అనంతరం ఛేదనలో లాస్ ఏంజెలెస్ 95 పరుగులకే కుప్పకూలింది.

## పేసర్ హర్షిత్ రాణాకు గోల్డెన్ ఛాన్స్

### భారత్- ఇంగ్లాండ్ టెస్టు సిరీస్‌కు ఎంపిక



టీమ్‌ఇండియా యంగ్ పేసర్ హర్షిత్ రాణాకు గోల్డెన్ ఛాన్స్ దక్కింది. అతడు ఇంగ్లాండ్ టెస్టు సిరీస్‌లో తొలి మ్యాచ్‌కు ఎంపికయ్యాడు. భారత్ జట్టులో అతడిని చేర్చుతున్నట్లు బీసీసీఐ తాజాగా వెల్లడించింది. ఈ మేరకు ఓ పోస్ట్ సోషల్ మీడియాలో షేర్ చేసింది. 'ఇంగ్లాండ్‌తో తొలి టెస్టు కోసం హర్షిత్ రానా టీమ్‌ఇండియాతో చేరనున్నాడు' అని ట్వీట్ చేసింది.అయితే ఇటీవల ఇండియా ఏ జట్టుకు ఎంపికైన హర్షిత్ ప్రస్తుతం ఇంగ్లాండ్‌లోనే ఉన్నాడు. అక్కడ ఇండియా ఏ తరఫున ఆడిన రాణాను బీసీసీఐ తిరిగి భారత్‌కు పంపలేదు. అలాగే వర్క్ లోడ్ కారణంగా బుమ్రా ఆడని మ్యాచ్‌ల్లో హర్షిత్ బరిలో దిగే ఛాన్స్ ఉంది. కాగా, హర్షిత్ గతేడాది ఆస్ట్రేలియా సిరీస్‌లో టెస్టు అరంగేట్రం చేశాడు. కానీ ఆ సిరీస్‌లో పెద్దగా ప్రభావం చూపలేదు. 2 మ్యాచ్‌ల్లో నాలుగే వికెట్లు పడగొట్టాడు.

**తొలి టెస్టుకు భారత జట్టు :** శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషబ్ పంత్ (వైస్ కెప్టెన్), యశస్వీ జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, నితీష్ రెడ్డి, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్, వాషింగ్టన్ సుందర్, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాష్ దీప్, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా

**భారత్‌తో తొలి టెస్టుకు ఇంగ్లాండ్ జట్టు :** షోయబ్ బషీర్, జాకబ్ బెథెల్, హ్యారీ బ్రూక్, బ్రైడన్ కార్సే, సామ్ కుక్, జాక్ క్రాలే, బెన్ డకెట్, జామీ ఓవర్టన్, ఆలీ పోప్, జో రూట్, జామీ స్మిత్ (వికెట్), బెన్ స్టోక్స్ (కెప్టెన్), జోష్ టోక్స్, క్రిస్

## నాలుగు రోజుల టెస్టులకు ఐసీసీ ఆమోదం

### 2027-29 డబ్ల్యూటీసీ నుంచి అమలు



అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) నాలుగు రోజుల టెస్టు మ్యాచ్‌లకు పచ్చజెండా ఊపినట్లు సమాచారం. ఈ నిర్ణయం 2025-27 ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) నుంచి కాకుండా, 2027-29 డబ్ల్యూటీసీ సైకిల్ నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. చిన్న దేశాల క్రికెట్ బోర్డులకు లబ్ధి చేకూర్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే, భారత్, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా వంటి పెద్ద దేశాలు ఇప్పటిలాగే ఐదు రోజుల టెస్టులను కొనసాగించనున్నాయి.

నాలుగు రోజుల టెస్టులతో తక్కువ సమయంలో ఎక్కువ మ్యాచ్‌లు ఆడే అవకాశం చిన్న దేశాలకు లభిస్తుందని ఐసీసీ భావిస్తోంది. చిన్న బోర్డులకు ఐదు రోజుల టెస్టుల నిర్వహణ ఆర్థికంగా భారంగా మారుతోంది. అంతేకాక, చిన్న దేశాల మధ్య టెస్టు మ్యాచ్‌లు తరచూ మూడు లేదా నాలుగు రోజుల్లోనే ముగిసిపోతున్నాయి. ఈ నేపథ్యంలో, నాలుగు రోజుల టెస్టులకు డిమాండ్ పెరిగింది. తాజా డబ్ల్యూటీసీ చాంపియన్ సౌతాఫ్రికా కూడా ఈ ప్రతిపాదనకు మద్దతు తెలిపినట్లు తెలుస్తోంది. గత వారం జరిగిన 2023–25 డబ్ల్యూటీసీ ఫైనల్ సందర్భంగా నాలుగు రోజుల టెస్టులపై చర్చ జరిగింది. ఐసీసీ చైర్మన్ జై షా ఈ ప్రతిపాదనకు సూత్రప్రాయంగా అంగీకరించినట్లు సమాచారం. చాలా కాలంగా ఈ విషయంపై చర్చలు జరుగుతున్నాయి, కొన్ని బోర్డులు ఐసీసీపై ఒత్తిడి తెస్తున్నాయి. మరో రెండేళ్లలో నాలుగు రోజుల టెస్టులు అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. నాలుగు రోజుల టెస్టులు 2017లోనే ప్రయోగాత్మకంగా ఆమోదం పొందాయి. గత నెలలో ఇంగ్లండ్ జింబాబ్వేతో నాలుగు రోజుల టెస్టు ఆడగా, 2019, 2023లో ఐర్లాండ్‌తో కూడా ఇంగ్లండ్ ఇలాంటి మ్యాచ్‌లు ఆడింది. అయితే, ఈ విధానంపై గతంలో విమర్శలు కూడా వచ్చాయి. భారత మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ నాలుగు రోజుల టెస్టులను వ్యతిరేకించాడు. టెస్టు క్రికెట్ ఐదు రోజుల పాటు సాగాలని పట్టుబట్టాడు.

2025–27 డబ్ల్యూటీసీ సైకిల్ మంగళవారం శ్రీలంక–బంగ్లాదేశ్ మధ్య తొలి టెస్టుతో ప్రారంభమైంది. ఈ సైకిల్‌లో మొత్తం 27 టెస్టు సిరీస్‌లు జరగనున్నాయి, అందులో 17 సిరీస్‌లు రెండు టెస్టులవి, ఆరు సిరీస్‌లు మూడు టెస్టులవి. ఇంగ్లండ్, భారత్, ఆస్ట్రేలియా మాత్రమే ఒకదానితో ఒకటి ఐదు టెస్టుల సిరీస్‌లు ఆడనున్నాయి.

2023–25 డబ్ల్యూటీసీ ఫైనల్‌లో సౌతాఫ్రికా, డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాను ఓడించి, 27 ఏళ్ల తర్వాత తమ తొలి ఐసీసీ టైటిల్ సాధించింది. ఈ విజయం నాలుగు రోజుల టెస్టులకు వారి మద్దతును మరింత బలపరిచినట్లు కనిపిస్తోంది.






# సింగరేణి వ్యయ నియంత్రణ చర్యలకు జాతీయ స్థాయి గుర్తింపు

- ప్రతిష్టాత్మక ఐసీఎంఏఐ పురస్కారానికి ఎంపిక
- మెగా పరిశ్రమల విభాగంలో మూడో బహుమతి కైవసం
- 23న ఢిల్లీలోని విజ్ఞాన భవన్‌లో ప్రదానం
- సంస్థ సీఎండీ ఎన్. బలరామ్ హర్షం



**గోదావరిఖని, జనంసాక్షి :**
సింగరేణి అవలంబిస్తున్న వ్యయ నియంత్రణ చర్యలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. దేశంలో పార్లమెంటు చట్టం క్రింద ఏర్పడిన చట్టబద్ధ ప్రతిష్టాత్మక సంస్థ అయిన ఇన్స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఎంఏఐ) వారు ఏటా ప్రదానం చేసే జాతీయ స్థాయి పురస్కా రానికి సింగరేణి ఎంపికైంది. సింగరేణి అనుసరిస్తున్న వ్యయ నియంత్రణను ప్రశంసిస్తూ మెగా పరిశ్రమల విభాగంలో ఐసీఎంఏఐ తృతీయ బహుమతికి ఎంపిక చేసినట్లు ఐసీఎంఏఐ పేర్కొంది. 2024 సంవత్సరానికి గాను నేషనల్ అవార్డు ఫర్ ఎక్స్ లెన్స్ ఇన్ కాస్ట్ మేనేజ్మెంట్లో తృతీయ బహుమతికి సింగరేణిని ఎంపిక చేసినట్లు ఐసీఎంఏఐ అధ్యక్షులు శ్రీ సి.ఎం.ఎ. బిభూతి భూషణ్ నాయక్ పేర్కొన్నారు. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, నేషనల్ కంపెనీ లా అప్పీలెట్ ట్రిబ్యూనల్ ఛైర్పర్సన్ జస్టిస్ ఎస్.జె. ముఖోపాధ్యాయ నేతృత్వంలోని న్యాయ నిర్ణేతల బృందం సింగరేణిని మూడవ బహుమతికి ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఈ నెల 23వ తేదీన సాయంత్రం ఢిల్లీలోని విజ్ఞాన భవన్లో బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. అదే రోజు ఉదయం విజ్ఞాన భవన్ లో రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా పాల్గొనే 12వ జాతీయ విద్యార్థుల స్నాతకోత్సవంలో బహుమతి గ్రహీతలు కూడా పాల్గొనాల్సిందిగా కోరారు.

ప్రభుత్వ సంస్థల్లో మెగా పరిశ్రమల విభాగంలో అనేక పరిశ్రమలు ఉండగా వీటిలో ఖర్చు నియంత్రణలో సింగరేణి సంస్థకు మూడో స్థానం లభించడం పట్ల ఛైర్మన్ శ్రీ ఎన్. బలరామ్ తన సంతోషం వ్యక్తం చేశారు. ఇది సింగరేణి ఉద్యోగులు, అధికారుల సమష్టి కృషికి లభించిన గుర్తింపు అని పేర్కొన్నారు. ఛైర్మన్ గానే కాక, డైరెక్టర్ ఫైనాన్స్ గా ఏడు సంవత్సరాలుగా విశేష సేవలు అందిస్తున్న శ్రీ ఎన్. బలరామ్ ఖర్చు నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆర్థికపరమైన అంశాల్లో పలు సంస్కరణలను తీసుకొచ్చారు. ముఖ్యంగా ఉత్పత్తి ఖర్చులు తగ్గించడం కోసం పలు రకాల చర్యలు తీసుకున్నారు. బొగ్గు, ఓవర్ బర్డెన్ తొలగింపులో తీసుకున్న ఆర్థిక వెసులుబాటు చర్యలు ఉత్పత్తి, ఉత్పాదకతలు పెంచడానికి ఎంతగానో దోహదపడ్డాయి.


భారీ యంత్రాలకు కావలసిన విడి భాగాలను గతంలో ఇబ్బడి ముబ్బడిగా కొంటుండేవారు, అయితే స్పేర్ పార్ట్ను కచ్చితంగా ఎన్ని అవసర మో అంచనా వేసి అన్ని మాత్రమే కొనడం వల్ల భారీ వ్యయ నియంత్రణ సాధించగలిగారు. ఇవే కాకుండా ప్రతీ విభాగంలో వృథాను అరికట్టారు. గనుల వారీగా వ్యయ నియంత్రణ చర్యలు చేపట్టారు. ఇది మంచి ఫలితాలను ఇచ్చింది. వీటన్నిటికన్నా ముఖ్యంగా సింగరేణి సంస్థలోని అన్ని రకాల ఆర్థిక వ్యవహారాలను ఎస్.ఎ.పి ద్వారా నిర్వహించడం వల్ల దుబారాకు అవకాశం లేకుండా, అన్ని వ్యవహారాలు పారదర్శకంగా నిర్వహించబడుతున్నాయి. బొగ్గు అమ్మకాలు, సింగరేణికి కావలసిన యంత్రాలు, వస్తువుల కొనుగోళు ,, సింగరేణి పొందే సేవలు , కార్మికుల జీత భత్యాలు, అలవెన్స్ లు, బోనస్ లు, ఇలా కీలకమైన విభాగాల్లో అన్ని రకాల ఆర్థిక లావాదేవీలను ఎస్.ఎ.పి ద్వారా నిర్వహిస్తూ పెద్ద ఎత్తున వ్యయ నియంత్రణ సాధించబడింది.

# తెలంగాణ బీసీ రిజర్వేషన్ బిల్లును

### తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలి : ఏఐఓబీసీఎస్ఏ

తెలంగాణ బీసీ రిజర్వేషన్ బిల్లును తక్షణమే భారత రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూడ్‌లో చేర్చాలని ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఓబీసీఎస్ఏ) డిమాండ్ చేసింది. ఇదే డిమాండ్‌తో ఏఐఓబీసీఎస్ఏ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఈ నెల 21న సత్యాగ్రహ దీక్ష నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు కిరణ్ కుమార్, జాతీయ కార్యదర్శి మహేశ్ గౌడ్ తెలిపారు. దీక్షకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్, మహేశ్ గౌడ్ మాట్లాడుతూ బీసీలకు విద్య, ఉద్యోగాలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీని కోసమే దీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఉద్యమానికి బీసీ మేధావులు, బీసీ సంఘాలు, విద్యార్థి సంఘాలు, సామాజిక ఉద్యమకారులు పెద్ద ఎత్తున తరలివచ్చి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ బిల్లును తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ బిల్లుతోనైనా బీసీలకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై స్పందించని పక్షంలో ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఓబీసీఎస్ఏ నాయకులు లక్కీ, రామ్ గౌడ్, ప్రశాంత్, కళ్యాణ్ యాదవ్, శివ యాదవ్ పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రయోజనాలు కాపాడాలన్న తపనే లేదు : హరీశ్‌రావు



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాజకీయ లబ్ధి పొందాలన్న వక్ర బుద్ధే తప్పా.. తెలంగాణ నీటి ప్రయోజనాలు కాపాడాలనే తపన లేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. సీఎం రేవంత్ అబద్ధాలపై ప్రవాహంపై ఆయన ధ్వజమెత్తారు. బోడిగుండుకు మోకాలుకు లంకె పెట్టి మాట్లాడటంలో రేవంత్ రెడ్డి సిద్ధహస్తుడని అని మరోసారి రుజువైంది. అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌లో కేసీఆర్ చెప్పిన వాటిని దురుద్దేశపూర్వకంగా వక్రీకరించాడని ధ్వజమెత్తారు. ప్రజలను తప్పుదారి పట్టించేందుకు ఉద్దేశపూర్వకంగా అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌లోని అజెండా ఐదు అంశాలు దాచి పెట్టి, అజెండా నెంబర్ వన్ మాత్రమే అంశాలను మాత్రమే ప్రస్తావించాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. గోదావరి–కృష్ణ నదుల అనుసంధానం ప్రాజెక్టుల విషయంలో తెలంగాణను సంప్రదించకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ ముందుకు పోకూడదని.. ఒకవేళ వెళ్తే అందుకు తెలంగాణ అంగీకరించదని.. ఆనాడు కేసీఆర్ అజెండాలో స్పష్టంగా పేర్కొన్నారని చెప్పారు. ఈ విషయాన్ని కావాలని దాచిపెట్టి, స్వార్థపూరిత రాజకీయ లక్ష్యాల కోసం అసత్యాలను ప్రజల ముందు ఉంచారని మండిపడ్డారు. మీడియాను సైతం తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని.. అబద్ధాల పునాదులపై జరిగిన ఈనాటి రేవంత్ తతంగాన్ని ప్రజలు విశ్వసించరన్నారు.

### ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నడుస్తున్న

# శ్లోక స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

### ఏబీవీపీ పాలమూరు జిల్లా కన్వీనర్ సతీష్

**జడ్చర్ల, జూన్ 18 (జనం సాక్షి):** ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నడుస్తున్న శ్లోక స్కూల్ పై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ పాలమూరు జిల్లా కన్వీనర్ సతీష్ డిమాండ్ చేశారు. బుధవారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) జడ్చర్ల శాఖ ఆధ్వర్యంలో శ్లోక హైస్కూల్లో అక్రమంగా అమ్ముతున్నటువంటి పుస్తకాలు, నోటు బుక్కులు, డైరీలను సీజ్ చేయించారు. ఈ సందర్భంగా పాలమూరు జిల్లా కన్వీనర్ సతీష్ మాట్లాడుతూ పాలమూరు జిల్లా వ్యాప్తంగా అనుమతి లేకుండా నడుపుతున్నటువంటి పాఠశాలలో మౌలిక సదుపాయాలు లేకున్నా, అధికారులు చూసి చూడనట్టు ఉంటున్నారని, కేవలం అడ్మిషన్ల కోసం ప్రైవేటు యాజమాన్యాలు తల్లిదండ్రులను ఇబ్బంది పెడుతున్నారనీ, బుక్స్,బెల్టు, బ్యాచ్ అధిక ధరలకు అమ్ముతూ విద్యార్థుల తల్లిదండ్రులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. జడ్చర్ల పట్టణంలో, జిల్లా కేంద్రంలో కొత్తగా వస్తున్నటువంటి స్కూల్స్ ఎలాంటి మౌలిక సదుపాయాలు, అనుమతులు లేకుండా, నడుస్తున్న అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. పేద మధ్యతరగతి విద్యార్థులను ప్రవేట్ యజమాన్యాలు తీవ్ర ఇబ్బందికి గురిచేస్తున్నాయని, జిల్లా విద్యాశాఖ అధికారి స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివ, విజయ్, పాండు కృష్ణ కాంత్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నను హత్య చేసిన తమ్ముళ్లు



**మహబుబబాద్ :** భూ వివాదంలో సొంత తమ్ముళ్ల చేతిలో ఓ అన్న ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా సీరోలు మండల కేంద్రంలో బుధవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సీరోలు మండల కేంద్రానికి చెందిన వల్లపు లింగయ్యకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య మాణిక్యమ్మకు ఒక కొడుకు కృష్ణ (43), ముగ్గురు కుమార్తెలు ప్రమీల, రమణ, వినోద రెండో భార్య నర్సమ్మకు ఇద్దరు కొడుకులు నరేశ్, మహేశ్ ఉన్నారు. లింగయ్యకు గ్రామ ప్రధాన రహదారికి ఆనుకుని పదహారు ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది. కొన్నేళ్ల కిందట లింగయ్య కొంత భూమిని కొడుకులకు, రమణ అనే కుమార్తెకు పట్టా చేశాడు. మిగతా భూమిని రోడ్డు వైపులా ఉండేలా పంపకం చేయడంతో.. రెండో భార్య కొడుకులు తండ్రితో తరచూ గొడవ పడుతూ వచ్చారు. ఈ వివాదం పలు పంచాయతీలకూ, పోలీస్ స్టేషన్లకు వెళ్లినా పరిష్కారం కాలేదు. మృతుడు కృష్ణ భార్య సత్యవతి, కుమారుడు మిన్ను, కుమార్తెతో కలిసి హైదరాబాద్‌లో జీవిస్తున్నారు. కృష్ణ హైదరాబాద్ నుంచి మంగళవారం సీరోలుకు వచ్చారు. బుధవారం ఉదయం వ్యవసాయ భూమివద్దకు వెళ్లారు. వ్యవసాయ భూమి వద్ద ముందే నరేశ్, మహేశ్, వారి భార్యలు, నరేశ్ బావమరిది వీరన్న కలిసి ఘర్షణకు దిగారు. గొడవ జరుగుతుండగా విషయం తెలుసుకున్న తండ్రి లింగయ్య అక్కడకు చేరుకుని వారిని ఆపే ప్రయత్నం చేశారు. గొడవ ముదిరిపోవడంతో నరేశ్ ముందుగా తెచ్చుకున్న కత్తితో అన్నయ్య కృష్ణ మెడపై దారుణంగా నరికాడు.

# పెద్దధన్వాడ రైతులకు సంకెళ్లు



## జైలు నుంచి అలంపూర్ కోర్టుకు తరలింపు

**ముగ్గురు అధికారులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ**

**బేడీలు వేయడంపై మండిపడ్డ ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు**

**ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టిన రైతులను కోర్టుకు తీసుకొచ్చే క్రమంలో బేడీలు వేయడం సంచలనంగా మారింది. అరెస్టయిన 12 మంది రైతులను మహబూబ్‌నగర్ జైలు నుంచి అలంపూర్ కోర్టుకు సంకెళ్లు వేసి తరలించడం పట్ల తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో స్పందించిన జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ఒక ఆర్ఎస్సై, ఇద్దరు ఏఆర్ఎస్సైను సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ టి శ్రీనివాస రావు ఉత్తర్వులు జారీ చేశారు. రాజోలి పోలీస్ స్టేషన్ కు సంబంధించిన కేసులోని వ్యక్తులను అధికారుల సూచనలు పాటించకుండా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముగ్గురు అధికారులను సస్పెండ్ చేసినట్లు ఆయన వెల్లడించారు.**

**- గద్వాల/అలంపూర్, జూన్ 18 (జనంసాక్షి) :**



పెద్ద ధన్వాడలో ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా ఆందోళన చేసిన 12 మంది అన్నదాతలపై పోలీసులు కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. బుధవారం రిమాండ్ ముగియడంతో వారిని మహబూబ్‌నగర్ కోర్టు నుంచి అలంపూర్ కోర్టులో హాజరు పరిచేందుకు పోలీసులు తీసుకెళ్లారు. అయితే రాజోలి రైతులకు సంకెళ్లు వేసి అలంపూర్ కోర్టులో హాజరుపరచడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. నేరస్తుల లాగా రైతులకు బేడీలు వేసి కోర్టులో హాజరు పరచడాన్ని అన్నదాతలు తప్పుబడుతున్నారు. ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా పోరాడి జైలుకు వెళ్లిన 12మంది రైతులకు మంగళవారమే బెయిల్ మంజూరైంది. బెయిల్ వచ్చాక కూడా రైతులకు బేడీలు వేయడం ఎంతవరకు సమంజసం అని ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు మండిపడుతున్నాయి.

### సీఎం రాక్షస మనస్తత్వం : కేటీఆర్

పెద్ద ధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పోరాడిన రైతుల చేతికి సీఎం రేవంత్ బేడీలు వేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఈ ఘటనపై ఆయన ఎక్స్ వేధికగా స్పందించారు. అలంపూర్ కోర్టు వద్ద అన్నదాతలకు పోలీసులు సంకెళ్లు వేసిన సీఎం రాక్షస మనస్తత్వానికి పరాకాష్ట అంటూ మండిపడ్డారు. పెద్ద ధన్వాడలో గత కొన్ని నెలలుగా ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న అనేక గ్రామాల ప్రజలపై అక్రమ కేసులు పెట్టి వేధించడమే దారుణమైతే, చివరికి దొంగలు, నేరస్తుల లాగా బేడీలు వేయడం క్షమించరాని నేరం అన్నారు. గతంలో లగచర్లలో అల్లుడి ఫార్మా కంపెనీని అడ్డుకున్నారనే కోపంతో గుండెపోటు వచ్చిన రైతుపై కనికరం లేకుండా బేడీలు వేసి సీఎం మహా పాపాన్ని మూటగట్టుకున్నారని తెలిపారు. పెద్ద ధన్వాడ విషయంలో ఇంత నిరంకుశంగా వ్యవహరిస్తున్న రేవంత్ రెడ్డికి అన్నదాతల చేతిలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. సీఎం కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతుంది కాబట్టి వెంటనే రైతులందరికీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## పౌర హక్కుల సంఘం నేతలు అరెస్ట్



పెద్ద ధన్వాడకు వెళ్తుండగా అడ్డుకున్న పోలీసులు

**గద్వాల నడిగడ్డ, జూన్ 18 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండల పరిధిలోని పెద్ద ధన్వాడ గ్రామానికి వెళుతున్న పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మన్, ప్రధాన కార్యదర్శి నారాయణరావు, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎండి సుభాన్, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కా బాలయ్య, వెంకటేష్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం ఉదయం 11 గంటల సమయంలో ఎర్రవల్లి చౌరస్తాలో అక్రమంగా అరెస్టు చేసి ఇటిక్యాల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారిని వెంటనే విడుదల చేయాలని ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కో కన్వీనర్ శంకర ప్రభాకర్ డిమాండ్ చేశారు. పెద్ద ధన్వాడలో ఇథనాల్ కంపెనీ యాజమాన్యం రైతులపై పెట్టిన అక్రమ కేసుల విషయంలో ఆ గ్రామానికి వెళ్తున్న పౌర హక్కుల నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ప్రజా సంఘాలు, విద్యార్థి, కార్మిక కర్షక, మేధావులు ఖండించాలని శంకర ప్రభాకర్ డిమాండ్ చేశారు.

**ఇథనాల్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి అమ్ముడుపోయిన సర్కార్ : కురువ విజయ్ కుమార్**



రైతులను కోర్టుకు తీసుకొచ్చిన సందర్భంలో అన్నదాతల చేతులకు సంకెళ్లు వేసిన పోలీసులను తక్షణమే సస్పెండ్ చేయాలనీ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు డా.కురువ విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూరు రైతుల మీద పగబట్టారని, మొన్న కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల గిరిజన రైతు బిడ్డలకు కూడా బేడీలు వేసి జైళ్లకు పంపిన చరిత్ర రేవంత్ రెడ్డి ప్రభుత్వానిదని అన్నారు. తక్షణమే రాజోలి మండలం పెద్ద ధన్వాడ రైతులకు క్షమాపణ చెప్పాలని, వారిని వెంటనే విడుదల చేయాలని, వారిపై పెట్టిన అక్రమ కేసులను కొట్టివేయాలని డిమాండ్ చేశారు.

**పాలమూరు రైతులపై పగెందుకు : పచ్చర్ల శ్రీనివాసులు**

అన్నదాతలకు సంకెళ్లు వేసిన సర్కారు.. ఉమ్మడి పాలమూరు రైతులపై పగబట్టినట్టు అనిపిస్తోందని బిఆర్ఎస్ పార్టీ రాజోలి మండల అధ్యక్షులు పచ్చర్ల శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. మొన్న ఫార్మా కంపెనీ అడ్డుకున్నందుకు, ఈరోజు ఇథనాల్ ఫ్యాక్టరీని వ్యతిరేకించినందుకు రైతులకు బేడీలు వేశారని, ఇది రైతు ప్రభుత్వమేనా అని ప్రశ్నించారు. తక్షణమే రాజోలి రైతాంగానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## ఇకపై గ్రామీణ తాగునీటి సమస్య ఫిర్యాదుల కోసం నాలుగు అంకెల టోల్ ఫ్రీ నంబర్

**హైదరాబాద్ (జనంసాక్షి) :** మిషన్ భగీరథ శాఖలో ప్రజల గ్రామీణ తాగునీటి సమస్య ఫిర్యాదులను పరిష్కరించడానికి 1800-599-4007 (11-అంకెల) టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులో ఉంది. మిషన్ భగీరథ ఈ టోల్ ఫ్రీ నంబర్ సేవలు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఉపయోగించుకుంటున్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలకు చెందినవారు, పైన చూపిన 11-అంకెల టోల్ ఫ్రీ నంబర్‌కు డయల్ చేయడంలో ఇబ్బందిని ఎదుర్కొంటున్నందున, మిషన్ భగీరథ విభాగం గ్రామీణ ప్రజల తాగునీటి సమస్య ఫిర్యాదులను నమోదు చేసుకొనడానికి ప్రస్తుతం ఉన్న 1800-599-4007 (11-అంకెల) టోల్ ఫ్రీ నంబర్ కు బదులుగా నాలుగు అంకెల 1916 (4-అంకెల) నంబర్ తో ఫిర్యాదులను నమోదు చేసుకునే సౌకర్యం కల్పించడం జరిగింది. ఈ నాలుగు అంకెల 1916 (4-అంకెల) టోల్ ఫ్రీ నంబర్ తో ప్రజలు రాష్ట్రంలో ఎక్కడి నుండైనా తమ తాగునీటి సమస్య ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చు

## ఇక ఫాస్టాగ్ పాస్‌లు రానున్నాయి

**3వేల పాస్‌తో 200 ట్రిప్పులు ఫ్రీ : కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ**

**న్యూఢిల్లీ, జూన్ 18 (జనంసాక్షి) :** ఫాస్టాగ్ యూజర్లకు కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. కేవలం రూ. 3వేలు రీచార్జ్‌తో ఫాస్టాగ్ వార్షిక పాస్ అందుబాటులోకి తెస్తున్నట్లు ప్రకటించింది. ఈ పాస్ తీసుకుంటే 200 ట్రిప్పుల వరకు ప్రయాణించే అవకాశం ఉన్నట్లు ఈ మేరకు కేంద్ర మంత్రి గడ్కరీ ఒక ప్రకటన విడుదల చేశారు. ఏడాదికి రూ. 3వేలు రీచార్జ్ చేసుకుని దేశంలో ఎక్కడైనా తిరిగే అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆగష్టు 15 నుంచి ఈ విధానాన్ని అమలులోకి తీసుకువస్తున్నట్లు గడ్కరీ ప్రకటించారు. ఇక ఈ పాస్ దేశవ్యాప్తంగా ఏ రహదారిపైన ప్రయాణించినా చెల్లుబాటు అవుతుంది. దేశంలో జాతీయ రహదారులపై నిర్బంధ రహిత ప్రయాణాన్ని లక్ష్యంగా పెట్టుకుని, ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్‌ను ప్రవేశపెడుతున్నట్లు కేంద్ర మంత్రి ప్రకటించారు. వాణిజ్యేతర, వ్యక్తిగత వాహనాలకు ఈ అవకాశం కల్పిస్తున్నట్లు ఎక్స్ లో పేర్కొన్నారు. ఫాస్ట్‌ట్యాగ్ అనేది ఒక చిన్న ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్ సిస్టమ్. ఇది రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ సాంకేతికతను ఉపయోగించి వాహనాల టోల్ రుసుములను ఆటోమేటిక్‌గా చెల్లించడానికి వీలు కల్పిస్తుంది. దీనిని వాహనం విండ్‌స్క్రీన్‌పై అటాచ్ చేసుకుంటారు. టోల్ ప్లాజాల వద్ద ఎక్కువ సేపు ఆగకుండా టోల్ చెల్లించడానికి అనుమతిస్తుంది.

## ఆర్టీసీ తొలి మహిళా డ్రైవర్‌కు సీతక్క అభినందన

**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ ఆర్టీసీలో తొలి మహిళా డ్రైవర్ గా సేవలందిస్తున్న సరితను మంత్రి సీతక్క శాలువాతో సత్కరించి అభినందించారు. సరిత ఆదర్శంగా సెర్ఫ్ ద్వారా మహిళలకు బస్ డ్రైవింగ్ లో శిక్షణ ఇస్తామని వెల్లడించారు. మహిళ డ్రైవింగ్ శిక్షణకు రోల్ మోడల్‌గా సరితను నియమిస్తామన్నారు. సరిత ఆదర్శంగా మహిళలు డ్రైవింగ్ తోపాటు అని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఎంవోడబ్ల్యూఓ స్వచ్ఛంద సంస్థ సహకారంతో మహిళలకు ఉచిత బస్ డ్రైవింగ్ శిక్షణ కార్యచరణను ఆవిష్కరించారు. త్వరలో సెర్ఫ్ ద్వారా ఆసక్తిగల మహిళలకు భారీ వాహనాల డ్రైవింగ్లో ఉచిత శిక్షణ కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు.

**మహిళలకు ఉచిత బస్ డ్రైవింగ్ పోస్టర్ ను ఆవిష్కరించిన మంత్రి సీతక్క**

సెర్ఫ్ ద్వారా మహిళలకు అందించే భారీ వాహన డ్రైవింగ్ ఉచిత శిక్షణ కు రోల్ మోడల్ గా తెలంగాణ ఆర్టీసీ లో తొలి మహిళా డ్రైవర్ వాంకుడోత్ సరితానాయక్‌ను మంత్రి సీతక్క ప్రకటించారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వంతో చర్చించి ఆర్టీసీలో మహిళా డ్రైవర్ల రిక్రూట్ చేసే విధంగా నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆర్టీసీలో మహిళా డ్రైవర్లు ఉంటే మహిళా ప్రయాణికులు మరింత భద్రతగా, సంతోషంగా ఫీల్ అవుతారని పేర్కొన్నారు.



## జైలు నుంచి పెద్దధన్వాడ రైతులు విడుదల

రాజోలి మండలం ధన్వాడలో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఆందోళన చేసి జైలుకి వెళ్లినా రైతులు బుధవారం మహబూబ్ నగర్ జిల్లా జైలు నుంచి విడుదల అయ్యారు. దీంతో పెద్దధన్వాడ గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

- రాజోలి (జనంసాక్షి)

## కేంద్ర జలశక్తి మంత్రిని కలిసిన కిషన్ రెడ్డి



**న్యూఢిల్లీ, జూన్18 (జనంసాక్షి) :** కేంద్ర జలశక్తి మంత్రి శ్రీ సీఆర్ పాటిల్‌ను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు శ్రీ జి.కిషన్ రెడ్డి ఇవాళ సాయంత్రం (బుధవారం సాయంత్రం 4.30 గంటలకు) ఢిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టు గురించి వీరిద్దరూ చర్చించారు. ఈ గోదావరి-బనకచర్ల లింకు ప్రాజెక్టును మంత్రిత్వశాఖ నిబంధనలకు అనుగుణంగా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటామని కిషన్ రెడ్డికి.. సీఆర్ పాటిల్ తెలియజేశారు. అన్ని భాగస్వామ్యపక్షాలతో చర్చించిన తర్వాత పారదర్శకమైన పద్ధతిలోనే ప్రాజెక్టుకు సంబంధించిన నిర్ణయం ఉంటుందన్నారు. ఈ విషయంలో ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగకుండా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి సీఆర్ పాటిల్ భరోసా ఇచ్చారు.

**కేంద్రమంత్రి ఖట్టర్‌తో కిషన్ రెడ్డి భేటీ**

కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో శ్రమ్ శక్తి భవన్‌లో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి సమావేశమయ్యారు. తెలంగాణలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల స్థితి గురించి చర్చించారు. మరీ ముఖ్యంగా హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ పనులకు కేంద్ర ప్రభుత్వ సహకారం అంశంపై చర్చ జరిగింది. మెట్రో ఫేజ్-2 కోసం తెలంగాణ ప్రభుత్వం పంపించిన డీపీఆర్ ఇటీవలే అందిందని ఖట్టర్ తెలిపారు. ఈ డీపీఆర్‌ను మంత్రిత్వశాఖ అధికారులు పరిశీలిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన డీపీఆర్‌లో కేంద్ర ప్రభుత్వం చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకుని ఈ డీపీఆర్ రూపొందించి ఉంటారని ఖట్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వాభివృద్ధికి కేంద్రం నిరంతరం సహకారం అందిస్తుందని ఆయన వెల్లడించారు.

## రైతుల సంక్షేమం విషయంలో తెలంగాణ ప్రభుత్వం భేష్

**సుప్రీం కోర్టు వేసిన హై పవర్ కమిటీ**

**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** పంజాబ్ రైతుల విషయంలో సుప్రీం కోర్టు గతంలో వేసిన హై పవర్ కమిటీ తెలంగాణ ప్రభుత్వాన్ని అభినందించింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం పనిచేస్తుందని, రైతుల ఆర్థికాభివృద్ధికి ఎంతగానో దోహదపడ్తుందని కొనియాడింది. ఈరోజు హర్యానా రాష్ట్రంలోని పంచకుల నగరంలో ప్రభుత్వ వ్యవసాయ కార్యాలయం లో హై పవర్ కమిటీ తో రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, విత్తన చట్టం కమిటీ సభ్యులు భేటీ అయ్యారు. ఈ సమావేశంలో హై పవర్ కమిటీ తెలంగాణ రాష్ట్రంలోని రైతుల సమస్యలు, ప్రభుత్వ పథకాలు, ప్రధాన పంటలపై సుదీర్ఘంగా చర్చించారు. ఐతే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు చేసిన రుణమాఫీ, రైతు భరోసా, సన్నాలకు బోనస్, రాయితీ లపై వ్యవసాయ పనిముట్లు లాంటి పథకాలపై హై పవర్ కమిటీ కి తెలంగాణ బృందం వివరించింది. దానికి హై పవర్ కమిటీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని, సీఎం రేవంత్ రెడ్డిని అభినందించారు. ఇతర రాష్ట్రాల్లో రైతుల సమస్యలు, అక్కడి పాలసీలకంటే తెలంగాణలో బాగా ఉన్నాయని హై పవర్ కమిటీ అభిప్రాయపడింది. అదేవిదంగా ములుగు విత్తనోత్పత్తి ఘటనపై కూడా హై పవర్ కమిటీ ఆరా తీసింది. ములుగు లో జరిగిన ఇష్యూ ను మల్టీనేషనల్ విత్తన కంపెనీల మోసాలపై హై పవర్ కమిటీ దృష్టికి తెచ్చారు రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి. సమగ్ర మైన విత్తన చట్టం తోనే విత్తన కంపెనీలను కట్టడి చెయ్యొచ్చని, విత్తనోత్పత్తి చేసే రైతులకు న్యాయం జరుగుతుందని వివరించారు. ఐతే విత్తన చట్టం తీసుకురావడంలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు పై కూడా హై పవర్ కమిటీ కివివరించారు. వ్యవసాయం రాష్ట్ర పరిధిలోని అంశమని విత్తన చట్టం రాష్ట్ర పరిధి లోకే వస్తుందని, కేంద్రం అడ్డుకునే విధానం సరికాదన్నారు. తెలంగాణ బృందం చేసిన విలువైన సూచనలను హై పవర్ కమిటీ నోట్ చేస్తుకుందని, మరిన్ని సలహాలు సూచనలు ఉంటే.. సీల్డ్ కవర్లో రాసి పంపాలని హై పవర్ కమిటీ చెప్పినట్లు కోదండరెడ్డి తెలిపారు. హై పవర్ కమిటీ ఆహ్వానం మేరకే హర్యానాకు వచ్చినట్లు ఆయన వివరించారు. ఇక రెండో రోజు పర్యటనలో భాగంగా ఇవాళ హర్యానా రాష్ట్రంలోని పంచకుల జిల్లా రాయపూర్ రాణి మండలం హరిపూర్ గ్రామంలో పర్యటించారు. అక్కడి రైతులతో సమావేశమయ్యారు. హర్యానాలో వ్యవసాయ పరిస్థితులు, రైతుల ఇబ్బందులు, విత్తన చట్టం అమలు తీరు, రైతాంగం కోసం హర్యానా రాష్ట్ర ప్రభుత్వ ప్రవేశ పెట్టిన పథకాలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణలో అమలవుతున్న పథకాలను వివరించారు.

**హై పవర్ కమిటీ సమావేశంలో హాజరైన వారు వీరే..**

హై పవర్ కమిటీ చైర్మన్ జస్టిస్ నవాబ్ సింగ్, కమిటీ సభ్యులు దేవేందర్ శర్మ, డా. సూక్పాల్ సింగ్, ప్రొఫెసర్ ఆర్ఎస్ గుమన్, బీఎస్ సందు హై పవర్ మెంబర్ సెక్రెటరీ డా. అమిత్ అగర్వాల్ ఉంటే... ఇక తెలంగాణ రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండ రెడ్డి, తెలంగాణ సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, రైతు కమిషన్ సలహాదారులు రామాంజనేయులు, డా. దొంతి నర్సింహ రెడ్డి, వ్యవసాయశాఖ అధికారులు శివ ప్రసాద్, హరి వేంకట ప్రసాద్, హర్యానా మరియు పంజాబ్ రాష్ట్రాల వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు కూడా సమావేశంలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వాలు అభివృద్ధికి బాటలు వేశాయి

**ఏమైపోతుందో అనుకున్న ఆర్టీసీని లాభాల బాట పట్టించాం**

**ఆర్టీసీ స్థలాలపై సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటు చేయండి**

**మధిర బస్ స్టాండ్ శంకుస్థాపన సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**



**మధిర (జనంసాక్షి) :** ఊరికో బస్సు, ఇంటికో దీపం పేరిట నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి కాలం నుంచి రాష్ట్రంలో అభివృద్ధికి బాటలు వేసామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం నియోజకవర్గ కేంద్రంలో 10 కోట్లతో నిర్మించనున్న బస్టాండ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన, 10 కొత్త బస్సుల ప్రారంభం అనంతరం ఏర్పాటుచేసిన సభలో ప్రసంగించారు. ఊరికో బస్సు నినాదంతో రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యాన్ని కల్పించాలని, కరెంటు లేని ఇల్లు ఉండదని ఇంటికో దీపం పేరుతో ప్రతి ఇంట్లో విద్యుత్ వెలుగులు విరజిమ్మలనేది కాంగ్రెస్ ప్రభుత్వాల సిద్ధాంతం అన్నారు. నేటి వరకు ఈ విధానాన్ని ముందుకు తీసుకు వెళ్తున్నాం అన్నారు. ఆర్టీసీని లాభాల బాట పట్టించేందుకు రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ నిత్యం కృషి చేస్తున్నారని డిప్యూటీ సీఎం అభినందించారు. ఏమైపోతుందో అనుకున్న ఆర్టీసీని ప్రజా ప్రభుత్వం లాభాల బాట పట్టించిందని, జనాభాలో సగభాగమైన మహిళలను గౌరవించుకునేందుకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించామన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో మహిళలకు 186 కోట్ల జీరో టికెట్లు జారీ చేయగా 6,250 కోట్లు ఆర్థిక శాఖ ఆర్టీసీకి చెల్లించాల్సి ఉండగా ఇందులో ఇప్పటికే 6,210 కోట్ల రూపాయలు ఆర్టీసీకి చెల్లించాం అన్నారు. మహిళల ఉచిత ప్రయాణాలతో ఆర్టీసీ బస్సులు నిండుగా పూర్తి సామర్థ్యంతో రాష్ట్రంలో తిరుగుతున్నాయి అన్నారు. ఆర్టీసీకి ఆదాయం కల్పించడంతోపాటు మహిళలను మహాలక్ష్మి లుగా గౌరవించుకుంటున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. మధిర బస్టాండ్ పరిసరాల్లో నీళ్లు నిలబడుతున్నాయని చెప్పగానే రవాణా శాఖ మంత్రి నివేదిక తెప్పించుకొని ఆర్టీసీ బోర్డులో ప్రవేశపెట్టి పది కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసినందుకు రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ కు మధిర నియోజకవర్గ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. అత్యాధునిక వసతుల తో, నాణ్యతతో మధిర బస్టాండ్ పనులు త్వరితగతిన పూర్తి కావాలని డిప్యూటీ సీఎం అన్నారు. మధిర లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు జరుగుతున్నాయి, ఆర్టీసీ డిపో డ్రైనేజీని అనుసంధానం చేయాలని అధికారులను ఆదేశించారు. మధిర నియోజకవర్గ అభివృద్ధికి బస్టాండ్ ఆయూ పట్టు అన్నారు. బ్యాటరీతో నడిచే 600 బస్సులను మహిళా సంఘాలకు ఇచ్చాం, రాబోయే రోజుల్లో స్వయం సహాయక సంఘాల సభ్యులకు బ్యాంకుల నుంచి లింకేజీ ఇప్పించి, బస్సులు కొనుగోలు చేయించి, ఆ బస్సులను ఆర్టీసీకి లీజుకు ఇప్పించి మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతాం అని డిప్యూటీ సీఎం తెలిపారు. ఆర్టీసీ సంస్థ భవనాలపై సోలార్ ఉత్పత్తికి రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసుకొని సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయాలని డిప్యూటీ సీఎం సూచించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370